www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
శనివారం, 24.01.2026

@mudranews mudratv

సంపుటి:13
సంచిక: 97
పేజీలు: 12
వెల: రూ. 5

## ఇదో విచిత్రమైన ముద్ర

గిజా మహా పిరమిడ్ భారీ రాళ్లతో నిర్మించబడింది. ఎక్కువ రాళ్లు సుమారు 2.5 టన్నులు (2,500 కిలోలు) బరువు కలిగి ఉంటాయి. అయితే కొన్ని ప్రత్యేక రాళ్లు 25 నుండి 80 టన్నుల వరకు బరువుంటాయి! ఇది ప్రాచీన ఇంజనీరింగ్ కు అద్భుతమైన నిదర్శనం.



## ఆలూమగలకు ఒకే పన్ను!

- విడివిడిగా కాదు.. కలివిడిగా
- సంయుక్తంగా ఫైల్ చేస్తే భారీగా మినహాయింపు
- ఈసారి బడ్జెట్లో ఇంకా ఎన్నో సర్ ప్రైజ్‌లు?

03




## బాసరలో ఘనంగా వసంత పంచమి

- భారీగా తరలివచ్చిన భక్తులు
- వేకువ జామున మూడు గంటల నుండి అక్షరాభ్యాస పూజలు
- రాష్ట్రమంతటా దేవాలయాల్లో వేడుకలు

07



## అనంత్ అంబానీ చేతికి వంతార

వాచీ విలువ దాదాపు రూ. 12.5 కోట్లు 03





## రాధాకిషన్ మిడిల్ ఎంట్రీ

- సమాధానాలు దాటవేసిన కేటీఆర్
- అధికారులే చూసుకుంటారంటూ దాటవేత
- వెంటనే రాధాకిషన్ రావును పిలిచిన సిట్
- 7 గంటల పాటు కొనసాగిన ప్రశ్నలు..
- ముగిసిన కేటీఆర్ సిట్ విచారణ.. వాంగ్మూలం నమోదు

09

# ట్యాపింగ్ ట్రాప్?

## కేసీఆర్ చుట్టూ ఉచ్చు!

- కేటీఆర్ విచారణ పూర్తి.. తదుపరి గురి గులాబీ బాస్?
- తుది నిర్ణయం ఎవరిది? సిట్ ప్రశ్నలతో కేటీఆర్ ఉక్కిరిబిక్కిరి!
- ప్రభాకర్ రావు స్టేట్‌మెంట్ కీలకం: కేసీఆర్ వైపు మళ్లుతున్న దర్యాప్తు
- హరీష్, కేటీఆర్ తర్వాత వంతు ఎవరిది?
- ఎమ్మెల్యేల కొనుగోలు కేసు ఆడియోనే.. కేసీఆర్‌కు ఇప్పుడు ముప్పుగా మారిందా?




ముద్ర, తెలంగాణ బ్యూరో :
ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక దశకు చేరుతోంది. ఈ కేసులో కేసీఆర్ చుట్టూ బిగిస్తోంది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక బృందం కేసీఆర్ ను విచారించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను విచారించిన సిట్.. అంతకు ముందు ప్రభాకర్ రావును కస్టోడియల్ విచారణకు తీసుకున్నది. దీనిపై సిట్ చీఫ్ సజ్జనార్, దర్యాప్తు బృందం కీలక నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. కేసు పురోగతిపై త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక ఇస్తారని తెలుస్తోంది.

**కేటీఆర్ విచారణ**

రాజకీయ రణరంగానికి కారణమైన ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక మలుపు తిరుగుతోంది. ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సిట్ అధికారులు విచారించారు. బుధవారం హరీష్‌రావును విచారించిన సిట్ గురువారం కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని ఆదేశించడంతో..

మిగతా 02లో..

## వీరత్వానికి గద్దె..

### ఆదివాసీ ఆత్మగౌరవానికి వేదిక

- ప్రకృతి ఆరాధనే పరమావధి
- నాగులమ్మకే తొలి పూజ
- గొట్టు - గోత్రాల వారసత్వం
- జంపన్న వాగులో పుణ్యస్నానాలు
- బంగారమే ప్రసాదం
- రాతి స్తంభాలపై కోయ సంస్కృతి
- ధైర్యానికి మారుపేరు సమ్మక్క
- విస్తరించిన గద్దెలు - పెరిగిన భక్తజనం
- ఆసియాలోనే అతిపెద్ద గిరిజన ఉత్సవం

04



దట్టమైన అడవి.. కోట్లాది మంది భక్తి భావం.. అన్యాయంపై అడవి బిడ్డలు చేసిన అలుపెరుగని పోరాటమే 'మేడారం'. ఇది కేవలం ఒక గిరిజన ఉత్సవం కాదు, ఎనిమిది శతాబ్దాల వీరత్వానికి, ఆత్మగౌరవానికి గద్దె కట్టిన చరిత్ర. ప్రకృతి ఆరాధన ప్రాతిపదికగా, గొట్టు-గోత్రాల సాక్షిగా, విగ్రహాలు లేని వేదికపై సాగే ఈ జనప్రవాహం.. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళాగా ప్రపంచ యవనికపై సగర్వంగా నిలుస్తోంది.

## మళ్లీ వీధి పంచాయితీ

### తెలంగాణలో వీధి కుక్కల హననం..

- పోలీసులకు ఫిర్యాదుల వెల్లువ!
- పిచ్చి కుక్కలు మాత్రమే లక్ష్యమని పలువురి వివరణ

03



## ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాప్



- కాంగ్రెస్ ప్రభుత్వంపై టీబీజేపీ అధ్యక్షుడి రామచంద్రారావు ఫైర్
- ఫోన్ ట్యాపింగ్ విచారణతో కాంగ్రెస్ కాలయాపన

02

## సిట్ అధికారులకు స్వేచ్ఛ లేదు



- కేంద్రమంత్రి బండి సంజయ్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో అధికారులపై ప్రభుత్వ పెద్దల ఒత్తిడి
- కేటీఆర్, హరీశ్ రావు ఫోన్లు ట్యాప్ అయ్యాయని చెప్పేందుకే పిలుస్తున్నారా..?

02

## సిట్ విచారణలో జోక్యం ఉండదు



- ఎవరినీ ఎప్పుడు విచారించాలో సిట్ పరిధిలోని అంశం
- సిట్ ప్రశ్నలతో హరీశ్ మైండ్ బ్లాక్ అయింది
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

02

## రాజ్యాంగం ప్రకారమే విచారణ



- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- ఈ కేసులో రాజకీయ కక్ష్య సాధింపు ధోరణి లేదు
- తోడ బుట్టిన చెల్లెలే ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతోంది

02

## మేడారం జాతరకు కేంద్రం నిధులు

రూ.3.70 కోట్లు విడుదల 02



## వనంలో అధునాతన టెక్నాలజీ

### మేడారంలో తొలిసారి AI వినియోగం

ముద్ర, తెలంగాణ బ్యూరో :
మేడారం జాతరలో కనీవినీ ఎరుగని రీతిలో ఈసారి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర. సుమారు రెండు కోట్ల మంది భక్తులు మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొని మొక్కలు చెల్లిస్తుంటారు. 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ మేడారం జాతర అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం , కనీవినీ ఎరుగని రీతిలో వైభంగా ఏర్పాట్లు చేసింది. కోటికిపైగా జనం నాలుగు రోజుల్లో జాతర దర్శించుకోవడం అంటే భద్రత సైతం అంతే కట్టుదిట్టంగా ఉండాలి. భక్తులను లూటీ చేసే కేటుగాళ్లు, పిల్లలను అపహరించే కిడ్నాపర్స్, మహిళల మెడలో బంగారు ఆభరణాలు టార్గెట్ చేసే దొంగల ముఠా.. ఇలా వీళ్లందరి భారి నుంచి మేడారం జాతరకు రోజూ లక్షలాదిగా తరలివచ్చే భక్తులను రక్షించాల్సిన తెలంగాణ పోలీసుశాఖపై ఉంది. అందులోనూ రెండేళ్ల క్రితం మేడారం జాతరలో తప్పిపోయిన పిల్లలు వృద్ధుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఈసారి AIతో పోలీసులు రంగంలోకి దిగారు.

**తప్పిపోయిన పిల్లలు ఇక సేఫ్ నేరస్తులపైనా ఫోకస్**

10



## అదో దండుపాళ్యం బ్యాచ్

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ముద్ర, తెలంగాణ బ్యూరో :



ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరయ్యే ముందు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్ సీరియస్ కామెంట్స్ చేశారు. కేబినెట్‌లో ఉన్నదంతా దండుపాళ్యం బ్యాచ్ అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సాగుతున్న విచారణలపై సీరియస్ కామెంట్స్ చేశారు. వ్యక్తిత్వాన్ని దెబ్బ తీయడానికే దుష్ప్రచారం చేస్తున్నారని అసలు దొంగలంతా కేబినెట్‌లో ఉన్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఇలా చేసిన రేవంత్ రెడ్డి ని అసలు వదిలి పెట్టే ప్రసక్తి లేదని వార్నింగ్ ఇచ్చారు. పదిహేనేళ్లుగా రాష్ట్రం కోసం పని చేశానని కేటీఆర్ చెప్పుకున్నారు. 'నా ప్రాంతం కోసం మా నాయకులు మాకు ఏ బాధ్యత అప్పగించినా మేము శక్తివంచన లేకుండా నిబద్ధతతో పనిచేశాం. మేము ఎప్పుడూ టైంపాస్ రాజకీయాలు చేయలేదు.' అన్నారు. ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కొన్నామని ఎప్పుడూ వారి కుటుంబాన్ని రోడ్డుపైకి లాగలేదన్నారు. 'ప్రత్యర్థుల కుటుంబాలను, పిల్లలను రాజకీయాల్లోకి లాగలేదు. ప్రత్యర్థులపై అక్రమ కేసులు పెట్టి వేధిం

**అసలు దొంగలంతా కేబినెట్ లోనే.. రేవంత్ ను వదిలిపెట్టం**

మిగతా 02లో..

## ఇదీ ఏఐ ముద్ర

సమ్మక్క-సారక్క బంగారముల్లో.. : ఎన్ని కిలోలు దూగినవ్ 'అక్కా'?





How much do you weigh, sister?”

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
24.01.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





**సిల్లీ పాయింట్ : హెడ్‌ఫోన్స్ చిక్కుముడి**

ఎంత జాగ్రత్తగా జేబులో పెట్టినా, తీసేటప్పటికి అవి 'పాము చుట్టల' కన్నా దారుణంగా ముడిపడి ఉంటాయి.

# ట్యాపింగ్ ట్రాప్..?

**(మొదటి పేజీ తరువాయి)**

జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి కేటీఆర్ హాజరయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను సిట్ బృందం వివిధ అంశాలపై ప్రశ్నలు వేసింది. ఇప్పటి వరకు పలువురిని విచారించిన సిట్.. వారిద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ఆయన్ని క్వశ్చన్ చేసింది. ఈ కేసులో ఇది వరకే అధికారులు, ప్రజా ప్రతినిధులను సిట్ బృందం ప్రశ్నించింది. వారి నుంచి వాంగ్మూలాలను సేకరించింది. వాటి ఆధారంగానే కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఈ విచారణలో ఇద్దరు అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నారు. సీపీ విజయ్ కుమార్, ఏసీపీ వెంకటగిరి ఆయన్ని ప్రశ్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక, శుక్రవారం ఉదయం నందిహిల్స్ నుంచి హరీష్‌రావుతో కలిసి కేటీఆర్ తెలంగాణ భవన్‌కు వచ్చారు. అక్కడ ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మహిళా నేతలు ఆయనకు తిలకం దిద్ది ఆశీర్వదించారు. అనంతరం ఆయన ముఖ్య నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. తననే టార్గెట్ చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దుష్ప్రచారం చేస్తోందని ఇప్పుడు జరుగుతున్నది అదేనంటూ విమర్శలు చేశారు. మీడియా సమావేశం తర్వాత హరీష్‌రావుతో కలిసి సిట్ కార్యాలయానికి కేటీఆర్ వచ్చారు. చాలా దూరంలో అందరి వాహనాలను పోలీసులు ఆపేశారు. కేవలం కేటీఆర్ హరీష్ రావు వాహనాలను పీఎస్ వరకు అనుమతి ఇచ్చారు. పీఎస్ వరకు హరీష్‌రావుతో వచ్చిన కేటీఆర్ ఒక్కడినే విచారణకు అనుమతి ఇచ్చారు. విచారణ జరుగుతున్న టైంలోనే జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. తమను అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశాయి. ముందే తమను తమ నేతలను అడ్డుకోవడంపై మండిపడ్డాయి. అయినా పోలీసులు వారిని నియంత్రించి అక్కడి నుంచి పంపేశారు. ఇలాంటివి జరుగుతాయని ముందే గ్రహించిన పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. విద్యార్థి నాయకులను ముందుగానే అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని పలువురు లీడర్లను ఇంటి నుంచి రానీయలేదు.



**ఒకే ప్రశ్న.. పలు రకాలుగా..**

ప్రధానంగా కేసీఆర్ టార్గెట్ గా ఈ విచారణ సాగుతున్నట్లు అర్థమవుతోంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తుది నిర్ణయం ఎవరిది..? ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేయమని ఎవరు చెప్పారు.. అందులో మీ పాత్ర ఏమిటి..? అప్పటి సీఎం ఏమైనా ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారా..? దీనిపై తుది నిర్ణయం ఎవరు తీసుకున్నారు.. అనే ప్రశ్నలు కేటీఆర్ ముందు సిట్ టీం ఉంచినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎందుకంటే కేసీఆర్ చుట్టూరా ఉచ్చు బిగిస్తేనే.. ఆయనకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచేందుకు అనుమతి ఉంటుందని సిట్ భావిస్తున్నది.

**అదే కారణం..?**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేరును ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధానంగా ప్రస్తావించడానికి కారణం నాడు జరిగిన ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం. అప్పట్లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి కేంద్రంలో ఉన్న బీజేపీ నాయకులు ప్రణాళిక రూపొందించారని ముఖ్యమంత్రి హోదాలో ఉన్న కేసీఆర్ విమర్శలు చేశారు. అంతేకాదు, ఒక ఆడియో కూడా విడుదల చేశారు. అయితే ట్యాపింగ్ వల్లనే ఈ ఆడియో బయటికి వచ్చిందని సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఆడియోను ఎలా రికార్డ్ చేశారు? ఎక్కడి నుంచి వివరాలు సేకరించారు? అనే విషయాలను పోలీసులు రాబట్టారని తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితులైన ప్రభాకర్ రావు, రాధా కిషన్ రావుతో పాటు పలువురు ఇచ్చిన స్టేట్మెంట్ల ప్రకారం కేసీఆర్ ను సిట్ విచారించే అవకాశం ఉందని తెలుస్తోంది. నాడు కేసీఆర్ ఆరోపించిన ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో దక్కన్ కిచెన్ యజమాని నందకుమార్ ను కూడా పోలీసులు విచారించారు. ఆయన స్టేట్మెంట్ కూడా రికార్డ్ చేశారు. నందకుమార్ ఫోన్ ను ట్యాప్ చేయడం ద్వారానే.. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం నాడు కేసీఆర్ గుర్తించారని సిట్ భావిస్తోంది. అప్పట్లో ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ నిర్వహించిన విలేకరుల సమావేశం.. మీడియాలో ప్రసారమైన ఆడియో, వీడియో రికార్డులను కూడా ఇప్పటికే సేకరించింది. వీటి ఆధారంగానే నాటి మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ కు నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. బీజేపీ నేతలను అడ్డంగా ఇరికించడానికి కేసీఆర్ ఆడియో టేపులను బయటపెట్టారు. అవే ఇప్పుడు ఆయనకు చిక్కులు తెచ్చాయని పొలిటికల్ సర్కిల్స్ లో నడుస్తోంది.

**ఇక మిగిలింది కేసీఆరే**

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ బృందం కీలక విచారణ మొత్తం పూర్తి చేసింది. అధికారులు, పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను విచారించిన తర్వాత హరీష్ రావు, కేటీఆర్ ను విచారణకు పిలిచారు. ముందు నుంచీ అప్పటి ఇంటలిజెన్సీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు పలువు పోలీసులు చెప్పిన ఆన్సర్ కేవలం ఒక్కటే. అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాల ప్రకారమే తాము ట్యాపింగ్ చేశామని చెప్పుకొచ్చారు. దీనిలో భాగంగానే ఇప్పుడు సిట్ టీం.. కేటీఆర్ వరకూ వచ్చింది. కేటీఆర్ విచారణ తర్వాత కేసీఆర్ కు నోటీసులు ఇస్తారని టాక్.

## సిట్ విచారణలో ప్రభుత్వం జోక్యం ఉండదు

- **ఎవరినీ ఎప్పుడు విచారించాలో సిట్ పరిధిలోని అంశం**
- **సిట్ ప్రశ్నలతో హరీశ్ మైండ్ బ్లాక్ అయింది**
- **ఈటల జమున ఫోన్‌ను ట్యాప్ చేసి ఇబ్బందులుపెట్టారు**
- **ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

**ముద్ర, హైదరాబాద్ :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ చేపడుతున్న విచారణలో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేసుకోదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య స్పష్టం చేశారు. ఎవరిని, ఎప్పుడు విచారించాలన్నది పూర్తిగా సిట్ పరిధిలోని అంశమని తెలిపారు. సిట్ ప్రశ్నలతో హరీష్ రావు మైండ్ బ్లాంక్ అయ్యారని ఎద్దేవా చేశారు.ఎంపీ ఈటల రాజేందర్ ను బీఆర్ఎస్ నుంచి పంపించడానికే ఫోన్ ట్యాపింగ్ కుట్రే కారణమని ఆరోపించారు. ఆయన భార్య జమున ఫోన్‌ను కూడా ట్యాప్ చేసి ఇబ్బందులకు గురిచేశారన్నారు. అక్రమాలకు పాల్పడి ఇప్పుడు కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఫోన్ ట్యాపింగ్ ప్రజాస్వామ్యంలో అత్యంత దుర్మార్గపు చర్య అని వ్యాఖ్యానించారు.



## రాజ్యాంగం ప్రకారమే ఫోన్ ట్యాపింగ్ పై విచారణ

**ముద్ర, హైదరాబాద్ :**
**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమర్ గౌడ్**

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై రాజ్యాంగం ప్రకారమే విచారణ జరుగుతోందని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కేసులో రాజకీయ కక్ష సాధింపు ధోరణి లేదని, అలాంటిది ఉంటే అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకునేవారమని ఆయన అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారంలో సిట్ అధికారులు వ్యక్తిగత హననం చేస్తున్నారన్న కేటీఆర్ ఆరోపణలు హాస్యాస్పదమని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని, దీనిపై కేటీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. తోడ బుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ అయ్యిందని చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. సినీ తారల ఫోన్లు ఎందుకు ట్యాప్ చేయాల్సి వచ్చిందో కూడా కేటీఆర్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ భద్రతకు విఘాతం కలిగించే శక్తులపైనే ట్యాపింగ్ జరగాలన్నది నిబంధన అని పేర్కొన్న ఆయన, గత పాలనలో అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమ ట్యాపింగ్ చేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేవలం మూడు నెలల్లోనే 547 ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఆరోపించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుందని తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం అవినీతి అంశంపై కేసీఆర్ కుటుంబంపై ఎందుకు చర్యలు లేవని కేంద్రమంత్రి బండి సంజయ్ను ప్రశ్నించిన మహేశ్ కుమార్ గౌడ్, బీజేపీ నేతల ఈడీ కేసులు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాప్

- **కాంగ్రెస్ ప్రభుత్వంపై టీబీజేపీ అధ్యక్షుడు ఫైర్**
- **ఫోన్ ట్యాపింగ్ విచారణతో కాంగ్రెస్ కాలయాపన**

**ముద్ర, హైదరాబాద్ :**

ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయిస్తోందనే అనుమానం ఉందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపైనా దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసు లో విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందనిఆరోపించారు. ఈ కేసులో దోషులను శిక్షించే చిత్తశుద్ధి సర్కారుకు లేదని విమర్శించారు. నిజంగా ఆ చిత్తశుద్దే ఉంటే ఈ కేసుతో సంబంధం ఉన్న రాజకీయ నాయకులను కూడా అరెస్ట్ చేసి ఉండేవారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాజ్యాంగాన్ని ఉల్లంఘించి ఫోన్లు ట్యాపింగ్ చేయించిన నాయకులు విచ్చలవిడిగా తిరుగుతున్నారని ఆరోపించారు.

## సిట్ అధికారులకు స్వేచ్ఛ లేదు

- **కేంద్రమంత్రి బండి సంజయ్**
- **ఫోన్ ట్యాపింగ్ కేసులో అధికారులపై ప్రభుత్వ పెద్దల ఒత్తిడి**
- **కేటీఆర్, హరీశ్ రావు ఫోన్లు ట్యాప్ అయ్యాయని చెప్పేందుకే పిలుస్తున్నారా..?**

**ముద్ర, హైదరాబాద్ :**

ఫోన్ ట్యాపింగ్ కేసుపై సిట్ అధికారుల విచారణ పక్కదారి పడుతోందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఈ కేసు విషయంలో సిట్ విచారణ ఆశించిన స్థాయిలో జరగడం లేదని విమర్శించారు. విచారణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సిట్ అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలు చెప్పిన విధంగానే సిట్ అధికారులు వ్యవహరించాలని ఒత్తిడి పెరుగుతోందని కీలక వ్యాఖ్యలు చేశారు. సిట్‌లోని అధికారులు చాలా నిజాయితీపరులు,, అనుభవజ్ఞులన్నారు. వారిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవన్నారు. కానీ కేసు విచారణలో వారికి ఎంత స్వేచ్ఛ నిచ్చారనే దానిపై అనుమానాలు వస్తున్నాయని అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. అసలు ఈ కేసులో హరీశ్ రావు, కేటీఆర్‌లు అందరి ఫోన్లను ట్యాపింగ్ చేశారని విచారణకు పిలిచారా..? లేక వారి ఫోన్లు ట్యాప్ అయ్యాయని విచారిస్తున్నారా..? అనే విషయాన్ని సిట్ అధికారులు స్పష్టం చేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సిరిసిల్ల వేదికగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకుని ఫోన్ ట్యాపింగ్ దందాకు తెరలేపారని ఆరోపించారు. కేసీఆర్ కూతురు కవితే.. తన ఫోన్ ట్యాప్ అయిందని చెప్పిందన్నారు. ట్యాపింగ్‌కి భయపడి ఓ ఏడాది హరీష్ రావు, కవిత దంపతులు కూడా ఫోన్లు వాడలేదని గుర్తు చేశారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఫోన్ ట్యాపింగ్ మాటున రూ.వేల కోట్ల లావాదేవీలు జరిగాయని బండి సంజయ్ ఆరోపించారు. ఇందులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రముఖ బిజినెస్‌మెన్లు, రాజకీయ నాయకులు, సినిమా సెలబ్రిటీలు, జడ్జీలు బాధితులు అని జగమెరిగిన సత్యం అన్నారు. కేసీఆర్ కుటుంబమే ఫోన్లు ట్యాప్ చేయించిందని తెలిసినా.. ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును అరెస్ట్ చేసేందుకు ప్రభుత్వం ఎందుకు ధైర్యం చేయడం లేదని ప్రశ్నించారు. ఈ సిట్ విచారణను ఎలా నమ్మమంటారు? ఇప్పటివరకు ఏం సాధించారో చెప్పాలన్నారు. ప్రభుత్వంపై వస్తున్న అవినీతి ఆరోపణలను డైవర్ట్ చేసేందుకు ఫోన్ ట్యాపింగ్ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం ఆయుధంగా వాడుకుంటోందని బండి సంజయ్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో బిచ్చగాళ్లు కూడా.. వాట్సాప్ కాల్ మాట్లాడాల్సిన పరిస్థితి ఉండేదని చెప్పారు. ఈ కేసులో తనకు కూడా సిట్ నోటీసులు ఇచ్చి వాంగ్మూలం తీసుకుందని బండి సంజయ్ అన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తూనే ఉన్నారని మండిపడ్డారు.



## మేం ఊరుకోం..

- **సప్త సముద్రాల్లో అవతల దాక్కున్నా లాక్కొస్తాం**
- **పోలీసు అధికారులకు హరీష్‌రావు వార్నింగ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో కక్ష పూరిత రాజకీయాలు నడుస్తున్నాయని ఇందులో అధికారులు పావులుగా మారుతున్నారని హరీష్‌రావు ఆరోపించారు. ఎవర్నీ వదిలి పెట్టబోమన్నారు. శ్రుతిమించి ప్రవర్తిస్తున్న అధికారులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారని వార్నింగ్ ఇచ్చారు. దావోస్‌లో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే వచ్చే కాలంలో కేసుల్లో ఇరుక్కుంటారని హెచ్చరించారు. రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్నాం తర్వాత ఎవరూ ఏం చేయలేరనే ధీమా వద్దని కూడా చెప్పారు. రిటైర్మెంట్ తర్వాత సప్త సముద్రాల అవతల దాక్కున్నా లాక్కొచ్చి చట్టం ముందు నిలబెడతామని సీరియస్ అయ్యారు. కేటీఆర్‌తో సిట్ కార్యాలయం వరకు వచ్చిన ఆయన అక్కడ మీడియాతో మాట్లాడారు. పోలీసు అధికారులు, ప్రభుత్వాధికారులు న్యాయబద్ధంగా వ్యవహరించాలని, చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు సూచించారు. వాటిని మీరితే మాత్రం తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ఇప్పుడు ప్రభుత్వం అండగా ఉండవచ్చేమో కానీ రేపటి రోజున కచ్చితంగా ఇంతకింతా అనుభవిస్తారని అన్నారు. అప్పుడు సొంత డబ్బులు పెట్టి కేసులు వాదించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. తమపై చాలా కాలం నుంచి దుష్ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో పోలీసులు చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పుడు జరుగుతున్నదంతా కేవలం రాజకీయ కక్ష సాధింపేనని హరీష్ అభిప్రాయపడ్డారు. వివిధ స్కామ్‌లలో ఇరుక్కున్న ప్రభుత్వ పెద్దలు వాటి నుంచి ప్రజల దృష్టిని డైవర్ట్ చేయడానికే విచారణ పేరుతో వేధిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని విధాలుగా వేధించినా తమ పోరాటం మాత్రం ఆపేది లేదని ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూనే ఉంటామని అన్నారు



# అదో దండుపాళ్యం బ్యాచ్

**(మొదటి పేజీ తరువాయి)**

చలేదు. మా నాయకుడు కెసిఆర్ మేనిఫెస్టోలో చెప్పని హామీలను కూడా నెరవేర్చిన నాయకుడు. రైతు బంధు, కళ్యాణ లక్ష్మి, కెసిఆర్ కిట్ ఇలా ఎన్నో గొప్ప కార్యక్రమాలు మేము ప్రజల కోసం చేశామని కేటీఆర్ అన్నారు. రెండేళ్లలో రాష్ట్రంలో పూర్తిగా పరిస్థితి దారుణంగా మారిపోయాయని కేటీఆర్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు ప్రశ్నిస్తున్న వారిపై కేసులు, వేధింపులు సాగుతున్నాయని ఆరోపించారు. "గత రెండేళ్లుగా చూస్తుంటే ఈ రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిపోయింది. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే సత్తా ఈ ప్రభుత్వానికి లేదు. ఏదో రకంగా కాలక్షేపం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి రోజుకో కొత్త డ్రామా ఆడుతున్నారు. అందులో భాగంగానే ఈ కాళేశ్వరం డ్రామా, గొర్రెల స్కామ్ డ్రామా, ఫార్ములా ఈ డ్రామా, ఫోన్ ట్యాపింగ్ డ్రామాలు ఆడుతున్నారు." అని మండిపడ్డారు.





**తాను ఎలాంటి తప్పు చేయలేదని కేటీఆర్ స్పష్టం**

ఫోన్ ట్యాపింగ్ కేసులో తనను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిత్వ హననం చేస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎప్పుడూ అక్రమాలు, అన్యాయాలకు పాల్పడలేదని అంతరాత్మ సాక్షిగా చెబుతున్నానని అన్నారు. గత ఏడెనిమిది సంవత్సరాలుగా తనపై డ్రగ్స్ కేసులు, హీరోయిన్లతో సంబంధాలంటూ తప్పుడు ప్రచారం సాగుతోందని, దీంతో తన కుటుంబం మానసిక క్షోభకు గురైందని తెలిపారు.ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతామని, చట్టాన్ని గౌరవించే పౌరులమని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఫోన్ ట్యాపింగ్ జరగడం లేదని ఏ పోలీస్ అధికారి అయినా కెమెరా ముందు చెప్పగలడా అని ప్రశ్నించారు. ప్రస్తుత క్యాబినెట్‌ను "దండుపాళ్యం బ్యాచ్"గా అభివర్ణించిన కేటీఆర్, అవినీతిని బయటపెడుతున్నందుకే తమపై కక్ష కట్టారని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థత, అవినీతి, నెరవేర్చని హామీలపై పోరాటం ఆగదని, కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసే వరకూ పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.

## మేడారం జాతరకు కేంద్రం నిధులు రూ.3.70 కోట్లు విడుదల



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం రూ.3.70 కోట్ల నిధులను విడుదల చేసింది. పర్యాటక, గిరిజన వ్యవహారాల శాఖలు సంయుక్తంగా ఈ నిధులు కేటాయించాయి. ఇప్పటికే 'గిరిజన సర్క్యూట్' పథకం కింద పరిసర ప్రాంతాల అభివృద్ధికి రూ.80 కోట్లు వెచ్చించిన కేంద్రం, జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించనుంది.ఇదిలా ఉండగా, యునెస్కో వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం అభివృద్ధికి రూ.140 కోట్లు ఖర్చు చేస్తోంది. జాతర సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే నాలుగు రోజుల పాటు 30 ప్రత్యేక రైళ్లను నడుపుతామని ప్రకటించింది. కేంద్ర సహకారంతో ఈసారి మేడారం జాతర మరింత వైభవంగా జరగనుంది.



**సిల్లీ పాయింట్ : షాంపూ బాటిల్ పొదుపు**

షాంపూ అయిపోవచ్చినప్పుడు అందులో కొంచెం నీళ్లు పోసి, గట్టిగా ఊపి మరికొన్ని రోజులు వాడుతుంటాం. ఆ తృప్తే వేరు!

# మళ్లీ వీధి పంచాయితీ





- తెలంగాణలో వీధి కుక్కల హననం..
- పోలీసులకు ఫిర్యాదుల వెల్లువ!
- పిచ్చి కుక్కలు మాత్రమే లక్ష్యమని పలువురి వివరణ

**ముద్ర, తెలంగాణ :**

తెలంగాణ రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా 'వీధి కుక్కల' అంశం వార్తల్లో నిలుస్తోంది. పంచాయతీ ఎన్నికల సమయంలో బరిలో నిలిచిన అభ్యర్థులు తమను ఎన్నికల్లో గెలిపిస్తే కుక్కలు, కోతులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు కొందరు కోతులను పట్టేవారిని పిలిపించి వాటిని పట్టించి అటవుల్లో విడిలేస్తున్నారు. ఇక కొందరు గ్రామస్తులను ఇబ్బంది పెడుతున్న వీధి కుక్కలకు విషం పెట్టి చంపేస్తున్నారు. దీనిపై ఇటీవలే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాజీ భార్య రేణు దేశాయ్, టీవీ యాంకర్, నటి రష్మీ ప్రెస్ మీట్ పెట్టి మరీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నీరు పెట్టుకున్నారు. ఈ క్రమంలో జంతు సంరక్షణ సంస్థలు గ్రామ పంచాయతీ నాయకులపై ఆరోపణలు చేశాయి. పోలీసులు ఫిర్యాదులు చేస్తున్నారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

**మాచారెడ్డి ప్రాంతంలో 244 మరణాలు**

కామారెడ్డి జిల్లా మాచారెడ్డి పోలీసు స్టేషన్ పరిధిలో భవానీ పేట, పాల్వంచ, ఫరీద్ పేట్ గ్రామాల్లో 244 కుక్కలు చంపినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు స్టేట్ యానిమల్ ఫౌండేషన్ నుంచి ఏ.గౌతమ్ జనవరి 12న ఫిర్యాదు చేశారు. దీంతో పశు వైద్యులు పోస్ట్ మార్టం చేసి శాంపిల్స్ ల్యాబ్‌కు పంపారు. సర్పంచుల ప్రమేయం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు.

**శాయంపేట, ఆరేపల్లిలో అరెస్టులు..**

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం శాయంపేట, ఆరేపల్లి గ్రామాల్లో 110 కుక్కల మరణాలకు కారణమని తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. సర్పంచులు, కార్యదర్శులు ఈ చర్యకు ఒడిగట్టారని ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదుదారు గౌతమ్ ప్రకారం, స్థానికుల సహకారంతో ఇంజెక్షన్లు ఇచ్చి చంపారు. ఫోరెన్సిక్ రిపోర్టుల అంచనా వేస్తున్నారు.

**ధర్మపురి, యాచారం ఘటనలు**

ధర్మపురి మున్సిపాలిటీలో 40 కుక్కలు ఇంజెక్షన్లతో చంపబడ్డాయని ఫిర్యాదు అందింది. మున్సిపల్ సిబ్బంది పనే అనే ఆరోపణలు ఉన్నాయి. యాచారం గ్రామంలో వందల మంది కుక్కలను ట్రాక్టర్‌లో తరలి పూడ్చారు. ఆంధ్ర నుంచి వచ్చిన వ్యక్తులు పని చేశారని స్థానికులు చెబుతున్నారు. రెండు కేసుల్లోనూ విచారణ లేగా ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సర్పంచులకు అండగా గ్రామస్తులు..**

ఆరేపల్లి సర్పంచ్ కుమారుడు రాజు మాట్లాడుతూ.. తాము పిచ్చి కుక్కలు మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని తెలిపాడు. వాటి వ్యాధులు (చర్మ రోగాలు, ఎలర్జీ) పిల్లలు, రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని పేర్కొన్నాడు. ఎన్నికల వాగ్దానాల ప్రకారం చర్య తీసుకున్నామని ఒప్పుకున్నాడు. స్థానికుడు విజయ్ గ్రామస్తుల మద్దతుతో ఈ చర్య అవసరమని సమర్థించాడు. రోగ వ్యాప్తి ఆంక్షలు పెరిగాయని చెప్పారు.
కేసులు బీఎన్ఎస్ సెక్షన్ 325, జంతు క్రూరత్వ నిరోధక చట్టం సెక్షన్ 11 కింద నమోదయ్యాయి. తెలంగాణలో 2022-2024 మధ్య కుక్కకాటు కేసులు 92,924 నుంచి 1,21,997కి పెరిగాయి. రేబీస్ మరణాలు లేకపోయినా, సమస్య తీవ్రమైంది. అయితే జంతు ప్రేమికులు చట్ట ఉల్లంఘనలకు శిక్ష పడాలని డిమాండ్ చేస్తున్నారు.



# అనంత్ 'చేతి'కి వంతార

- వాచీ విలువ దాదాపు 12.5 కోట్లు
- వివరాలు వెల్లడించిన జాకబ్ అండ్ కో కంపెనీ

**న్యూ ఢిల్లీ :**

మనలో చాలామందికి డబ్బులు ఖర్చు పెట్టాలని ఉంటుంది కానీ.. ఆ స్థాయిలో సంపాదనలేక సైలెంట్ గా ఉండిపోతాం. కానీ కొంతమంది విలాసవంతమైన వస్తువుల కోసం వందలు, వేల కోట్లు ఖర్చు పెడుతుంటారు. ఈ జాబితాలో ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ ముందు వరుసలో ఉంటాడు.. జంతువులపై ఇతడికి విపరీతమైన ప్రేమ ఉంటుంది.. అదే సమయంలో విలాసవంతమైన వస్తువులను కొనుగోలు చేయడానికి ఇతడి మనసు తహతలాడుతూ ఉంటుంది. అందువల్లే అతడు లగ్జరీ బ్రాండ్స్ కోసం విపరీతంగా ఖర్చు పెడుతుంటాడు. తన పెళ్లికి వందల కోట్లను ఖర్చు చేసిన అనంత్.. చేతికి ధరించే గడియారం కోసం ఏకంగా వందల కోట్లు మంచినీళ్ళ ప్రాయం లాగా ఖర్చు పెట్టాడు. ఇప్పుడు అతడు ధరించిన గడియారానికి సంబంధించి సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చ నడుస్తోంది.. ఇంతకీ అతడు ధరించిన వాచి ఏ కంపెనీ తయారు చేసింది? దాని ధర ఎంత అంటే..అమెరికాలోని న్యూయార్క్ లో జాకబ్ అండ్ కో కంపెనీ లగ్జరీ వాచీలను తయారు చేస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలో అనంత్ అంబానీ కోసం కస్టమైస్ వాచి తయారు చేసింది. దానికి వంతరా అని పేరు పెట్టింది. ఇటీవల దీనిని ఆవిష్కరించింది. దీనిని హోరోలాజికల్ మాస్టర్ పీస్ గా అభివర్ణిస్తున్న జాకబ్ ఎండ్ కో.. "ఒపేరా వంతారా గ్రీన్ కామో" గా చెబుతోంది. అనంత్ అంబానికి వంతార అంటే చాలా ఇష్టం. ఈ వాచీ ని జాకబ్ అండ్ కోకంపెనీ అద్భుతంగా రూపొందించింది. ఈ వాచీలో డైమంటాయిడ్ గోమేదికాలు, సావోరైట్ లు, ఆకుపచ్చ రంగులో ఉన్న నీలమని, తెలుపు రంగులో ఉన్న వజ్రాలను ఇందులో వాడింది. 21.98 క్యారెట్ల తో దాదాపు 400 విలువైన స్టోన్స్ వాడింది. ఈ వాచీ విలువ దాదాపు 12.5 కోట్లని జాకబ్ అండ్ కోకంపెనీ తెలిపింది. ఇది అనంత్ అంబానీ కోసం ప్రత్యేకంగా రూపొందించామని వెల్లడించింది. ఈ వాచి తయారు చేయడానికి ఎంత సమయం పట్టిందో మాత్రం జాకబ్ అండ్ కో కంపెనీ బయటికి వెల్లడించలేదు. కాకపోతే ఈ వాచ్ ను జాకబ్ అండ్ కో కంపెనీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆ వీడియో కాస్త ఇప్పుడు సంచలనంగా మారింది.

# 'చౌక' ధరలకు..బియ్యం.. నిత్యావసరాలు

- సన్న బియ్యంతో పాటు ఐదు సరుకులు
- రేషన్ కార్డుదారులకు గుడ్ న్యూస్
- తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ సరఫరా వ్యవస్థలో సంస్కరణల దిశగా ఇప్పటికే సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, ఇప్పుడు బియ్యంతో పాటు మరికొన్ని నిత్యావసరాలను కూడా అందించేందుకు కసరత్తు చేస్తోంది. రేషన్ పాలసీలో మార్పులపై ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచన చేస్తుండగా, త్వరలోనే ఈ నిర్ణయం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. బియ్యంతో పాటు పంచదార, గోధుమలు, జొన్నలు, రాగులు లేదా కందిపప్పు, చింతపండు వంటి ఐదు రకాల నిత్యావసరాలను చౌకధరలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు అధికంగా ఉండటంతో, రేషన్ ద్వారా ఈ సరుకులు అందిస్తే పేదలకు మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ అంశంపై రాబోయే మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుని అధికారిక ఆమోదం ఇవ్వనున్నారు.ఇదిలా ఉండగా, వానాకాలం సీజన్‌లో రాష్ట్రం 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి గత 25 ఏళ్లలోనే రికార్డు నెలకొల్పిందని మంత్రి వెల్లడించారు. ఇందులో 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్న రకాలే కావడం విశేషం. సాంబ మసూరి, తెలంగాణ మసూరి వంటి నాణ్యమైన రకాల సాగుకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం ఇస్తుందని తెలిపారు. ఈ ఖరీఫ్‌లో 14.21 లక్షల మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రూ.17,018 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. సన్న బియ్యం రైతులకు అదనంగా క్వింటాలుకు రూ.500 చొప్పున ఇప్పటివరకు రూ.1,425 కోట్ల బోనస్ అందించినట్లు మంత్రి వెల్లడించారు.



# కాలక్షేపం కోసం చేస్తే.. మూడు కోట్ల వ్యూస్

- ఇన్ స్టాలో 70 ఏళ్ల వినోద్ కుమార్ శర్మ వీడియోకు భారీ ఆదరణ

**ఉత్తర్ ప్రదేశ్ :**

సోషల్ మీడియాలో సెలబ్రిటీ కావాలని చాలామంది తాపత్రయపడుతుంటారు.. ఎందుకంటే నేడు ప్రపంచం మొత్తం సోషల్ మీడియా చుట్టూ తిరుగుతోంది. రకరకాల కంటెంట్ రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటారు. అయితే వారిలో సక్సెస్ అయ్యేది కొంతమంది మాత్రమే. అయితే సోషల్ మీడియాలో సెలబ్రిటీలు అవుతున్న వారిలో చాలామంది యువతి, యువకులే ఉన్నారు. కానీ, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ 70 సంవత్సరాల వ్యక్తి సంచలనం సృష్టించాడు. ఒక వీడియో లక్ష వ్యూస్ సంపాదిస్తేనే గొప్పగా చెప్పుకునే ఈ రోజుల్లో.. ఆ 70 సంవత్సరాల వ్యక్తి వీడియో ఏకంగా మూడు కోట్ల వీక్షణలు సొంతం చేసుకుంది. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వినోద్ కుమార్ శర్మ కు 70 సంవత్సరాల వయసు ఉంటుంది. ఇతడు గతంలో ఉద్యోగం చేశారు. పదవి విరమణ పొందిన తర్వాత కాలక్షేపం కోసం ఇన్ స్టా గ్రామ్ లో ఓ వీడియోను పోస్ట్ చేశాడు. ఆయన పెట్టిన తొలి వ్లాగ్ ఏకంగా మూడు కోట్ల వీక్షణలు సొంతం చేసుకుంది. అయితే ఇతడికి వ్లాగింగ్ లో పెద్దగా అనుభవం లేదు.." నాకు ఈ తరహా వీడియోలు రూపొందించడంలో పెద్దగా అనుభవం లేదు. కాకపోతే కాలక్షేపం కోసం ఇందులోకి వచ్చాను. నా ప్రయత్నాన్ని మీరంతా ప్రోత్సహిస్తారని భావిస్తున్నానని" వినోద్ కుమార్ శర్మ ఆ వీడియోలో చెప్పాడు. ఆ వీడియో కాస్త ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. "మీరు చేస్తున్న ప్రయత్నం చాలా గొప్పగా ఉంది. కాలక్షేపం కోసం కాకుండా.. పూర్తిస్థాయిలో దీనికి సమయం కేటాయించండి. ఇందులో చాలా భిన్నమైన వ్యక్తులను మీరు కలుస్తారు. మీకు వారు తమ అభిప్రాయాలను వెల్లడిస్తారు. వాటి ఆధారంగా మీరు నడుచుకుంటే ఇక తిరిగి ఉండదు. ఎప్పుడైనా సరే వయసు అనేది ఒక సంఖ్య మాత్రమే. నేర్చుకోవడానికి పదవి విరమణ అనేది ఉండదని" నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

# విడివిడిగా కాదు.. కలివిడిగా

- ఆలూమగలకు ఒకటే పన్ను
- సంయుక్తంగా ఫైల్ చేస్తే భారీగా మినహాయింపు
- ఈసారి బడ్జెట్లో ఇంకా ఎన్నో సర్ ప్రైజ్ లు?

**న్యూ ఢిల్లీ :**



మరికొద్ది రోజుల్లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశపెట్టబోతోంది.. ఇప్పటికే బడ్జెట్ కు సంబంధించిన కేటాయింపులు.. ఇతర వ్యవహారాలు పూర్తయినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జాతీయ మీడియాలో బడ్జెట్ కు సంబంధించి ఒక కథనం ప్రసారమవుతోంది. ఈసారి బడ్జెట్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త పన్ను విధానాన్ని తెరపైకి తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. మనదేశంలో పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేయాలనే ఉద్దేశంతో 2020 నుంచి అనేక రకాల మార్పులు తీసుకొస్తున్నారు. 2026 బడ్జెట్లో మాత్రం వివాహితుల కోసం కేంద్ర ప్రభుత్వం సరికొత్తగా "ఆప్షనల్ జాయింట్ టాక్సేషన్"ను తెరపైకి తీసుకురానుంది. ఇప్పటివరకు భార్యాభర్తలు ఒకవేళ ఇద్దరు ఉద్యోగస్తులై.. లేదా భారీగా సంపాదించే వాళ్ళు అయితే.. వారు విడివిడిగా ప్రభుత్వానికి ట్యాక్స్ లు చెల్లిస్తున్నారు. 2026 బడ్జెట్లో మాత్రం కేంద్రం కొత్త ప్రతిపాదన తీసుకొస్తోంది. ఆలూమగలను ఆర్థిక యూనిట్ గా పరిగణిస్తోంది. భార్యాభర్తలు ఇద్దరు సంపాదిస్తే.. దానిని వారిద్దరూ తమ ఉమ్మడి ఆదాయంగా ప్రకటించవచ్చు. దానిపై పన్ను ను చెల్లించవచ్చు. ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలలో ఈ విధానం అమల్లో ఉంది. మన దేశంలో కూడా ఇలాంటి విధానాన్ని అమలు చేస్తే పన్ను చెల్లించే వారు తమ ఆర్థిక ప్రణాళికను మరిత సమర్థవంతంగా రూపొందించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ విధానగనక అమలులోకి వస్తే భార్యాభర్తల ఉమ్మడి పన్ను మినహాయింపు పరిమితి పెరుగుతూ ఉంటుంది. విడివిడిగా ఉన్నప్పుడు లభించే మినహాయింపుల కంటే.. సంయుక్తంగా ఫైల్ చేసినప్పుడు ఒకేసారి భారీగా మినహాయింపు లభిస్తుంది. దీనివల్ల దంపతుల మీద పన్ను భారం తగ్గుతుంది. అంతేకాదు ఒకే ఐ టి ఆర్ దాఖలు చేయడానికి అవకాశం ఉంటుంది.. జాయింట్ ట్యాక్స్ విధానం వల్ల వేతన జీవులకు ప్రామాణిక మినహాయింపులు, ఇతర ప్రయోజనాలు లభిస్తాయి. ఈ విధానం మధ్యతరగతి కుటుంబాలకు ఒక వరంలాగా మారుతుంది. భార్య లేదా భర్త మాత్రమే సంపాదించే కుటుంబాలకు మెరుగైన ప్రయోజనం కలిగిస్తుంది. జాయింట్ ఫైలింగ్ వల్ల పన్ను స్లాబ్ రేటు తగ్గుతూ ఉంటుంది. నీతో పాటు పొదుపు పెరిగే అవకాశం ఉంటుంది. అంతేకాదు కుటుంబాల చేతిలో ఖర్చు చేసుకోవడానికి నగదు భారీగా ఉంటుంది. తద్వారా వినియోగ వ్యవస్థ పెరిగిపోయి.. దేశ ఆర్థిక రంగానికి శక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

# ఇక్కడ కేటీఆర్.. అక్కడ మిథున్



- తెలుగు రాష్ట్రాల్లో విచారణ కాక
- ఒకే రోజు కీలక కేసుల్లో విచారణ పర్వం
- ఉదయం నుంచి రాత్రి వరకు ఉత్కంఠ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలుగు రాష్ట్రాల్లో ఒకే రోజు రెండు కీలక అంశాలు చోటు చేసుకున్నాయి. కేసులు వేరైనా.. దర్యాప్తు సంస్థలు వేరైనప్పటికీ.. రెండు కేసుల్లో ఇద్దరు కీలక నేతలకు విచారణకు హాజరయ్యారు. అమరావతిలో ఒకరు.. హైదరాబాద్ లో ఒకరు దాదాపు ఏడు గంటలకు పైగా విచారణను ఎదుర్కొన్నారు. రెండు రాష్ట్రాల్లో గత ప్రభుత్వాల్లో కీలకంగా వ్యవహరించిన నేతలు కావడంతో.. తాజా పరిణామాలు ఆసక్తిగా మారాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను సిట్ ప్రశ్నించగా.. లిక్కర్ స్కామ్‌లో మిథున్ రెడ్డి విచారణ ఎదుర్కొన్నారు.

**అక్కడ సీఎంలు..**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు, కీలక మంత్రులు దావోస్‌లో పర్యటించారు. ఒకరోజు క్రితం వారంతా దావోస్‌లో కలిసే ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ఎవరికి వారుగానే అంతర్జాతీయ పరిశ్రమలతో చర్చలు జరిపారు. అదే టైంలో రాష్ట్రంలో రాజకీయ కాక పీక్‌స్‌కు చేరింది. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు సెగలు పుట్టిస్తుంటే, ఆంధ్రప్రదేశ్‌లో లిక్కర్ స్కామ్ రాజకీయల్లో కిక్కు తెప్పిస్తోంది. ఈ కేసుల్లో కూడా కీలక నేతలైన కేటీఆర్, మిథున్ రెడ్డి విచారణ ఎదుర్కొన్నారు. వివిధ కోణాల్లో దర్యాప్తు అధికారుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఒకే రోజు వేర్వేరు కేసుల్లో ఇద్దరు కీలక నేతలు విచారణకు హాజరుకావడంపై రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఏపీలో మిథున్ రెడ్డి విచారణ పూర్తయితే.. 6.20 గంటలకు కేటీఆర్ విచారణ ముగిసింది. సుమారు 7 గంటల పాటు వారిని దర్యాప్తు సంస్థలు విచారించాయి.

**ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్**

తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పిన ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే రాజకీయ నాయకులను ప్రశ్నించిన సిట్ ఇప్పుడు కీలక నేతలపై ఫోకస్ పెట్టింది. రెండు రోజుల క్రితం బీఆర్ఎస్‌లో కీలకంగా వ్యవహరించే మాజీ మంత్రి హరీష్‌రావు పిలిచి విచారించారు. ఆయన్ని బాధితుడిగానే విచారించామని పోలీసులు చెబుతున్నారు. హరీష్‌రావును పిలిచి విచారించిన విషయాలపై చర్చ జరుగుతున్న సందర్భంగానే కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారు. కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చి విచారణకు పిలవడంతో సిట్ దూకుడు పెంచిందనే ప్రచారం మొదలైంది. ఈ కేసు అంతా కేటీఆర్, కేసీఆర్ చుట్టే తిరిగింది. వీళ్లిద్దరే తమ ఫోన్‌లు ట్యాప్ చేశారని బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. చివరకు కేసీఆర్ కుమార్తె కవిత కూడా తన భర్త ఫోన్ ట్యాప్ అయ్యిందని అన్నారు. అయితే చేసింది ఎవరూ అనేది మాత్రం ఆమె చెప్పలేదు. అందుకే కేటీఆర్, కేసీఆర్ చుట్టూ తిరుగుతున్ కేసులో ఇప్పుడు కేటీఆర్‌ను విచారణకు పిలవడం ఆసక్తిగా మారింది. ఇప్పటి వరకు వివిధ వర్గాలను విచారించగా వచ్చిన సమాచారం, నేతలు ఇచ్చిన సమాచారం, సిట్ సేకరించిన సమాచారం ఆధారంగా ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ సాధారణ విషయమని, ఇది పోలీసులే చేస్తారని తమకు సంబంధం లేదని కేటీఆర్ చెబుతున్నారు. ఇందులో పిలవాల్సి వస్తే ప్రస్తుతం డీజీపీగా ఉన్న శివధర్‌రెడ్డిని విచారించాలని సవాల్ చేశారు. తమలాంటి వారిని కేవలం కక్ష సాధింపులో భాగంగా విచారిస్తున్నారే తప్ప విషయం లేదని ఎద్దేవా చేశారు. ఎక్కడికైనా ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వెళ్తామని చెప్పుకొచ్చారు. కొంతమంది వ్యక్తులు డబ్బులు పట్టుకొని ప్రభుత్వాలను కూలుస్తామని చెప్పి తిరుగుతున్న టైంలో అధికారులు వారిపై నిఘా పెట్టి ఉండొచ్చని కూడా అన్నారు. హరీష్‌రావు మాదిరిగానే అడిగిందే అడిగి గంటలతరబడి కూర్చోబెట్టి పంపేశారని అంతకు మించి ఏం చేయలేరని చెప్పుకొచ్చారు.

**నిన్న సాయి రెడ్డి.. నేడు మిథున్ రెడ్డి**

వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించి, లిక్కర్ స్కామ్‌లో పేర్లు ఉన్న వారిపై ఈడీ ఫోకస్ చేసింది. ఇందులో వచ్చిన డబ్బులను పన్నులు ఎగ్గొట్టేందుకు సూట్‌కేస్ కంపెనీలతో విదేశాలకు తరలించాలని నిర్దారించుకున్న ఈడీ ఇప్పుడు ఒక్కొక్కర్ని పిలిచి విచారిస్తోంది. గురువారం వైసీపీ మాజీ లీడర్ విజయసాయి రెడ్డిని ప్రశ్నించింది. శుక్రవారం వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని విచారించారు. ఈ కేసులో కూడా ఎలాంటి కుంభకోణం లేదని వైసీపీ గట్టిగానే వాదిస్తోంది. కానీ ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దూకుడుగా ఉంటే, ఈడీ అదే స్పీడ్‌తో ఒక్కొక్కర్ని పిలిచి విచారిస్తోంది. ఇప్పటికే సిట్ కీలక నేతలను అరెస్టు చేసింది. వారిలో కొందరు జైల్లో ఉన్నారు. మరికొందరు బెయిల్‌పై బయటకు వచ్చారు. మిథున్ రెడ్డి కూడా జైలుకు వెళ్లి వచ్చారు. ఇప్పుడు ఈడీ విచారణ ఎదుర్కొన్నారు. మిథున్ రెడ్డి కంటే ఒక రోజు ముందగానే విచారణకు హాజరైన వైసీపీ మాజీ లీడర్ సాయి రెడ్డి కీలక సమాచారం ఈడీ అధికారులకు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో కర్త కర్మ క్రియ అంతా రాజ్ కసిరెడ్డిదేనని అన్నారు. చాలా డబ్బులు చేతులు మారాయని కూడా వాంగ్మూలం ఇచ్చినట్టు ప్రచారంలో ఉంది. సాయిరెడ్డితోపాటు మిగతా వారు ఇచ్చిన వాంగ్మూలాలు ఆధారంగానే మిథున్ రెడ్డిని సుదీర్ఘంగా విచారించారు. ఇలా ఒకే రోజు పొలిటికల్ హీట్ పెంచేంలా ఇద్దరు నేతలు విచారణకు హాజరవ్వడం తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం
24.01.2026
4 వేదిక
Peoples Voice

**అసలు సంపాదకీయాలు ఎప్పుడు మొదలయ్యాయో తెలుసా?**

తెలుగులో తొలి నాటి పత్రికలు కేవలం వార్తలకు, మత ప్రచారానికి పరిమితమయ్యాయి. అయితే, 1874లో కందుకూరి వీరేశలింగం పంతులు గారు ప్రారంభించిన 'వివేకవర్ధిని' పత్రికతో సంపాదకీయాలకు ఒక స్పష్టమైన రూపం వచ్చింది. తర్వాత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ముట్నూరి కృష్ణారావు గారి 'కృష్ణ పత్రిక' (1902) సంపాదకీయాలు తెలుగు ప్రజల్లో దేశభక్తిని రగిలించాయి. ఆయన రాసిన వ్యాసాలు మేధావులను సైతం ఆలోచింపజేసేవి.ఆ తర్వాత కాశీనాథుని నాగేశ్వరరావు గారి 'ఆంధ్ర పత్రిక' దినపత్రికగా మారి, సంపాదకీయాల ద్వారా సమకాలీన రాజకీయాలపై నిశితమైన విశ్లేషణలు అందించడం మొదలుపెట్టింది.

# వీరత్వానికి గద్దె..

## ఆదివాసీ ఆత్మగౌరవానికి వేదిక

మేడారం

తెలంగాణ గుండెకాయ లాంటి ములుగు అడవుల్లో, రెండు సంవత్సరాలకు ఒకసారి ఒక అద్భుతం ఆవిష్కృతమవుతుంది. అది వేద మంత్రాల హోరు లేని, విగ్రహ రూపం లేని, కేవలం భక్తి పారవశ్యం మాత్రమే వినిపించే మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా గుర్తింపు పొందిన ఈ జాతర వెనుక ఎనిమిది శతాబ్దాల నెత్తురు చిందిన చరిత్ర ఉంది.

### వీరనారుల పోరాట పటిమ

మేడారం జాతర అంటే కేవలం మొక్కులు చెల్లించుకోవడం కాదు; అది అన్యాయంపై ఎదిరించిన ఒక జాతి పోరాట స్మృతి. కాకతీయ సేనల ఆధిపత్యాన్ని, పన్నుల భారానికి వ్యతిరేకంగా కత్తి దూసిన వీరవనిత సమ్మక్క. తన బిడ్డలు, భర్త నేలకొరిగినా వెన్నుచూపక పోరాడి, చివరకు చిలకలగుట్టపై కుంకుమ భరిణగా మారి అంతర్ధమైపోయిన ఆ తల్లి.. నేడు కోట్లాది మందికి ఆరాధ్య దైవం.

### గొట్టు గోత్రాల వారసత్వం

కోయ వంశీయుల సంప్రదాయాల ప్రకారం, ఒక్కో వంశానికి ఒక్కో ప్రత్యేకమైన చరిత్ర, చిహ్నాలు ఉన్నాయి. మీరు పేర్కొన్నట్లుగా, ఈ గొట్టు గోత్రాలు ప్రకృతితో మమేకమై ఉన్నాయి..

| | | | |
|---|---|---|---|
| సారలమ్మ | 3వ గొట్టు | ఇప్ప | కస్సు |
| పగిడిద్దరాజు/గోవిందరాజు | 4వ గొట్టు | మద్ది | బూరుగ |
| సమ్మక్క | 5వ గొట్టు | వెదురు | మారేడు |
| బేరంబోయిన రాజు | 6వ గొట్టు | బండారి | వేప |
| సిద్దబోయిన వంశం | 8వ గొట్టు | నెమలి | నారామర్రి |

ఈ వృక్ష ఆరాధన గిరిజనులకు ప్రకృతిపై ఉన్న మమకారాన్ని చాటిచెబుతోంది.

### మారిన రూపం.. వీడని విశ్వాసం

ఒకప్పుడు కేవలం వెదురు బొంగులతో, ఇనుప గ్రిల్స్ మధ్య ఉండే గద్దెలు, నేడు ప్రభుత్వం చేపట్టిన పునర్నిర్మాణంతో వైభవాన్ని సంతరించుకున్నాయి. 9,000 మంది భక్తులు ఒకేసారి దర్శించుకునేలా విస్తరించిన ఈ గద్దెల ప్రాంగణం, ఇప్పుడు శిల్పకళా చాతుర్యానికి నిలయంగా మారింది. 32 గ్రానైట్ స్తంభాలపై 750 మంది కోయ వంశీయుల పేర్లు, వారి ఆచారాలు, చిహ్నాలు (సూర్యచంద్రులు, త్రిశూలం వంటివి) చెక్కడం వల్ల రాబోయే తరాలకు ఈ చరిత్ర సజీవంగా అందుతుంది.

### నాగులమ్మ తొలి పూజ: ఒక విశిష్టత

మేడారంలో ప్రతిదీ వింతే. అందరూ సమ్మక్క, సారలమ్మల గురించి మాట్లాడుకుంటారు కానీ, ఈ జాతరలో తొలి పూజ అందుకునేది మాత్రం నాగులమ్మ. సంతాన ప్రాప్తిని ప్రసాదించే తల్లిగా ఆమెకు గిరిజనుల్లో విశిష్ట స్థానం ఉంది. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, నాగులమ్మను దర్శించుకున్నాకే భక్తులు ప్రధాన గద్దెల వైపు సాగుతారు.

"విగ్రహాలు లేవు, గంటలు మోగవు.. కేవలం నమ్మకం మాత్రమే నడిపిస్తుంది."

నిజంగానే ఎక్కడా లేని విధంగా భక్తులు తమ బరువుకు తూగే బెల్లాన్ని (బంగారం) సమర్పించుకోవడం ఇక్కడి ప్రత్యేకత. మేడారం అనేది కేవలం ఒక ప్రాంతం పేరు కాదు, అది కోట్లాది మంది గిరిజన, గిరిజనేతర భక్తుల భావోద్వేగం. అడవి తల్లినే దైవంగా భావించి పూజించే ఈ సంస్కృతి, ప్రపంచానికే ఆదర్శం.

-నరేష్, ముద్ర




# ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ నెంబర్-1

మధుగౌడ్.జీ
9533551188
జర్నలిస్ట్

వానాకాలం సవాళ్లను అవకాశాలుగా మార్చి, రికార్డు స్థాయిలో అధిక దిగుబడులతో రాష్ట్రానికి అన్నం పెట్టిన అన్నదాతలు ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ రైతులు సాధించిన వరి పంట విజయం ఒక సాధారణ గణాంకం కాదు.అది రైతు ధైర్యానికి, శ్రమకు, విజ్ఞానానికి నిలువెత్తు సాక్ష్యం. అకాల వర్షాలు, విత్తనాల ధరలు, ఫర్టిలైజర్ అధిక ధరలు, ఇవన్నీ ఉన్నప్పటికీ రైతు వెనక్కి తగ్గలేదు. భూమిని నమ్మాడు భవిష్యత్తుకు మార్గదర్శి అయ్యాడు, 2025–26 సంవత్సర ఖరీఫ్ సీజన్‌లో మెరుగైన విత్తనాల ఎంపిక, శాస్త్రీయ సాగు పద్ధతులు, కాలువలు, చెరువుల, ద్వారా సమృద్ధిగా నీరు, రైతు అనుభవం కొత్త సాంకేతికతో కలిసి వరిపంట పొలాలను బంగారు రంగులోకి మార్చారు..

ఎక్కడ చూసినా గింజలతో వంగిన వరికట్టలు, కోత యంత్రాలతో హుషారుగా పని చేస్తున్న పొలాలు కనిపించాయి. గతంతో పోలిస్తే ఎకరాకు దిగుబడి పెరగడం రైతుల ముఖాల్లో సంతృప్తిని నింపింది. “ఈసారి వరి పంట మనల్ని మోసం చేయలేదు” అన్న మాటలు చాలా గ్రామాల్లో వినిపించాయి. ఈ విజయం ఒక్క రైతుదే కాదు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలాన్నిచ్చింది. అలాగే రాష్ట్రానికి ఆహార భద్రతను కూడా పెంచింది. భవిష్యత్తులో యువతకు ‘వ్యవసాయం లాభసాటి’ అన్న నమ్మకాన్ని కలిగించింది. వానాకాలం వరమైంది,ఖరీఫ్ వరి పంటతో తెలంగాణ రాష్ట్ర రైతులు మరోసారి విజయగాథ రాశారు.

ఖరీఫ్ లో 8300 వరి కొనుగోలు

### వరిలో ఘన విజయం

కేంద్రాలను రాష్ట్రంలో ఏర్పాటు చేశారు. అక్టోబర్‌లో ధాన్యం సేకరణ ప్రారంభించారు. ఇప్పటివరకు 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధా న్యాన్ని సేకరించారు,. దీనిలో 32.45 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు ధాన్యం, 38.37 లక్షల మెట్రిక్ టన్నులు సన్న వడ్లు కొన్నారు.13 లక్షల 97 వేల మంది రైతుల నుండి 16,912 కోట్ల రూపాయలు విలు వైన ధాన్యం కొనుగోలు చేశారు.. ప్రస్తుతం 16.602 కోట్లను రైతు ఖాతాలో జమ చేశారు. అధికారులు ఎక్కడ కూడా ఇబ్బం ది కలుగకుండా ధాన్యం సేకరించిన వారం లోపే డబ్బులు చెల్లించారు. 2021 –22 లో 70.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు... ఆ రికార్డు ను ఇప్పుడు ఆదిగమించడం జరిగింది.. ఇది దేశంలోనే నెంబర్. 1 స్థానం సాధించడం రైతుల గొప్ప విజయమని చెప్పొచ్చు...

కనీస మద్దతు ధర భరోసా, రైతుకు మార్కెట్ భయం తొలగింపు, ప్రైవేట్ వ్యాపారుల

### ఎందుకు ఇది సక్సెస్ స్టోరీ

దోపిడీ లేకుండా ధాన్యం కొనుగోలు చేయడం, తూకం, తేమ పేరుతో కోతలు తగ్గింపు అలాగే రైతుకు గౌరవప్రదమైన ధర, ప్రతి మండలం, గ్రామం వద్దే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం, రవాణా ఖర్చు తగ్గడం, మధ్యవర్తులు లేకుండా చేయడం, రైతు సంపర్క కేంద్రాలు, మహిళ సంఘాలకు కొనుగోలు కేంద్రాలు అప్పచెప్పడం తదితర కార్యక్రమాల ఫలితంగా వరి రైతుకు మెరుగైన సౌకర్యాలు వన గూరా యి. వీటి తోపాటు మద్దతు ధర కలిసి రావడంతో లాభం చేకూరింది.

### రైతు నేరు గా ప్రభుత్వం

ఇది డీసెంట్రలైజ్డ్ ప్రొక్యూర్మెంట్ మోడల్కు చక్కటి ఉదాహరణ. డిజిటల్ ట్రాకింగ్ పారదర్శకత రైతు నమోదు, టోకెన్, తూకం, చెల్లింపు ప్రతి దశ ఆన్‌లైన్‌లో అవినీతి, ఆలస్యం తగ్గింపు డేటా ఆధారిత పాలన వ్యవసాయానికి వచ్చిందని ఇది నిరూపించింది. ఈ సీజన్ లో సన్నలకు బోనస్ కింద 1435 కోట్ల రూపాయలు చెల్లించడం జరిగింది.

### బోనస్ చెల్లించడంలో అలసత్వం వీడాలి

ప్రభుత్వం సన్నవడ్లు పండించిన రైతులకు బోనస్ ఎకరానికి 500 రూపాయలు చెల్లించడం కాస్త అలసత్వం ఆలస్యం వహిస్తున్నదని రైతులు ఆరోపిస్తున్నారు. వానా కాలం ముగిసింది,ధాన్యం ప్రభుత్వ గోదాములకు చేరింది. బియ్యం మిల్లుల ద్వారా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్‌కు రూపాయలు 500 బోనస్ రైతుల చేతికి అందుకుండా ఆలస్యం అవుతున్నదని, ఇది ఆలస్యమా, లేదా పాలనా నిర్లక్ష్యమా అని రైతుల నుండి వినిపిస్తున్న మాటలు.ధాన్యం కొనుగోళ్లు పూర్తి అయ్యే నాటికీ బోనస్ చెల్లింపులు కూడా పూర్తి చేయడానికి అధికారులు కృషి చేస్తారని ఆశిద్దాం...

# కరుణే పరిష్కారం..

తెలంగాణలో ఇటీవల వెలుగులోకి వస్తున్న వీధి కుక్కల సామూహిక హత్యల ఘటనలు ఒక ప్రజాస్వామ్య రాష్ట్రాన్ని తీవ్రంగా కలచివేస్తున్నాయి. ప్రజా సమస్య పేరుతో ప్రాణాలను తీసే దారుణం ఎంత వరకు సమంజసం? పాలన అంటే సమస్యను నిర్మూలించడం కాదు.. సమస్యకు పరిష్కారం చూపడం అనే మౌలిక సత్యాన్ని ఈ ఘటనలు ప్రశ్నిస్తున్నాయి.

కుక్క కాట్లు, రోడ్డు ప్రమాదాలు, ప్రజల భయాలు.. ఇవన్నీ నిజమైన సమస్యలే. వాటిని తేలిగ్గా కొట్టిపారేయలేం. కానీ ఆ సమస్యలకు సమాధానం విష ఇంజెక్షన్లా? చీకట్లో పూడ్చేయడమా? చట్టాలు, మానవత్వం, బాధ్యత ఇవన్నీ పక్కన పెట్టి సర్పంచులే నిర్ణయాధికారులయ్యారా అన్న సందేహం తలెత్తుతోంది.

భారతదేశంలో వీధి కుక్కల నియంత్రణకు స్పష్టమైన విధానాలున్నాయి. స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్, పునరావాసం వంటి శాస్త్రీయ పరిష్కారాలు అందుబాటులో ఉన్నా, అవి అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఫలితంగా స్థానిక ప్రజాప్రతినిధులు “సత్వర పరిష్కారం” పేరుతో చట్టవిరుద్ధ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. ఇది పాలనా వైఫల్యానికి నిదర్శనం తప్ప మరొకటి కాదు.

ఇక్కడ మరో కీలక అంశం ప్రజల మానసికత. “రోగాలు ఉన్నాయి కాబట్టి చంపాల్సిందే” అన్న వాదన వినడానికి సులభంగా అనిపించినా, అది ప్రమాదకరమైన ఆలోచన. ఇవాళ కుక్కలు… రేపు ఇంకెవరు? ప్రజా భద్రత పేరిట కరుణను పాతిపెడితే, సమాజమే రోగగ్రస్తమవుతుంది.

## ఇదో గ్రామ సింహాల కథ

-నరేష్, ముద్ర

ఆశ్చర్యకరం ఏమిటంటే కుక్క కాటు కేసులు పెరిగినా, తెలంగాణలో రేబిస్ వల్ల మరణాలు లేవని ప్రభుత్వ డేటానే చెబుతోంది. అంటే సమస్య తీవ్రతను అతిశయోక్తిగా చూపించి, హింసాత్మక చర్యలను సమర్థించుకునే ప్రయత్నం జరుగుతోందన్న మాట.ఈ ఘటనల్లో పోలీసులు కేసులు నమోదు చేయడం ఒక సానుకూల అడుగు. కానీ అది సరిపోదు.ఎవరు ఆదేశించారు?ఎవరు అమలు చేశారు?ఎక్కడ నుంచి విష ఇంజెక్షన్లు వచ్చాయి?పశు వైద్యుల పాత్ర ఏమిటి? ఇవన్నీ తేలాల్సిన ప్రశ్నలు. శిక్ష పడాల్సింది కేవలం అమలు చేసినవారికే కాదు.. ఆలోచనకు ఒడిగట్టిన వారికీ.

ప్రభుత్వం ఇకనైనా స్పష్టమైన, రాష్ట్రవ్యాప్త విధానంతో ముందుకు రావాలి. గ్రామ పంచాయతీలకు మార్గదర్శకాలు ఇవ్వాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. జంతు సంక్షేమాన్ని “ఎన్జీఓల పని”గా కాకుండా పాలనలో భాగంగా చూడాలి.

కుక్కల సమస్య మనుషులే సృష్టించినది. దానికి పరిష్కారం కూడా మనుషులే చూపాలి. కత్తితో కాదు… కరుణతో… విషంతో కాదు… విజ్ఞానంతో… ఇదే ఒక నాగరిక సమాజానికి అసలైన పరీక్ష.



# ఒక సాహిత్య - చారిత్రక పీవీ

భారత రాజకీయ చరిత్రలో పి.వి. నరసింహారావు పేరు వినగానే ముందుగా గుర్తొచ్చేది ఆర్థిక సంస్కరణలు. 1991 నాటి క్లిష్ట ఆర్థిక పరిస్థితుల్లో దేశాన్ని కొత్త దిశగా నడిపించిన సంస్కరణాత్మక ప్రధానిగా ఆయన చిరస్థాయి గా నిలిచారు. కానీ



రాజకీయ నేతగా మాత్రమే కాదు— బహుభాషా కోవిదుడిగా, సాహితీవేత్తగా, అనువాదకుడిగా ఆయన ప్రతిభ మరింత విస్తృతమైనది. రాజకీయాల్లోకి రాకుండా సాహిత్య రంగంలోనే కొనసాగి ఉంటే, తెలుగు వారికి మరో జ్ఞానపీఠాన్ని అందించే స్థాయిలో ఆయన సృజనాత్మక సామర్థ్యం ఉండేదన్నది అతిశయోక్తి కాదు.

విశ్వనాథ సత్యనారాయణ రచించిన ‘వేయిపడగలు’ను హిందీలోకి ‘సహస్రఫణ్’గా అనువదించడం ఆయన పాండిత్యానికి నిదర్శనం. ‘ఇన్‌సైడర్’ వంటి రాజకీయ నవలతో అంతర్గత రాజకీయాల్ని సాహిత్యంగా మలచిన రచయిత కూడా ఆయనే. అయితే ఈ సమస్త రచనల మధ్యలోనూ, ఆయన కథాసాహిత్యంలో ఒక అపూర్వ మైలురాయి ‘గొల్ల రామవ్వ’.




తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యాన్ని తీసుకుని కవితాత్మకతతో కూడిన ఘాటైన కథనంగా సాగే ‘గొల్ల రామవ్వ’ కథ, ఆయుధాలకంటే భావోద్వేగాలే బలమైనవని చాటిచెప్పే రచన. 1949లో ‘విజయ’ అనే పేరుతో ప్రచురితమై, తరువాత పి.వి. నరసింహారావు రచనగా నిర్ధారణ పొందిన ఈ కథ, ఉద్యమకారుల్ని ప్రజలు ఎంతగా గుండెల్లో పెట్టుకుంటారో చెప్పే జీవంత ఉదాహరణ.

ఈ కథ ఇప్పుడు సినిమాగా రూపుదిద్దుకోవడం సాహిత్యానికి, చరిత్రకు, సినిమాకు మధ్య ఒక అరుదైన సంగమం. అలనాటి నటి తాళ్లూరి రామేశ్వరి టైటిల్ పాత్రలో కనిపించగా, దర్శకుడు వర ముళ్లపూడి ఈ కథను తెరపైకి తీసుకొచ్చారు. ఈ నెల 25 నుంచి ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్‌కు రావడం విశేషం.

తెలంగాణ పోరాటాన్ని నేపథ్యంగా చేసుకుని వచ్చిన సినిమాల జాబితాలో ఇది మరో ముఖ్యమైన చేరిక. మా భూమి, దాసి, ఒసేయ్ రాములమ్మ, అలాగే ‘చిల్లర దేవుళ్లు’ వంటి చిత్రాలు తమతమ కాలాల్లో గొప్ప చర్చలకు దారి తీశాయి. ‘గొల్ల రామవ్వ’ కూడా ఆ వరుసలో నిలబడగలదా అన్న ఆసక్తి సహజమే.

ఈ కథ ప్రత్యేకత ఏమిటంటే—కథ పూర్తయ్యాక కూడా అది మనల్ని వదలదు. కథ మన చేతిలో ఉండదు; మనమే కథ చేతిలో బందీలమవుతాం. పాత్రలు, సంభాషణలు, వాతావరణం అన్నీ కలసి ఒక అదృశ్య పాత్రగా పాఠకుడిని కథలోకి లాగుతాయి. నవలంతటి విస్తృత కాన్వాస్ అవసరం లేకుండా, గాఢతతో, క్లుప్తతతో కథా లక్షణాల్ని పాటించిన రచనా నైపుణ్యం పి.వి. ప్రత్యేకత.

ఇప్పుడు ప్రశ్న ఒక్కటే ఈ సాహిత్య గాఢతను, చారిత్రక ఉద్వేగాన్ని, మానవీయ కోణాన్ని సినిమా ఎంతవరకు పట్టుకోగలిగింది? వర ముళ్లపూడి తెరకెక్కింపులో ‘గొల్ల రామవ్వ’ కథ కొత్త తరానికి చేరి, పి.వి. నరసింహారావు అనే రచయిత–రాజనీతిజ్ఞుడి బహుముఖ ప్రతిభను మరోసారి గుర్తు చేస్తుందా? సమాధానం కోసం, తెర వెలిగే వరకు వేచి చూడాల్సిందే.

# మోదీ మెచ్చిన భవిష్యత్ నాయకుడు!

“సవాళ్ల నుంచే అవకాశాలను వెతుక్కోవాలి” అని చంద్రబాబు తరచూ చెబుతుంటారు. ఆ మాటను అక్షరాలా వంటబట్టించుకుని, ప్రత్యర్థులు విసిరిన రాళ్లనే తన విజయానికి పునాదులుగా మార్చుకున్న నాయకుడు నారా లోకేష్. హేళనలను తట్టుకున్నారు.. ప్రధాని మోదీ సైతం అభినందించేంత సామర్థ్యాన్ని చూపిస్తున్నారు.

### ప్రణాళికాబద్ధంగా వ్యక్తిత్వ హననం

స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి పట్టా పుచ్చుకుని, ఒక కార్పొరేట్ లుక్‌తో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఈ యువకుడిపై ప్రత్యర్థులు ప్రణాళికాబద్ధంగా వ్యక్తిత్వ హననం చేశారు. నీటుగా ఉండే ఆయన వేషధారణను చూసి పప్పు అని ముద్రవేసి అవహేళన చేశారు. రాజకీయాల్లోకి వస్తారో లేదో తెలియని వయసు నుంచే మొదలైన ఆ విష ప్రచారాన్ని లోకేష్ నిశ్శబ్దంగా భరిస్తూ వచ్చారు. ఆ సమయంలో సొంత పార్టీలో కూడా ఒకానొక దశలో ఆయన నాయకత్వంపై సంశయాలు వ్యక్తమయ్యాయి. కానీ, ఆ అవమానాలే ఆయనలో మొండితనాన్ని, పట్టుదలను పెంచాయి.

### సవాల్‌గా తీసుకొని ముందడుగు

అలాంటి పరిస్థితి పార్టీ ఓటమి తర్వాత మళ్లీ గెలిపించే బాధ్యత తీసుకున్నారు. పార్టీని గాడిలో పెట్టారు. పాదయాత్ర చేశారు. చంద్రబాబును సీఎంను చేశారు. నవ్విన నాపచేనే పండుతుందన్నట్లుగా.. ప్రతి ఒక్కరికీ తన సామర్థ్యం చూపించారు. ఓడిన చోటే స్వయంగా 90వేలకు పైగాఓట్ల మెజార్టీతో గెలిచారు. ఒకప్పుడు ఆయనపై కామెడీ చేసిన వాళ్లు ఇప్పుడు…. వణికిపోతున్నారు. రెడ్ బుక్ అంటే.. కిందా మీద పడిపోయారు. ఎంతో దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్నవారు.. లోకేష్ దెబ్బకు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.



నవ్విన నాపచేనే పండుతుంది అన్న సామెతను నిజం చేస్తూ, తనను ఎగతాళి చేసిన వారందరూ అవాక్కయ్యేలా యువగళం పాదయాత్రతో రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పారు. చంద్రబాబు అరెస్ట్ సమయంలో కేడర్‌లో ధైర్యం నింపి, గెలుపు గుర్రం ఎక్కించడంలో లోకేష్ వ్యూహకర్తగా మారారు. ప్రపంచ దేశాలను చుట్టి పెట్టుబడులను ఆకర్షించడంలో నిమగ్నమయ్యారు. దావోస్ వంటి అంతర్జాతీయ వేదికలపై ఆయన చేస్తున్న విశ్లేషణలు, పెట్టుబడిదారులతో జరుపుతున్న చర్చలు ఏపీకి కొత్త పెట్టుబడుల వెల్లువను తెస్తున్నాయి. ఆయన పనితీరు ప్రధాని మోదీని కూడా మెప్పించింది.

### జోకులేసిన వాళ్లు వణికిపోతున్నారు !

ఒకప్పుడు ఆయనను చూసి నవ్విన వాళ్లే, నేడు ఆయన పేరు వింటే వణికిపోయే పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా ఆయన రెడ్ బుక్ వ్యూహం ముందు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న హేమాహేమీలు సైతం నేడు అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. ప్రస్తుతం లోకేష్ కేవలం ఒక మంత్రి మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్ ఆశాకిరణం. ఏపీ యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా,

### 20 లక్షల ఉద్యోగాలే టార్గెట్

అటు మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తూనే, ఇటు పార్టీ క్యాడర్‌కు ఏ చిన్న ఆపద వచ్చినా నేనున్నానంటూ భరోసా ఇస్తున్నారు. అందుబాటులో లేరు అన్న మాట రాకుండా నిరంతరం ప్రజలతో మమేకమవుతూ దూసుకుపోతున్నారు. అవమానాల పొరలను చీల్చుకుని, ఆత్మవిశ్వాసంతో ఎదిగిన లోకేష్.. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌ను అద్భుతమైన ప్రగతి పథంలో నడిపిస్తారని ప్రజలు నమ్ముతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.01.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





**సిల్లీ పాయింట్ : రిమోట్ కష్టాలు**

టీవీ రిమోట్ పని చేయకపోతే, బ్యాటరీలు మార్చడం కంటే ముందు దాన్ని గట్టిగా రెండు దెబ్బలు కొట్టి రిపేర్ చేయడానికి ప్రయత్నిస్తాం.

# మున్సిపల్ ఎన్నికలలో రిటర్నింగ్ అధికారులదే కీలక పాత్ర

- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**ముద్ర, వనపర్తి :**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల(ఆర్‌వోలు) పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నారాయణపేట, మద్దూరు మున్సిపాలిటీలకు సంబంధించిన ఆర్‌వోలు, ఏఆర్‌వోలకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల షెడ్యూలు ఏ క్షణమైనా వెలువడే అవకాశం ఉందని, అందువల్ల ఎన్నికల నిర్వహణకు అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి స్క్రూటినీ, విత్‌డ్రా, అభ్యర్థుల తుది జాబితా, పోలింగ్, చివరకు ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్, డీపీవో సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పాల్గొన్నారు.



**మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఆర్‌వోలు కీలక పాత్ర : కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**ముద్ర, నారాయణపేట ప్రతినిధి :**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల(ఆర్‌వోలు) పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నారాయణపేట, మద్దూరు మున్సిపాలిటీలకు సంబంధించిన ఆర్‌వోలు, ఏఆర్‌వోలకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల షెడ్యూలు ఏ క్షణమైనా వెలువడే అవకాశం ఉందని, అందువల్ల ఎన్నికల నిర్వహణకు అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ నుంచి స్క్రూటినీ, విత్‌డ్రా, అభ్యర్థుల తుది జాబితా, పోలింగ్, చివరకు ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్, డీపీవో సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పాల్గొన్నారు.



# బిఎల్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

- **ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

**ముద్ర, కాప్రా :**

రామంతాపూర్ చిన్న చెరువు మైదానంలో మాజీ కార్పొరేటర్ శ్రీ గంధం జ్యోత్స్నా నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన బిఎల్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల వైపు ఆకర్షితులై శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇలాంటి క్రీడా పోటీలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తాయని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, పసుల ప్రభాకర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**వనపర్తిలో..**

**న్యాయవాదుల క్రికెట్ పోటీలు ప్రారంభం..**

వనపర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా కార్యక్రమాల భాగంగా శుక్రవారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రధాన జూనియర్ సివిల్ జడ్జ్ టి.కార్తీక్ రెడ్డి బ్యాటింగ్ చేస్తూ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి. కిరణ్ కుమార్ బౌలింగ్ చేస్తూ, ప్రధాన కార్యదర్శి కే. వెంకటరమణ ఫీల్డింగ్ చేస్తూ ప్రారంభించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ పోటీల్లో వనపర్తి, ఆత్మకూర్‌కు చెందిన న్యాయవాదులు, పోలీసు శాఖ సిబ్బంది, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొని నాలుగు జట్లుగా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గేమ్స్ సెక్రటరీ రాందూలి, రఘువంషి, ధారా వెంకటేష్, అశోక్ కుమార్, ఆర్. వెంకటేశ్వర రెడ్డిలు బాధ్యతలు నిర్వర్తించారు. సీనియర్ న్యాయవాదులు మోహన్ కుమార్, నారాయణ గౌడ్, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.





# పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో డ్రోన్‌లపై నిషేధం : డీసీపీ శ్రీధర్

**ముద్ర, మల్కాజిగిరి :**

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని డ్రోన్‌లు, పారా-గ్లైడర్‌లు, రిమోట్ కంట్రోల్డ్ మైక్రో-లైట్ విమానాల ఎగురవేతపై నిషేధం విధించినట్లు మల్కాజిగిరి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సిహెచ్. శ్రీధర్ తెలిపారు. బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 ప్రకారం తమకు సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బేగంపేట, మార్కెట్, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయన్నారు. 26న ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఏ సామర్థ్యం గల డ్రోన్‌లు, పారా-గ్లైడర్‌లు లేదా మైక్రో-లైట్ విమానాల ఎగురవేతకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి భద్రతా చర్యలను పాటించాలని కోరారు.

# డ్రంకన్ డ్రైవ్‌లో దొరికితే ఆఫీస్, కాలేజీలకు లేఖలు

- **హైదరాబాద్ పోలీసుల కఠిన నిర్ణయం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై హైదరాబాద్ పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించనున్నారు. డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడి శిక్షలు పొందిన వారి వివరాలను వారు పనిచేసే కార్యాలయాలకు, చదువుతున్న విద్యాసంస్థలకు పంపించాలని పోలీసులు నిర్ణయించారు. ఇటీవల కోర్టులో హాజరుపరిచిన కేసుల్లో నేరం రుజువుకావడంతో 270 మందికి జైలు శిక్ష విధించినట్లు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డి. జోయెల్ డేవిస్ తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా మద్యం సేవించి వాహనాలు నడిపే వారి సంఖ్య తగ్గుతుందని పోలీసులు ఆశిస్తున్నారు.




**సమాచారం ఇవ్వడం ద్వారా బాధ్యత పెరుగుతుంది..**

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై జరిమానాలు, జైలు శిక్షలకే పరిమితం కాకుండా వారి సంస్థలకు సమాచారం ఇవ్వడం ద్వారా బాధ్యత పెరుగుతుందని భావిస్తున్నారు. ముఖ్యంగా యుక్త వయసువారే ఎక్కువగా ఈ కేసుల్లో పట్టుబడుతున్న నేపథ్యంలో, కార్యాలయాలు, కాలేజీలకు లేఖలు రాయడం ద్వారా వారిలో మార్పు వస్తుందని పోలీసులు విశ్వసిస్తున్నారు. "మద్యం తాగి వాహనం నడిపేవారు రోడ్డు టెర్రరిస్టులతో సమానం" అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఇప్పటికే హెచ్చరించిన విషయం తెలిసిందే. నగరవ్యాప్తంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు మరింత విస్తృతంగా చేపట్టనున్నారు.

**హెచ్చరికలు లెక్కచేయకుంటే కఠిన చర్యలు..**

కొత్త సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 24 నుంచి 31 వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఒక్క హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే సుమారు 1,200 మందిపై కేసులు నమోదయ్యాయి. హెచ్చరికలను లెక్కచేయకుండా మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. భారీ జరిమానాలు, వాహనాల స్వాధీనం, జైలు శిక్షలతో పాటు ఇప్పుడు కార్యాలయాలు, కాలేజీలకు సమాచారం పంపించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



# ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య తిరుకళ్యాణ మహోత్సవం

**ముద్ర, హైదర్‌నగర్ :**

సెవెన్ హిల్స్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 21వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా దివ్య తిరుకళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు గౌరవ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, దేవాలయ ఈఓ సత్యనారాయణతోపాటు భక్తులు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో గౌరవ పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వామివారి కృపా కటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, భక్తులందరిపై స్వామివారి దయాకరుణలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మోహన్ ముదిరాజు, గంగాధర్, బాలు, ఉత్సవ కమిటీ సభ్యులు కెఆర్‌కే రాజు, శ్రీహరి, అప్పిరెడ్డి, సాంబశివ రెడ్డి, కుమారస్వామి, కడియాల శివ, సుజాత, సుబ్రమణ్యం, నరేష్, వెంకటనారాయణ, సత్యనారాయణరావు, రాధాకృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణలకు వేదిక మన తెలంగాణ

- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**
- **హైటెక్స్‌లో ఏస్ టెక్-2026 ప్రారంభం**

**శేరిలింగంపల్లి/మదాపూర్ ముద్ర :**

నూతన ఆవిష్కరణలకు తెలంగాణ రాష్ట్రం ప్రధాన వేదికగా మారుతోందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని హైటెక్స్ లో నిర్వహించిన ఏస్ టెక్-2026 ఎక్స్‌పో కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రసంగించారు. ఆర్కిటెక్చర్, డిజైన్, నిర్మాణ రంగాల్లో సంస్థలు తమ ఆధునిక సామగ్రి, పరికరాలతో పాల్గొనడం ద్వారా నైపుణ్యాలు బాహ్య ప్రపంచానికి పరిచయం అవుతాయన్నారు. ఇలాంటి ప్రదర్శనలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, నిర్మాణ, తయారీ సంస్థలను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని తెలిపారు. 2037 నాటికి తెలంగాణను అన్ని రంగాల్లో ముందువరుసలో నిలపడం ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ఆసియాలో ప్రముఖ ఆర్కిటెక్చర్, డిజైన్ సంస్థలు మరియు నిర్మాణ సామగ్రితో జనవరి 23 నుంచి 25 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఏస్ టెక్ హైదరాబాద్ 2026 ఎక్స్‌పో అభినందనీయమన్నారు. నిర్మాణం, ఇంటీరియర్స్, ఇంజనీరింగ్ రంగాల్లో ఆవిష్కరణలు, ఉత్పత్తి ప్రారంభాలు, అత్యాధునిక సాంకేతికతలు, పరిశ్రమ నాయకులతో నెట్‌వర్కింగ్, జ్ఞాన భాగస్వామ్య సమావేశాలు జరగడం ఎంతో ఉపయోగకరమన్నారు. వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా అన్ని సేవలు ఒకే వేదికపై లభించడం గొప్ప విషయం అని, రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ అగ్రభాగాన దూసుకెళ్తోందని గాంధీ పేర్కొన్నారు.




# ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ సునీతా రెడ్డి

**ముద్ర ప్రతినిధి, వనపర్తి :**

రోడ్డు ప్రమాదాలు ఒక్క కుటుంబానికే కాదు.. సమాజానికే తీరని నష్టం కలిగిస్తాయని వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి సునీతా రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "అరైవ్ - అలైవ్" కార్యక్రమంలో భాగంగా ఎనిమిదో రోజు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తకోట మండలం అప్పారాల కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో పని చేసే కార్మికులు, ఫ్యాక్టరీ ఉద్యోగులు, చెరుకు రవాణా చేసే వాహనాల డ్రైవర్లు, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. కార్మికులు విధులు ముగించుకుని సురక్షితంగా ఇంటికి చేరడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉద్యోగం ఎంత ముఖ్యమో.. ఆ ఉద్యోగి ప్రాణం అంతకన్నా విలువైనది. వేగం కాదు.. జీవితం గెలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ రాంబాబు, ఎస్సై ఆనంద్, షుగర్ ఫ్యాక్టరీ మేనేజర్ రామారాజు, లీగల్ అడ్వైజర్ భాస్కర్, పోలీస్ సిబ్బంది, ఫ్యాక్టరీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.








# ఓవైసీ వ్యాఖ్యలపై మహిళా కమిషన్‌కు బీజేపీ కార్పొరేటర్ల ఫిర్యాదు

**ముద్ర, మల్కాజిగిరి :**

సరూర్‌నగర్ బీజేపీ మహిళా కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిపై ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ కార్పొరేటర్లు శ్రవణ్, మహేందర్, సుప్రియ నవీన్ గౌడ్, బండారి శ్రీవాణి, మౌనిక సుంకర, పంకజలు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పతంగి ఎన్నికల గుర్తు కోరుతూ హిందువులను గౌరవించాలనే అర్థం వచ్చేలా విడుదల చేసిన వీడియోపై ఓవైసీ వ్యంగ్యంగా స్పందించారని వారు పేర్కొన్నారు. "మా తమ్ముడు అక్బర్ చాలా స్మార్ట్‌గా ఉన్నాడని వాళ్లు అలా మాట్లాడుతున్నారు" అంటూ ద్వంద్వార్థ వ్యాఖ్యలు చేయడంతోపాటు, "కూలింగ్ గ్లాసెస్, షెర్వాణీ వేసుకుంటే పందులు కూడా స్మార్ట్‌గా కనిపిస్తాయి" అనే వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని బీజేపీ నేతలు ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు మహిళలను అవమానపరిచేలా ఉన్నాయని, ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని మండిపడ్డారు. బీజేపీ అన్ని వర్గాల మహిళలను గౌరవిస్తుందని, అయితే రజాకార్ల వారసత్వం కలిగిన ఎంఐఎం పార్టీలో ఆ సంస్కృతి లేదని విమర్శించారు.

**సిల్లీ పాయింట్: అద్దం ముందు యాక్టింగ్**

ఇంట్లో ఎవరూ లేనప్పుడు అద్దం ముందు నిలబడి రకరకాల ఎక్స్ ప్రెషన్స్ ఇస్తూ మనల్ని మనం పెద్ద హీరోలా/హీరోయిన్లా ఫీలైపోతుంటాం.



### కేసీఆర్ ఫ్యామిలీని టచ్ చేసే దమ్ము

# కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు

**ముడుపులు దండుకునేందుకు విచారణ పేరుతో సాగదీతలు**
**ఫోన్ ట్యాపింగ్ జరిగిందనడానికి ఆధారాలన్నీ ఉన్నాయి**
**పోలీసులే విచారణ సందర్భంగా నాకు ఆధారాలు, సాక్ష్యాలు చూపారు**
**మంది కొంపలు ముంచిన కేటీఆర్ వ్యక్తిత్వ హననం గురించి మాట్లాడటమా?**
**బీజేపీ అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కుటుంబం అవినీతి, అరాచకాలపై చర్యలు తప్పవు**
**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు**



**ముద్ర, కరీంనగర్:**
ఫోన్ ట్యాపింగ్ తోపాటు అనేక అవినీతి, అక్రమాలు, అరాచకాలకు పాల్పడినప్పటికీ కేసీఆర్ కుటుంబాన్ని టచ్ చేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పౌరుషం లేదని, చేతులు ముడుచుకుని కూర్చున్న అసమర్థ ప్రభుత్వమని మండిపడ్డారు. ఢిల్లీకి ముడుపులు కోసమే ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో సాగదీస్తున్నారని అన్నారు. విచారణ పేరుతో హడావుడి చేసినప్పుడల్లా ఫాంహౌజ్ నుండి ఏఐసీసీకి ముడుపులు వెళుతున్నాయని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందనడానికి అన్ని ఆధారాలు, సాక్ష్యాలు పోలీసుల వద్ద ఉన్నాయని, తనను విచారణకు పిలిచిన సమయంలో ఆ ఆధారాలను, సాక్ష్యాలను సైతం చూపించారని తెలిపారు. జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు తేలిందన్నారు. అయినా కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. శుక్రవారం కరీంనగర్ లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్ పై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతోపాటు కేటీఆర్ అరాచకాలను వివరిస్తూ తీవ్రస్థాయిలో స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ పై సిట్ విచారణ టీవీ సీరియల్ ను మించి ఆది అంతం లేకుండా కొనసాగుతూనే ఉందన్నారు. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేక పోతున్నారని, సిట్ అధికారులకు స్వేచ్ఛ ఇవ్వడం లేదు. ప్రభుత్వంలో కొందరు పెద్దలు ఆదేశాలకు అనుగుణంగానే విచారణ చేస్తున్నారని, నిజానికి సిట్ అధికారులు సమర్థులు, నిజాయితీపరులు. కానీ వాళ్లపై ప్రభుత్వం జులుం ప్రదర్శిస్తోంది. ఆ పెద్దలు ఎవరిని పిలవమని అడిగితే వాళ్లనే పిలిచి విచారణ చేస్తున్నారని అన్నారు. కేటీఆర్ ను ఎందుకు విచారణకు పిలిచారు? ఆయన ఫోన్ ట్యాపింగ్ చేయించినందుకు పిలిచారా..? లేక ఆయన ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని చెప్పడానికి పిలిచారా..? అని ప్రశ్నించారు.

సిరిసిల్ల కేంద్రంగా వార్ రూంను ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్ చేశారని తాను చాలా సార్లు చెప్పానని, యువరాజు కేటీఆర్ ఆడిందే ఆటగా ఫోన్ ట్యాపింగ్ చేయించి పాలనను కొనసాగించారని, బ్రిటీష్ పాలన తరహాలో పాలన చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్ల లావాదేవీలు జరిగాయని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ బిల్డర్లు, వ్యాపారులను, సినీ నటులను బెదిరించి కోట్లు దండుకున్నారని, బెదిరించి బీఆర్ఎస్ పార్టీకి ఎలక్ట్రోరల్ బాండ్స్ కొనుగోలు చేయించారని, తన ఫోన్లను, ప్రస్తుత సీఎం, మంత్రుల ఫోన్లతోపాటు జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబమే ఇదంతా చేసింది. అసలు కారకులైన వాళ్లను సాక్షిగా పిలిచి విచారణ పేరుతో వాంగ్మూలం నమోదు చేయడమేంటని ప్రశ్నించారు. రెండేళ్ల విచారణలో సిట్ సాధించిందేమిటి? ఒక్క రాజకీయ నాయకుడినైనా అరెస్ట్ చేశారా? ఎన్ని ఆస్తులు జప్తు చేశారు? ఎంత మందిపై చర్యలు తీసుకున్నారు? స్వయంగా కేసీఆర్ కూతురే తన ఫోన్ ట్యాప్ చేశారని చెప్పారని, మాజీమంత్రి హరీష్ రావు ఆ టైంలో ఏడాదిపాటు ఫోన్ కూడా వాడలేదు. ఇన్ని సాక్ష్యాలు, ఆధారాలున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అసలు కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో టైం పాస్ విచారణ చేస్తున్నారని తెలిపారు.

తనను సిట్ విచారణకు పిలిచి 6 నెలలైందన్నారు. మావోయిస్టు జాబితాలో తన నెంబర్ ఉంచి ఫోన్ ట్యాప్ చేశారని పోలీసులే చెప్పారని, ఆధారాలు కూడా నాకు చూపించారన్నారు. అంతెందుకు సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్లను కూడా ట్యాప్ చేశారని చెప్పినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని, ఇదంతా డ్రామా అన్నారు. ఇకనైనా కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంటే తప్పు చేసిన రాజకీయ నాయకులను, అధికారులను అరెస్ట్ చేయాలని, అప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వంపట్ల ప్రజలకు నమ్మకం ఏర్పడతదని అన్నారు. లోపాయికారీ ఒప్పందాలతో డ్రామాలు చేస్తే నమ్మేంతటి పిచ్చోళ్లు ఎవరూ లేరని పేర్కొన్నారు.

కేసీఆర్ కుటుంబ అవినీతి, అరాచకాలపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. ఇయాళ కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ దొంగ. సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ చేయించింది కేటీఆరే అని అన్నారు. మంది కొంపలు ముంచి వ్యక్తిత్వ హననం గురించి మాట్లాడతారా? కేటీఆర్ చేసిన అరాచకాలు ఇంకా మా కళ్ల ముందు కన్పిస్తున్నాయని, బీజేపీని ఆశీర్వదించి అధికారం అప్పగిస్తే కేసీఆర్ కుటుంబానికి చుక్కలు చూపేవాళ్లమని తెలిపారు. ఈ ముఖ్యమంత్రికి దమ్ము లేదు. చేతగాదు, కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే ఆలోచనే లేదు. కాంప్రమైజ్ పొలిటిక్స్ మాత్రమే చేస్తున్నరు. అసలు రేవంత్ రెడ్డికి పౌరుషమే లేదు. డ్రోన్ ఎగరేశారని అరెస్ట్ చేసి బిడ్డ పెళ్లికి కూడా వెళ్లకుండా చేసినా... వాళ్లపై చర్యలు తీసుకోవడం లేదంటే.. ఆయనకు చేతగావడం లేదన్నారు. మా రక్తం మరుగుతోంది. మా కార్యకర్తలపై అడుగడుగునా లాఠీఛార్జ్ చేసి కేసులు వేధించిన దృశ్యాలు మా కళ్లముందు కన్పిస్తున్నాయి. మేం అధికారంలోకి వచ్చి ఉంటే ఒక్కో లాఠీ దెబ్బకు ఒక్కో గుణపాఠం చెప్పేవాళ్లమని అన్నారు.

మావోయిస్టు జాబితాలో రేవంత్ రెడ్డితో పాటు తన పేరు, జడ్జీల పేర్లు పెట్టారని, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే ఫోన్ ట్యాపింగ్ పేరుతో జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసి ఇంకా సిగ్గు లేకుండా దేశ భద్రత అని తప్పించుకోవాలని చూస్తున్నారని అన్నారు. కేటీఆర్ ఇచ్చిన స్టేట్ మెంట్ ను వాంగ్మూలంగా భావించి పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సూచించారు.

ఫోన్ ట్యాపింగ్ సహా కేసీఆర్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడం తమకు చేతగాదని, అసమర్థులమని కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకొని సీబీఐ విచారణ జరపాలని కేంద్రానికి లేఖ రాస్తే అప్పుడు కేంద్రం చర్యలు తీసుకునేందుకు సిద్ధమని సంజయ్ పేర్కొన్నారు.

### నాగోబా జాతరలో
### ముగిసిన మెస్రం వంశీయుల పూజలు



**ముద్ర, ఇంద్రవెల్లి:** మండలంలోని ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా జాతరలో మెస్రం వంశీయుల పూజలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా నాగోబాను దర్శించుకునేందుకు వందలాది భక్తులు తరలివచ్చారు. మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో మండగాజిలింగ్ పూజలతోపాటు భేతాల్ పూజలు ఘనంగా నిర్వహించారు. వారి సంప్రదాయ పద్ధతిలో మెస్రం వంశీయుల పెద్దల చేతి కర్రలను, పాదాలను మహిళలు నీటితో కడిగారు. నాగోబాను దర్శించుకున్న భక్తులు సతీక్ దేవతకు వేసిన కానుకలను పటేల్ కిత, కటోడ కిత, పర్ధాంజీ కితల వారీగా డబ్బులు పంచుకున్నారు. మహాపూజలకు ఉపయోగించిన మట్టికండలు 22 కితల వారీగా పంపిణీ చేశారు. ఈ పూజలతో మెస్రం వంశీయుల పూజలు ముగిసాయి. అధికారికంగా ఈనెల 25వ తేదీవరకు పూజలు జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు. ఈ సందర్భంగా సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తు మహిళలు. పురుషులు వేర్వేరుగా భేతాల్ నృత్యాలు చేశారు. సాయంత్రం కేస్లాపూర్ నుంచి కుటుంబ సమేతంగా ఉట్నూర్ మండలంలోని శ్యామ్ పూర్ గ్రామంలోని భుడుందేవ్ పూజల కోసం బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్ పటేల్ రావ్, చిన్నుపటేల్, బాజీరావ్ పటేల్, లింబారావ్ పటేల్, కటోడ కోసేరావ్, కటోడ హనుమంత్ రావ్, నాగోబా పేన్ కోత్వాల్ తిరుపతి, నాయికి ధర్ము, పర్ధాంజీ దాదారావ్, శేఖర్ బాబు, దేవ్ రావ్, సోనేరావ్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

### టూ కే రన్ విజయవంతం చేయాలి
**- జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**



**ముద్ర, వేములవాడ:**
రహదారి భద్రతలో భాగంగా వేములవాడ పట్టణంలో నిర్వహిస్తున్న టూ కే రన్ విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. జిల్లా పోలీస్ అధికారులతో కలిసి ఆయన పోస్టర్ ను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో శనివారం టూ కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెక్కపల్లి బస్టాండ్ నుండి బాలానగర్ కోర్టు గ్రౌండ్ వరకు ఉదయం 7 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ రమేష్, సురేష్, ట్రాఫిక్ ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

### లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ సీనియర్ అసిస్టెంట్



**ముద్ర, ఆదిలాబాద్:**
జిల్లాలోని బజార్‌హత్నూర్ మండల తహసీల్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కటకం విద్యాసాగర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల తెలిపిన ప్రకారం.. మండలంలోని బాలన్‌పూర్ శివార్‌లో ఉన్న 8.35 ఎకరాలకు సంబంధించిన భూమి సాదా బైనామా రిజిస్ట్రేషన్ కోసం బాధితుడు తహసీల్ కార్యాలయంలో సంప్రదించాడు. అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విద్యాసాగర్ రెడ్డి బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా అధికారుల వ్యూహాత్మకంగా వ్యవహరించి రూ.2 లక్షలు తీసుకుంటుండగా సీనియర్ అసిస్టెంట్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రభుత్వ విధుల్లో ఉంటూ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణపై అతడిపై కేసు నమోదు చేసి కరీంనగర్ కోర్టులో హాజరు పరిచామని ఏసీబీ అధికారులు తెలిపారు.

# తెలంగాణ చూపంతా కరీంనగర్ కార్పొరేషన్ వైపే..

**పార్టీ నేతల సమావేశంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్**



**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ కార్పొరేషన్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందా? లేదా? అనే దానిపై రాష్ట్రమంతా ఆసక్తిగా ఎదురు చూస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈసారి బీజేపీకి మంచి వాతావరణం ఉందని, కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పదవిని కైవసం చేసుకోవడమే లక్ష్యమని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నేతలు పెద్ద ఎత్తున బీజేపీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వారిని సాదరంగా ఆహ్వానించడంతోపాటు కలిసికట్టుగా పనిచేసి కార్పొరేషన్ పై కాషాయ జెండాను ఎగరేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గెలిచే అవకాశమున్న చోట పార్టీ కార్యకర్తలకే టిక్కెట్లు ఇస్తామని పునరుద్ఘాటించారు. శుక్రవారం కరీంనగర్ లోని ఈఎన్ గార్డెన్స్ లో బీజేపీ నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 24వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణ రెడ్డి తన అనుచరులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. 56వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తాటి ప్రభావతి కూడా తన అనుచరులతో కలిసి సంజయ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. అనంతరం జరిగిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లరమేశ్, సీనియర్ నేతలు ఓదేలు, వాసాల రమేశ్, రాజేంద్రప్రసాద్, డాక్టర్ పుల్లెల పవన్, బోయినిపల్లి ప్రవీణ్, గుజ్జ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



### వేములవాడ పురపాలక సంఘంపై బీఆర్ఎస్ జెండా ఎగరాలి..
**- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు**
**- బీఆర్ఎస్‌లో పలువురి చేరిక**



**ముద్ర, వేములవాడ:**
వేములవాడ పురపాలక సంఘంపై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయాలని ఆ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. 26వ వార్డులో మామిండ్ల జమున కనకరాజు, చందనం శ్రీనివాస్, పబ్బ శ్రీకాంత్, గంగరాజు యాదవ్, భరత్, దిలీప్ యాదవ్, శశి, కృష్ణ, సాయి వరుణ్, రాకేష్, రాజేష్, అరుణ్, సురేష్, నాగిశెట్టి, నారాయణ, దేవరాజు, రాజయ్య శుక్రవారం పార్టీలో చేరగా వారికి ఆయన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పది సంవత్సరాల్లో వేములవాడను వెన్నెల వాడగా మార్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యం తరువాత వేములవాడను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. వేములవాడ పురపాలక సంఘం పరిధిలో ఓటు అడిగే హక్కు ఒక్క బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉందని, మెజార్టీ స్థానాలు దక్కించుకుంటామని కూడా ఆయన చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేష్, సిరిగిరి రామచందర్, నాయకులు ఇన్నాడి సత్యనారాయణ రెడ్డి, చీటి రాధా కిషన్ రావు, అంజాత్ పాషా, ప్రేమ్ చారి, దేవరాజు తదితరులు ఉన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.01.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**సిల్లీ పాయింట్ : మెసేజ్ టైపింగ్**

ఎవరికైనా పెద్ద మెసేజ్ టైప్ చేసి, తీరా పంపే ముందు ఎందుకో వద్దనిపించి మొత్తం డిలీట్ చేసేస్తాం.





## శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

స్వర్ణగిరి దేవస్థానంలో శుక్రవారం శ్రీ పద్మావతి అమ్మవారి కి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయణం, పుష్య మాసం శుక్ల పక్షము తదియ, హేమంత ఋతువు, శుక్రవారం కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను భక్తిశ్రద్ధలతో విశేషంగా నిర్వహించారు. నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారు బావి నుండి శ్రద్ధాభక్తులతో తీసుకువచ్చారు. నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.

## పెద్ద పులి కలకలం...

- **ఇబ్రహీంపూర్ గ్రామస్తుల్లో భయాందోళన**

**ముద్ర, తుర్కపల్లి:**

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామ పరిధిలో శుక్రవారం సాయంత్రం పెద్ద పులి సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో గ్రామంలో తీవ్ర భయాందోళన నెలకొంది. ఇబ్రహీం పురం నుంచి మంచిరోని మామిల్లు వైపు వెళ్లే దారిలో, పెద్దమ్మ గుడి దాటిన తర్వాత మంగలోళ్ల బాయి సమీపంలోని గుండు వద్ద ఒక బాటసారి పెద్ద పులిని చూసినట్లు తెలిపాడు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో అతడు భయభ్రాంతులకు గురయ్యాడు. వెంటనే అప్రమత్తమైన గ్రామ యువకులు పరిస్థితిని గమనించి, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. పులి సంచారం ఉండవచ్చన్న అనుమానంతో గ్రామస్తులు అప్రమత్తమై, అక్కడే మంటలు వెలిగిస్తూ పోలీసులు, అటవీ అధికారులు వచ్చే వరకు వేచిచూస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణించడం ప్రమాదకరమని భావించిన గ్రామ పెద్దలు, మంచిరోని మామిల్లు నుంచి వచ్చే-పోయే వారు ఈ రూట్‌ను తాత్కాలికంగా ఉపయోగించవద్దని హెచ్చరికలు జారీ చేశారు. పులి సంచారం నిజమైతే ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉండటంతో, అటవీ శాఖ వెంటనే స్పందించి గాలింపు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం పరిస్థితి భయానకంగా మారడంతో ఇబ్రహీంపూర్ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



## బాసరలో ఘనంగా వసంతి పంచమి

- **భారీగా తరలివచ్చిన భక్తులు**
- **వేకువ జామున మూడు గంటల నుండి అక్షరభ్యాస పూజలు**
- **రాష్ట్రమంతటా దేవాలయాల్లో వేడుకలు**

**ముద్ర, బాసర :**

దక్షిణ భారత దేశంలోనే సుప్రసిద్ధమైన సరస్వతీ క్షేత్రం నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారి జన్మదినం వసంత పంచమి సందర్భంగా భక్తులు శుక్రవారం ఆలయానికి భారీగా తరలి వచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామున రెండు గంటల నుండి క్యూలో భక్తులు నిలబడి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో అమ్మవారి పూజా కార్యక్రమాలు ప్రారంభం కాగా...ఆలయ వైదిక బృందం సరస్వతి, మహాకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించింది. వేకువ జామున మూడు గంటల నుండి అక్షరభ్యాస పూజలు ప్రారంభించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు నిర్వహించారు. ఇందుకోసం ఆలయంలో ప్రత్యేకంగా మూడు అక్షరాభ్యాస మండపాలను ఏర్పాటు చేశారు. వేద వ్యాసుడు ప్రతిష్టించిన ఈ ఆలయంలో ప్రతి ఏటా వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. మాఘ మాసంలో వచ్చే మాఘ శుద్ధ పంచమిని వసంత పంచమిగా నిర్వహిస్తారు.





## క్రీడలతో స్నేహ భావాలు మెరుగు

- **భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

క్రీడలతో స్నేహ భావాలు మెరుగవుతాయని భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని అనంతారం గ్రామంలో యాదాద్రి జిల్లా యువ నాయకుడు ఇలియాస్ మొహమ్మద్ ఆధ్వర్యంలో జరిగే ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై అనిల్ కుమార్, గ్రామ సర్పంచ్, నాయకులు కొండల్ రెడ్డి, వెంకటేష్, చిందం మల్లికార్జున్, అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## నిస్వార్ధంగా, నిష్పక్షపాతంగా ఓటు వేయాలి

- **ఎస్ఎల్ఎన్ఎస్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ టీ.వంశ తిలక్ విద్యార్థిని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించి ఓటు విలువను, ప్రజాస్వామ్య విలువను, దాని పూర్వాపరాలను రాజ్యాంగ తాత్విక విలువలను తెలిపారు. యువత నిస్వార్ధంగా నిష్పక్షపాతంగా ఓటు వేయాలని తద్వారా మంచి నాయకుని ఎన్నుకోవచ్చని ఈ దేశంలో నిస్వార్ధంగా పనిచేసిన నాయకులు గొప్ప గొప్ప స్థానాలకు వెళ్లడానికి కారణం ఓటు అని అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి, గుల్జారి లాల్ నంద, నరేంద్ర మోడీ వంటి వారు కింది స్థాయి నుంచి వచ్చిన వాళ్ళు ఓటు ద్వారానే ఇంత పెద్ద దేశానికి ప్రధాన మంత్రులు అయ్యారని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఓటుపై అవగాహన కలిగి ఉండాలని, మంచి నాయకుని ఎన్నుకోవడం ద్వారానే మంచి భారతదేశ భవిష్యత్తు సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కనక బాలరాజు, అత్తర్ ఫరీన్, సుధా, పి బాల్ రెడ్డి, కే.కృష్ణయ్య, డాక్టర్ సత్యనారాయణ, రామకృష్ణ. సిద్ది రాములు, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.





# మతోన్మాద ఫాసిస్టు పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టాలి

- **సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య**
- **పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభ ప్రారంభం**

**ముద్ర, ఖమ్మం :**

దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్. సంఘ్ పరివార్ శక్తులు కలిసి దేశానికి బిగిస్తున్న కుల మతోన్మాద ఫాసిస్ట్ పద్మవ్యూహాన్ని బద్దలు కొట్టి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి విద్యార్థి, యువతపైనే ఉన్నదని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్ యూ) తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా జెడ్పీ సెంటర్ నుండి మయూరి సెంటర్ మీదుగా వేలాది మంది విద్యార్థులు బిగి పిడికిలి జెండాలు చేతబట్టి, జీనా హై తో మర్ నా సిఖోకదం ఫర్ లడ్ నా సికో అని గర్జిస్తూ ఖమ్మం పురవీధుల్లో భారీ విద్యార్థి ర్యాలీ నిర్వహించారు. అనంతరం భక్త రామదాసు కళక్షేత్రంలో పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, పీడీఎస్ యూ మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల అశోక్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సాయిబోలా లు ముఖ్య వక్తలుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను తన గుప్పిట్లోకి తీసుకొని ప్రజాస్వామిక వాదులను, ప్రశ్నించే గొంతులను, దేశ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



79 సంవత్సరాల స్వాతంత్ర పాలనలో ప్రభుత్వాలు పార్లమెంట్, అసెంబ్లీలో చేసిన చట్టాలు, తీసుకువచ్చిన సంస్కరణలు పేద, మధ్యతరగతి వర్గాలకు నేటికీ ఉచితంగా నాణ్యమైన సమాన విద్య, వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. దేశంలో ప్రశ్నించే గొంతులను అర్బన్ నక్సల్స్ అనే ముద్ర వేసి, జైలు పాలు చేస్తూ, చిత్రహింసలు పెడుతూ, చివరికి ఆపరేషన్ కగార్ పేరిట అమాయక ,ఆదివాసి గిరిజనులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. దేశంలో మతం ముసుగులో స్త్రీలపై దాడులు, అత్యాచారాలు చేసిన వారిని, బ్యాంకులను కొల్లగొట్టి ప్రజల డబ్బుతో విదేశాలకు పారిపోయిన బడా బాబులకు బిజెపి ప్రభుత్వం రక్షణ కల్పించడం సిగ్గు చేటని తీవ్రంగా దుయ్యబట్టారు.

దేశంలో బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020 ని వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు లేకుండానే తీసుకువచ్చి భారతీయ విద్యా రంగాన్ని పూర్తిగా కాషాయకరిస్తూ భావి భారత పౌరులను కుల, మతోన్మాదులుగా మార్చే కుట్రలకు పాల్పడుతోందన్నారు. ప్రపంచ దేశాలు అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతుంటే భారత విద్యార్థి ,యువత శక్తి యుక్తులను నిర్వీర్యం చేస్తూ, దేశంలో బ్రాహ్మణీయ మనువాద తిరోగమన విధానాలను పున ప్రతిష్టించే చర్యలకు ఒడిగడుతున్నారని అన్నారు. నేటి విద్యార్థి ,యువత సమాజంలో పాలకులు తీసుకువస్తున్న దేశ వ్యతిరేక చర్యలను అడ్డుకోవాలన్నారు. విద్యార్థి అమర వీరుల పోరాట స్ఫూర్తితో ప్రగతిశీల సమాజాన్ని స్థాపించుకోవాలని , ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, ఎర్ర అఖిల్ కుమార్, నరేందర్, గణేష్, సహాయ కార్యదర్శి సాయి, సురేష్, వి.వెంకటేష్, రాకేష్, కోశాధికారి మహేందర్, జే.ఎన్.యు.ఢీల్లీ పి.డి.ఎస్.యు. విద్యార్థినేత తిరుపతి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు అంగడి కుమార్, మునిగేల శివ ప్రశాంత్, బి.అజయ్, వి.కావ్య, పి.అనూష, దీక్షిత, సీతారాం, నాగరాజు, సాయి, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

## ఒంటరివారైన చిన్నారుల బాధ్యత ప్రభుత్వానిదే

- **బాలల హక్కుల సంఘం నాయకులు కొడారి వెంకటేష్**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు సంకీర్తన, వర్షిణి ల పూర్తి బాధ్యత ప్రభుత్వమే తీసుకొని, వారిని చదివించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ కొడారి వెంకటేష్ కోరారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండలం చిన్న గౌరాయిపల్లి గ్రామానికి చెందిన గుజ్జ సంకీర్తన, గుజ్జ వర్షిణి లను ఆయన కలిసి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. చిన్నారులు అమ్మా నాన్న లను కోల్పోవడం, బాధ్యత గల సమీప బంధువులెవరూ లేకపోవడంతో గ్రామస్తులే చందాలు వేసుకొని చిన్నారుల తల్లి అయిన గుజ్జ రాధ (40) అంత్యక్రియలు చేశారు. గుజ్జ రాజు పుట్టుకతోనే అంధుడు, సుమారు 16 సంవత్సరాల క్రితం రాధను వివాహం చేసుకున్నాడు. వారికి సంకీర్తన (12), వర్షిణి (10)లు ఇద్దరు కుమార్తెలు. రాజు తల్లి గుజ్జ వజ్రమ్మ గత 14 సంవత్సరాల క్రితం మరణించారు. రాజు తరపు బంధువులు ఎవ్వరూ లేకపోవడంతో, ప్రస్తుతం రాధ తల్లి విశాలాక్షి పిల్లల బాగోగులు చూస్తుంది. ఆమె కూడా వయోవృద్ధురాలు కావడంతో పిల్లలను చూసుకోవడం సాధ్యం కాదు. కాబట్టి జిల్లా కలెక్టర్, మానవతా దృక్పథంతో పిల్లల పూర్తి బాధ్యతను తీసుకొని వారికి మైనారిటీ తీరే వరకు చదివించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ కొడారి వెంకటేష్ కోరుతున్నారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక చిన్నారులకు అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

## జగదీష్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యేల పరామర్శ

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

స్వల్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని శుక్రవారం పలువురు మాజీ ఎమ్మెల్యేలు పరామర్శించారు. భువనగిరి మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, గాదరి కిషోర్, నల్లమోతు భాస్కర్ రావు, నోముల భగత్, రమావత్ రవీంద్ర కుమార్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.





## ఓటు హక్కు వజ్రాయుధం

- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ జితేష్ వి.పాటిల్**

**ముద్ర, కొత్తగూడెం :**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన వజ్రాయుధమని, 18 సంవత్సరాలు నిండిన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఐ డి ఓ సి కార్యాలయ సమావేశ మందిరంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.., ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఎంతో విలువ ఉందని, ఆ విలువను ప్రతి ఓటరు తెలుసుకొని తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటు హక్కుపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన పాలనను ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. అధికారులు, యంత్రాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత గల యువత ఓటరుగా నమోదు చేసుకునేలా, అలాగే తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ విస్తృత స్థాయిలో ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

శనివారం 24-01-2026

www.mudranews.in | @mudranews




### సిల్లీ పాయింట్



క్యాలిక్యులేటర్ అతివిశ్వాసం $2 + 2 = 4$ అని మనకు తెలుసు, కానీ ఎందుకైనా మంచిదని క్యాలిక్యులేటర్‌లో కొట్టి మరీ కన్ఫర్మ్ చేసుకుంటాం.

# సురక్షితంగా గమ్య స్థానం చేరాలి

### మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా గమ్య స్థానం చేరాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఆటోనగర్, రాందాస్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రాందాస్ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేసిన అనంతరం మాట్లాడారు. అతి వేగం ప్రమాదకరమనిచ హెల్మెంట్ వాడకంతో మన ప్రాణాల్ని కాపాడుతుందన్నారు. యువత వేగాన్ని నియంత్రించుకోవాలని కోరారు. మనిషి జీవితం చాలా విలువైందని, ప్రాణం విలువ వెల కట్టలేనిదన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ ద్విచక్ర వాహనదారులే ఉన్నారని పేర్కొన్నారు.

కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారుడుకి హెల్మెట్ తప్పనిసరి అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగులతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ద్విచక్ర వాహనాలున్న ఉద్యోగులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే నిబంధనలు ఉన్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలు అవగాహన పెంపొందించుకుని, వారి నిండు జీవితాన్ని ప్రమాదాల బారిన పడకుండా రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, విజయలక్షి , వన్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, ఎస్సైలు సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఏడుపాయల వన దుర్గామాత వీణ వాణిగా, చదువుల తల్లిగా భక్తులకు దర్శనమిచ్చారు. మెదక్ మండలం పేరూరు సమీపంలో మంజీరా ఒడ్డున కొలువైన పేరూరు సరస్వతి దేవి క్షేత్రంలో మూహిక అక్షర శ్రీకారాలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపకుడు దోర్బల రాజమౌళి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, మహాలంకరణ, మహా మంగళహారతి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. గుణాకర్ శర్మ, మహేశ్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు తమ చిన్నారులకు అక్షర శ్రీకారాలు చేయించారు. సాయంత్రం శకట భ్రమణోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల వారు ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉద్యమకారుని కుటుంబానికి కేసీఆర్ అండ



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు, ములుగు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుసుమ జగదీశ్ కుటుంబానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీలో మొదటి నుంచి క్రియాశీలకంగా వ్యవహరించిన కుసుమ జగదీశ్ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించారు. జగదీశ్ కుమార్తె సుకీర్తి మెడిసిన్ చదవడానికి ప్రయత్నిస్తున్న విషయం గురించి పార్టీ నాయకుల ద్వారా కేసీఆర్ తెలుసుకున్నారు. ఆమె మెడిసిన్ చదవడానికి అవసరమైన ఫీజు చెక్కును శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో సుకీర్తికి అందజేశారు. మంచిగా చదువుకోవాలని, కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని సుకీర్తిని ఆశీర్వదించారు.

## ధాన్యం కొనుగోలులో కామారెడ్డి టాప్..

**ముద్ర, కామారెడ్డి:** గత వానకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలలో కామారెడ్డి జిల్లా ముందు వరసలో నిలిచింది. ధాన్యం సేకరణ, వివరాల నమోదు, రైతులకు మద్దతు ధర కల్పించడంలో అధికారులు క్రియాశీలక పాత్ర వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని 32 జిల్లాలో ధాన్యం సేకరించగా అందులో ఐదు జిల్లాల్లో అత్యుత్తమమైన ఫలితాలు రాబట్టారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో సమన్వయం, FCI నుండి క్లెయిమ్‌లు మొదలైన ఐదు వేర్వేరు విభాగాల కింద అత్యుత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలను పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశంసించారు.

## విద్యార్థుల హాజరు శాతం పెరగాలి

**ముద్ర, కోటగిరి:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులు సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు రెగ్యులర్ గా రావాలని కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్–అధ్యాపకుల అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా సర్పంచ్ బర్ల మధుకర్ మాట్లాడుతూ కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో విద్యార్థులకు సౌకర్యార్థం అన్ని రకాల సౌకర్యాలు, వసతులు ఉన్నాయని చెప్పారు. తప్పనిసరిగా కళాశాలకు వచ్చి శ్రద్ధగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని, విద్యార్థులు కళాశాలకు రెగ్యులర్గా వచ్చేందుకు తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో అవసరమని అన్నారు. పేరెంట్స్ కూడా కళాశాలకు అప్పుడప్పుడు వచ్చి విద్యార్థుల మార్కులు, హాజరు శాతం పై ఆరా తీయాలన్నారు. కళాశాలకు పేరెంట్స్ అప్పుడప్పుడు వస్తూ ఉంటే విద్యార్థుల నడవడికను గమనించవ చ్చన్నారు. ప్రస్తుతం ప్రాక్టికల్ కొనసాగుతు న్నాయని మరో నెల రోజుల్లో ఇంట ర్మీడి యట్ వార్షిక పరీక్షలు ఉంటా యన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కైసర్ పాషా, అధ్యాపకులు ప్రమోద్, దత్తాత్రి, అనిల్, ప్రభాకర్, రాము, శ్రీలత, సమీర్, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

**ముద్ర, రాయపోల్:** ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సిద్దిపేట జిల్లా రాయపోల్ తహసీల్దార్ కృష్ణమోహన్ అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించి, ఓటర్ చైతన్యంపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే ఆయుధం

### సిద్దిపేట కలెక్టర్ హైమావతి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** భారత రాజ్యాంగం దేశ పౌరులందరికీ ఇచ్చిన గొప్ప ఆయుధం ఓటు హక్కు అని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం ఐడిఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడిలకు ప్రభావం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ఓటర్లకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశంలో స్వాతంత్రానికి పూర్వం కొన్ని ఉన్నత వర్గాలు, ధనవంతులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదని గుర్తు చేశారు. కానీ భారత దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత 25 జనవరి 1950 నాడు భారత రాజ్యాంగంలో 21 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించారన్నారు. దీని గుర్తుగా 2011 నుంచి ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఓటు హక్కు వయసును 18 సంవత్సరాలకు సవరించి అమలు చేశారన్నారు. ఏ దేశంలో లేని విధంగా భారత రాజ్యాంగం మనదేశంలో పౌరులకు స్వేచ్ఛ, స్వాతంత్రాన్ని కల్పించిందనన్నారు. పౌరులందరూ తమకు నచ్చిన, సమాజానికి మేలు చేసే వ్యక్తులను ఎన్నుకోవడానికి ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రాధాన్యతను ఇతరులకు తెలియజేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలి

### - మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ - ముగిసిన సర్పంచుల మొదటి విడత శిక్షణ

**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఆదర్శ గ్రామ పంచాయతీల నిర్మాణమే లక్ష్యంగా నూతన సర్పంచులు పని చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ డిగ్రీ కళాశాల ఆవరణలో సర్పంచుల మొదటి విడత శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ లో అనేక అంశాలపై అవగాహన పెంపొందించామని తెలిపారు. తద్వారా గ్రామాల అభివృద్ధిలో ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. సర్పంచులు బాగా పని చేస్తేనే వారి గ్రామాలకు మంచి పేరు వస్తుందన్నారు. పంచాయతీ రాజ్ చట్టంలో సర్పంచ్ లకు పొందుపరిచిన అధికారాలు, విధులు తదితర అంశాలను శిక్షణలో ఉన్నాయన్నారు.

ప్రభుత్వ పథకాలు అమలు బాధ్యత సర్పంచ్ లదే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ యాదయ్య, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డీవో శ్రీనివాసరావు, డీఎల్పీవోలు సాయిబాబా, సురేష్ బాబు, ఎంపీఓలు తిరుపతిరెడ్డి, మహమ్మద్ మోజం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.




### మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం.·

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట మున్సిపాలిటీల్లో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మున్సిపల్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.





## నిందితున్ని కఠినంగా శిక్షించాలి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో న్యాయవాది అశోక్ పై దాడి చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడికి నిరసనగా శుక్రవారం విధులు బహిష్కరించిన నాయ్యవాదులు కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నాయ్యావాదులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించాలని కోరారు. న్యాయవాదిపై దాడి చేసినా పోలీసులు తూతూ మంత్రాంగ కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని మండిపడ్డారు. దాడి చేసిన నిందుతుడిపై అటెంప్ట్ టు మర్డర్ కేసు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు. సిద్దిపేట లో ఇది రెండవ సంఘటన అన్నారు. ఇలాంటి సంఘటణాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించే వరకు సిద్దిపేట నుంచే పోరాటం మొదలు పెడుతమని స్పష్టం చేశారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి

### - జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపా రాణి




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** ఫార్మర్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపా రాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎల్లారెడ్డిపేట ,గోవర్ధనగిరి గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలు పొందడానికి వీలుగా తమ భూమి వివరాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వానికి సంబంధించిన పథకాలు పీఎం కిసాన్ డబ్బులు, సబ్సిడీపై ఇస్తున్న ఎరువుల బస్తాలు, పంట దిగుబడి, కొనుగోళ్లకు మద్దతు ధర, పంట రుణాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరి అన్నారు. రిజిస్ట్రేషన్ ద్వారా ప్రతి రైతుకు ఆధార్ నంబర్ వలె ప్రత్యేక రైతు గుర్తింపు నంబర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మోహన్, ఏఈఓలు దేవేందర్, నాగార్జున, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సిల్లీ పాయింట్ : పాటల సాహిత్యం

పాటలో లిరిక్స్ అర్థం కాకపోయినా, మనకు నచ్చిన పదాలు కలిపేసి కొత్త ట్యూన్ కట్టేసి పాడేస్తుంటాం



# రాధాకిషన్ మిడిల్ ఎంట్రీ

- సమాధానాలు దాటవేసిన కేటీఆర్
- అధికారులే చూసుకుంటారంటూ దాటవేత
- వెంటనే రాధాకిషన్ రావును పిలిచిన సిట్
- 7 గంటల పాటు కొనసాగిన ప్రశ్నలు..
- ముగిసిన కేటీఆర్ సిట్ విచారణ.. వాంగ్మూలం నమోదు

ముద్ర, తెలంగాణ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను విచారిస్తున్న సమయంలో.. అనూహ్యంగా మరో వ్యక్తిని పిలిచారు. విచారణ మొదలుకాగానే.. కేటీఆర్ సమాధానాలు దాటవేసినట్లు సమాచారం. అయితే, అంతకు ముందే కొన్ని కీలక విషయాలు మాజీ డీసీపీ రాధాకిషన్ రావు నుంచి రాబట్టిన సిట్.. ఆ ప్రశ్నలు వేసినా కేటీఆర్ ఆన్సర్ ఇవ్వకుండా అంతా అధికారులే చూసుకున్నారంటూ దాట వేసేందుకు ప్రయత్నించారు. దీంతో సిట్ టీం.. వెంటనే రాధాకిషన్ రావును విచారణకు పిలిచింది. రాధాకిషన్ రావు చెప్పిన కొన్ని విషయాలపై వీరిద్దరిని ఎదురెదురుగా కూర్చుండబెట్టి ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ఇలా ఆధారాలు దగ్గర పెట్టి మరీ కేటీఆర్‌ను విచారించారు. సడన్‌గా మాజీ డీసీపీ రాధాకిషన్‌రావుని రప్పించడంపై అంతా చర్చగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కోసం శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు మాజీ మంత్రి కేటీఆర్. తొలుత కేటీఆర్ స్టేషన్ లోపలికి వెళ్లగానే కాసేపు కూర్చోబెట్టారు. చేతిలో కొన్ని పేపర్స్ కేటీఆర్ తీసుకెళ్లారు. పావు గంట తర్వాత విచారణ చేస్తున్న గది వద్దకు ఆయన్ని తీసుకెళ్లారు అధికారులు. జాయింట్ సీపీ విజయ్ కుమార్, ఏసీపీ వెంకటగిరిలతోపాటు ఐదుగురు అధికారులు కలిసి విచారణ చేశారు. రెడీ చేసిన ప్రత్యేక ప్రశ్నలను దగ్గరపెట్టి ఆయన్ని విచారించారు. 2023 ఏడాదిలో బీఆర్ఎస్‌కి భారీగా విరాళాలు ఎలా వచ్చాయి? వ్యాపారవేత్తల నుంచి తీసుకున్న ఎలక్టోరల్ బాండ్స్ వెనుక ఏం జరిగింది? వ్యాపారవేత్తలు ఎందుకు మీపై ఫిర్యాదు చేశారనే కోణంలో విచారణ చేశారు.

**రాధాకిషన్ రావు.. రండి**

పలు ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇవ్వకుండా దాటవేస్తుండటంతో.. దాదాపు గంటన్నర విచారణ తర్వాత సిట్ టీం.. మాజీ డీసీపీ రాధా కిషన్ రావుకు సమాచారం ఇచ్చి పిలిపించారు. ఆయనతో కలిపి కేటీఆర్ ను విచారించారు.



**కేటీఆర్- రాధా కిషన్‌రావులను దగ్గర పెట్టి విచారణ**

ఈ వ్యవహారం గురించి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మీకేం తెలుసు? ఎన్నికలకు ముందు దాదాపు వేలాది ఫోన్లు ఎందుకు ట్యాప్ చేశారు? ప్రైవేటు ఛానెల్ ఎండీ అకౌంట్ నుంచి బీఆర్ఎస్ పార్టీ అకౌంట్‌కి డబ్బులు ఎందుకొచ్చాయి? రాజకీయం-ఆర్థికంగా లబ్ధి కోసమే ఫోన్ ట్యాప్ చేశారా? గతంలో రాధాకిషన్‌రావు చెప్పిన రికార్డులు, ఛాటింగులకు సంబంధించిన డేటాను దగ్గర పెట్టి విచారణ చేసినట్లు తెలుస్తోంది. కొన్ని ప్రశ్నలకు అధికారులు చూసుకున్నారని తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. 2023 ఎన్నికల కంటే ముందు చాలా కేసులు సంబంధించిన డైరెక్షన్ కేటీఆర్ నుంచి వచ్చినట్టు సిట్ అధికారుల వద్ద సమాచారం ఉంది. మునుగోడు ఎన్నికల సమయంలో రైడ్స్ చేసి కొన్ని కోట్లు స్వాధీనం చేసుకుంది టాస్క్‌ఫోర్స్. దానిపై కూడా ప్రశ్నలు సంధించినట్టు సమాచారం.

# బడుగుల అభివృద్ధి కోసం పాటుపడాలి

- సీఎం చంద్రబాబు నాయుడు
- వివిధ రంగాలకు ఇచ్చే రుణాలపై సమీక్ష

ముద్ర, అమరావతి:



బ్యాంకర్లు బడుగుల అభివృద్ధి కోసం పాటుపడాలని ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. శుక్రవారం రచివాలయంలో 233, 234వ ఎస్ఎల్బీసీ సమావేశం నిర్వహించారు. వివిధ రంగాలకు ఇచ్చే రుణాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్కరూ ప్రైవేట్ వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునే పరిస్థితి ఉండకూడదన్నారు. వ్యవసాయం సహా ఏ అవసరం వచ్చినా బ్యాంకుల వద్దకు వెళ్లి రుణాలు తీసుకునే పరిస్థితి రావాలన్నారు. బ్యాంకర్లు ఆ దిశగా పని చేయాలని ఆదేశించారు. రెన్యూవబుల్ ఎనర్జీ రంగానికి బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీ రంగానికి బ్యాంకర్లు ఇచ్చే రుణాలపై మరింత చొరవ చూపాలన్నారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలన్నారు. పేద, ధనికుల మధ్య తారతమ్యాలు పోవాలని కోరారు. రాజధాని అమరావతిని ఫైనాన్స్ సంస్థలకు కేంద్రంగా చేయాలని భావిస్తున్నామన్నారు. బ్యాంకులు సహా వివిధ ఆర్థిక రంగ సంస్థలు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాయన్నారు.

15 బ్యాంకుల కార్యాలయాల ఏర్పాటుకు ఇటీవలే శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. నిర్మాణాలు మరింత ఊపందుకుని త్వరితగతిన పూర్తి కావాలన్నారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసిన విధంగానే ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను బలోపేతం చేయాలన్నారు. టిడ్కో ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయకపోవడం వల్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్వాక్రా గ్రూపు బ్యాంక్ ఖాతాలపై 15 రకాల ఛార్జీలు వేస్తున్నారని, బ్యాంకర్లు ఈ ఛార్జీలను తగ్గించాలన్నారు. భూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. ఇప్పుడు భూ రికార్డులకు పూర్తి స్థాయిలో భద్రత కల్పిస్తమన్నారు. క్యూఆర్ కోడ్ ఇస్తూ పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇస్తున్నామన్నారు.బ్యాంకర్లు కూడా బ్యాంక్ ఖాతాల కోసం క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు.

# జర్నలిస్టులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏ. నర్సింహారెడ్డి

ముద్ర, హైదరాబాద్:





జర్నలిస్టులు ప్రతి నిత్యంసాంకేతికతను అంది పుచ్చుకోవాలని భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏ. నర్సింహారెడ్డి సూచించారు. శుక్రవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో నల్లగొండ జల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రెండు రోజల శిక్షణా తరగతులు ఏర్పాటు చేశారు. ప్రారంభ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏ. నర్సింహారెడ్డి మాట్లాడుతూ తన వ్యక్తిగత జీవితం గురించి చెబుతూ నల్గొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నట్లు తెలిపారు. అలాగే జర్నలిజంతో ముడిపడిన అనేక అంశాలు, అనుభవాలు ప్రస్తావించారు.

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ మీడియాలో భాగంగా ఏ ఐని ఉపయోగిస్తున్న జర్నలిస్టుల సంఖ్య రోజు రోజుకి పెరిగిపోతుందన్నారు. అదే విధంగా జర్నలిజం వృత్తిలో పరిపూర్ణత రావడానికి ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నేడు సాధారణ వ్యక్తులు కూడా సోషల్ మీడియా ద్వారా తమ సందేశాలను చేరవేస్తున్నారని చెప్పారు. మీడియాలో సాంకేతికత పెరిగినందున జర్నలిస్టులు సంయమనం పాటిస్తూ, నిజ నిర్ధారణ చేసుకున్నాకే వార్తలను ప్రచురించడం లేదా ప్రసారం చేయాలని ఆయన సూచించారు.

జర్నలిస్టుల శిక్షణలో భాగంగా మొదటి రోజు జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వర రావు, "గ్రామీణ వార్తలు, ఎలక్ట్రానిక్ మీడియా" అనే అంశంపై, ముద్దం నర్సింహస్వామి "ఫేక్ న్యూస్, సైబర్ క్రైమ్, ఏఐ, సోషల్ మీడియాలో అవలంబించాల్సిన పద్ధతులపై" వివరించారు. సీనియర్ జర్నలిస్టు గోవిందరెడ్డి "నేర వార్తలు" అనే అంశంపై బోధించారు. జర్నలిస్టు దిలీప్ రెడ్డి "సమాచార హక్కు చట్టం2005" అంశంపై సీనియర్ జర్నలిస్టులకు అవగాహన కల్పించారు. శిక్షణా కార్యక్రమంలో భాగంగా జర్నలిస్టులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఖాజా విరాహత్ అలీ, మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయం...విజ్ఞానం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- సూర్యాపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ముద్ర, సూర్యాపేట:



వ్యవసాయం ఒక విజ్ఞానమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఇప్పటివరకు ఉన్న జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ నినాదానికి జై అనుసంధాన్ తోడైందన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామిని సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, అధికారులు గవర్నర్ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవాలయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి లబ్ధిదారులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆ తర్వాత వేదిక వద్ద హుజూర్ నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద వంద ఎకరాల్లో రూ. 150 కోట్లతో నిర్మించనున్న వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన చేశారు. కోదాడ సమీపంలో రూ. 50 కోట్లతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయం, మట్టపల్లి లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో రూ. కోటితో యాత్రికా సదన్, నూతన కిచెన్ షెడ్కు, రూ. కోటితో నిర్మించతలపెట్టిన డార్మెటరీ భవనాలకు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర గవర్నర్ మాట్లాడారు. వసంత పంచమి రోజున పవిత్ర కృష్ణానది తీరాన ఉన్న మట్టపల్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోవడం సౌభాగ్యమన్నారు. రైతులకు ఉపయోగపడే వ్యవసాయ కాలేజీ, విద్యార్థులకు ఉపయోగపడే నవోదయ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. గంగ ,యమునా, సరస్వతి లాగే కృష్ణ, గోదావరి, కావేరి నదులు ఉండడం, మట్టపల్లిలో స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున వ్యవసాయం సాగు చేయడం, ప్రత్యేకించి పామాయిల్ పెంపకం చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ రైతులకు రూ. 2.47కోట్లు విలువ చేసే వ్యవసాయ యంత్ర పరికరాల ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ. 504 కోట్లు, ఆదాయ వనరుల ను పెంపొందించేందుకు మరో రూ. 89 కోట్ల చెక్కులు అందజేశారు.

**నదీ జలాల్లో తెలంగాణ హక్కులను పరిరక్షిస్తాం.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

కృష్ణ, గోదావరి జలాల్లో తెలంగాణ హక్కుల పరిరక్షణ, నీటి వాటా సాధన కోసం ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఏపీ సహా మరెవరైనా సరే తెలంగాణ హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తే గట్టిగా ప్రతిఘటిస్తామని తేల్చి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు రూ. 50 లక్షలతో తెలంగాణఏపీల మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించినట్లు గుర్తు చేశారు. యాత్రికుల సౌకర్యార్థం భవిష్యత్తులో రూ. 80 కోట్లతో హుజుర్నగర్‌మట్టపల్లి రహదారి విస్తరణ పనులతో పాటు ఆలయ సన్నిధిలో డార్మిటరీ, వంటశాలా నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. చరిత్రాత్మక లక్ష్మీ నరసింహ స్వామి ప్రాశస్త్యాన్ని మరింత ఇనుమడింప చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతీ, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్, ఎస్పీ నరసింహ పాల్గొన్నారు.

# యువత కోసం శ్రమిస్తున్న లోకేష్

- యువత కోసం శ్రమిస్తున్న లోకేష్
- కూటమిని కూల్చడం ఎవరి తరం కాదు
- జగన్ అసెంబ్లీకి రావాలి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు

ముద్ర, మంగళగిరి:



యువత అభివృద్ధి కోసం ఆంధ్ర ప్రదేశ్ మంత్రి నారా లోకేష్ నాయుడు నిరంతరం శ్రమిన్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు కొనియాడారు. శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నారా లోకేష్ జన్మదిన వేడుకలు కేవలం ఆనందోత్సవాల కోసం మాత్రమే నిర్వహిస్తున్నవి కావని, ఆయన నాయకత్వంపై రాష్ట్ర ప్రజలు, టీడీపీ శ్రేణులు ఉంచుకున్న అచంచలమైన నమ్మకానికి ఇనిదర్శనమన్నారు. పార్టీని ఆధునిక దిశలో ముందుకు తీసుకెళ్లే సామర్థ్యం, అహర్నిశలు పనిచేసే తత్వం కలిగిన నాయకుడిగా లోకేష్ బాబు నిలుస్తున్నారని కొనియాడారు. నారా లోకేష్ బాబు తెలుగుదేశం పార్టీకి మాత్రమే కాదు, రాష్ట్ర భవిష్యత్తుకూ ఒక "గ్రోత్ ఇంజిన్" లాంటి నాయకుడని అభివర్ణించారు. లోకేష్ బాబు నిరంతరం ప్రజల్లో ఉంటూ, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో సుమారు 25 శాతం వాటా మన రాష్ట్రానికే వచ్చేలా చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నాని చెప్పారు. ఇది ఆయన నాయకత్వ పటిమపై పారిశ్రామికవేత్తలకు ఉన్న నమ్మకమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 26 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కంపెనీలను ఆహ్వానిస్తున్నారన్నారు. గతంలో డావోస్ పర్యటనలు కేవలం ఫోటో షూట్లకే పరిమితమయ్యేవి. కానీ లోకేష్ బాబు పర్యటన వల్ల RMZ వంటి సంస్థలు విశాఖలో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గ్లోబల్ క్యాపబిలిటీ పార్క్ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయన్నారు. మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధి చూపిస్తున్న లోకేష్ బాబు, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే భవిష్యత్తు నాయకుడని ఆకాంక్షించారు. లోకేష్ బాబు కేవలం రాష్ట్రానికే పరిమితం కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతున్నారన్నారు. ఆయన కృషి వల్ల ప్రపంచ స్థాయి ఇన్వెస్టర్లకు మన రాష్ట్రంపై గట్టి నమ్మకం ఏర్పడిందన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో పర్యటించి అక్కడి దిగ్గజ కంపెనీలతో మాట్లాడారన్నారు. అభివృద్ధిని అన్ని ప్రాంతాలకు సమానంగా పంచడం, యువతకు నైపుణ్యాన్ని అందించడం, పారిశ్రామిక వేగంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడమే లోకేష్ బాబు లక్ష్యమన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడిదారులను పర్సెంటేజీల కోసం వేధించారని ఆరోపించారు. దీనివల్ల లూలు గ్రూప్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, జాకీ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయని, దీంతో ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తిందని గుర్తుచేశారు. కేవలం అప్పులు చేసి లేదా పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతోనే సంక్షేమ పథకాలు అమలు చేయలేమని..రాష్ట్రంలో సంపద సృష్టించాలంటే పరిశ్రమలు రావాలని వివరించారు. కంపెనీలను బెదిరించకుండా, వాటికి అవసరమైన భూమిని, ప్రోత్సాహకాలను అందిస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. లోకేష్‌బాబు సుమారు 3132 కిలోమీటర్లు పాదయాత్ర చేసి, రాష్ట్రంలోని ప్రతి జిల్లా, ప్రతి నియోజకవర్గంలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారన్నారు. పాదయాత్రలో ప్రజల మనోభావాలను అర్థం చేసుకున్న లోకేష్‌బాబు, ఇప్పుడు విదేశాల్లో తిరుగుతూ ఆయా ప్రాంతాలకు తగిన పరిశ్రమలను తీసుకువస్తున్నారన్నారు. ప్రతిపక్షం ఫేక్ ప్రచారాలతో ఇన్వెస్టర్లను భయపెట్టాలని చూస్తున్నా రాష్ట్ర భవిష్యత్తుకోసం నిరంతరం శ్రమిస్తున్న లోకేష్ బాబు రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికీ ఒక పారిశ్రామికవేత్తను అందించే దిశగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతారని ధీమా వ్యక్తం చేశారు.

విజయసాయి రెడ్డి అన్నట్లుగా కూటమిని విడగొడితే తాము గెలుస్తామనుకోవడం వారి భ్రమ అన్నారు. ఇది కేవలం నాయకుల మధ్య కుదిరిన ఒప్పందం కాదు, ప్రజలు ఆశీర్వదించిన బంధమన్నారు. ఈ కూటమి మరో 15 ఏళ్ల పాటు పటిష్టంగా ఉంటుందన్నారు. రాష్ట్రాన్ని 'స్వర్ణాంధ్రప్రదేశ్'గా మార్చడమే మా లక్ష్యమన్నారు. ఇందుకోసం గ్లోబల్ ఇన్వెస్టర్ల నమ్మకాన్ని గెలుచుకుని పెట్టుబడులు తీసుకువస్తుమన్నారు. వైసీపీ చేసే ఫేక్ ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి జగన్ అసెంబ్లీకి రావాలని సూచించారు. గతంలో పోలవరం పూర్తి చేస్తామని మాట తప్పిన వారు, ఇప్పుడు బస్సు యాత్రలు, పాదయాత్రలు చేస్తామంటే ప్రజలు నమ్మరన్నారు. తీర్పును గౌరవించని వారికి 2029లో కూడా అంతకంటే ఘోరమైన పరాజయం తప్పదని జోస్యం చెప్పారు. అసెంబ్లీకి రాకుండా కేవలం జీతాలు తీసుకోవడం నైతికత అనిపించుకోదన్నారు. నసెంబ్లీకి రాని ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తగిన నిర్ణయం తీసుకుంటారన్నారు. అవసరమైతే వారిని 'రీకాల్' చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధిని కాంక్షించే ప్రజలే ఈ కూటమిని గెలిపించారని, కుయుక్తులతో దీనిని విడదీయలేరని స్పష్టం చేశారు. ప్రతిపక్షం ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడాలని హితవు పలికారు.

# గ్రామ సభలకు డిజిటల్ ముద్ర

- గ్రామ సభలకు డిజిటల్ ముద్ర
- 26న రాష్ట్రవ్యాప్తంగా 'సభా సార్' అమలు

ముద్ర, హైదరాబాద్:

కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ (ఎంఓపీఆర్) గ్రామ సభల డాక్యుమెంటేషన్‌ను డిజిటల్‌గా మార్చేందుకు 'సభా సార్' అనే ఏఐ ఆధారిత ప్లాట్‌ఫామ్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్లాట్‌ఫామ్ 2025 ఆగస్టు 14న ప్రారంభమై, ఆడియో లేదా వీడియో రికార్డింగ్‌ల నుంచి బహు భాషల్లో ఆటోమేటిక్‌గా సమావేశ మినిట్స్‌ను రూపొందించే సౌకర్యాన్ని కలిగి ఉంది. దీనివల్ల కార్యనిర్వహణలో శ్రమ తగ్గడంతో పాటు పారదర్శకత, సామర్థ్యం మరింత పెరుగుతాయని అధికారులు వెల్లడించారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ నెల 26న నిర్వహించనున్న ప్రత్యేక గ్రామ సభల్లో ఈ 'సభా సార్' ప్లాట్‌ఫామ్‌ను తప్పనిసరిగా వినియోగించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులు తమ పరిధిలోని గ్రామపంచాయతీ కార్యదర్శులకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కమిషనర్, పంచాయతీ రాజ్ -గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ శృతి ఓఝా ఉత్తర్వులు జారీ చేశారు. 'సభా సార్' ద్వారా పరిపాలనా భారం తగ్గి, గ్రామ సభల చర్చల సమగ్ర రికార్డులు డిజిటల్‌గా భద్రపడి, సమయానికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**సిల్లీ పాయింట్ :**
**ఫ్రిజ్ ధ్యానం:**
ఆకలి వేసినా
వేయకపోయినా,
కిచెన్‌లోకి వెళ్ళిన ప్రతిసారీ
ఫ్రిజ్ డోర్ తీసి లోపల
ఏముందో ఒకసారి చూసి
ఏమీ తీసుకోకుండానే తిరిగి
వచ్చేస్తాం.

# వనంలో అధునాతన టెక్నాలజీ

- **తొలిసారి ఏఐ వినియోగం- దేశంలోనే వినూత్న ప్రయోగం**
- **తప్పిపోయిన పిల్లలు, వృద్ధులు ఇక సేఫ్**
- **ఫేస్ రికగ్నిషన్‌తో నేరస్తులపై నిఘా**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు ఈసారి అత్యాధునిక భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈనెల 28 నుంచి 31వరకు జరిగే జాతరకు సుమారు రెండు కోట్ల మంది భక్తులు తరలిరానుండటంతో, భక్తుల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం, పోలీసుశాఖ హైటెక్ ప్రణాళిక అమలు చేసింది. తొలిసారి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత నిఘా వ్యవస్థను వినియోగిస్తూ, పిల్లల అపహరణలు, దొంగతనాలు, తొక్కిసలాటలు నివారించేందుకు పటిష్ట చర్యలు చేపట్టారు.

**తొక్కిసలాటను ముందే గుర్తించే కెమెరాలు..**
డ్రోన్లు, హీలియం బెలూన్లకు అమర్చిన పాన్-టిల్ట్-జూమ్ కెమెరాల ద్వారా గగనతల నుంచే జనసమూహంపై నిఘా కొనసాగుతుంది. "మేడారం 2.0" పేరుతో అమలులోకి తెచ్చిన ఈ ప్రణాళికలో 'టీజీ క్వెస్ట్' అనే ఏఐ డ్రోన్ వ్యవస్థ 30చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో 24గంటలూ గస్తీ కాస్తుంది. తొక్కిసలాటకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందే గుర్తించి కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ పంపే విధంగా కెమెరాలను ఏర్పాటు చేశారు.

**-పిల్లలు తప్పిపోతే క్షణాల్లో గుర్తింపు..**
జియో ట్యాగింగ్ ఆధారిత మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా పిల్లలు, వృద్ధులు తప్పిపోతే క్షణాల్లో గుర్తించనున్నారు. ప్రధాన ద్వారాల వద్ద భక్తుల వివరాలు నమోదు చేసి జియో ట్యాగ్ ఉన్న తాడును చేతికి కడతారు. ట్యాగ్ స్కాన్ చేయగానే వారి స్థానం వెంటనే తెలిసేలా వ్యవస్థ రూపొందించారు.

**ఫేస్ రికగ్నిషన్‌తో నేరస్తులపై చెక్..**
ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీతో లక్షలాది భక్తుల మధ్య నేరస్తుల కదలికలను గుర్తించనున్నారు. పార్కింగ్ ప్రదేశాలు, ఆసుపత్రులు, రద్దీ ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు, వస్తువులను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటారు. మొత్తం జాతర కాలంలో 13వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తూ భక్తులకు భద్రత కల్పించనున్నారు.



## నేతాజీ నగర్‌లో ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

**ముద్ర, న్యూస్ బ్యూరో, హైదరాబాద్ :**
మెహిదీపట్నం సమీపంలోని నేతాజీ నగర్ కాలనీలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాలనీ పార్కులో ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. దేశ స్వాతంత్ర్య సముపార్జనలో నేతాజీ చేసిన త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ నగర్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి ఏ. కృష్ణమూర్తి, నేతాజీ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. అప్పారావు, ఉపాధ్యక్షుడు ఖాలిద్ సర్వర్, జాయింట్ సెక్రటరీ ఎం. రంగా రెడ్డి, కోశాధికారి అమర్నాథ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు టి.ఎస్. ఆనంద్ రెడ్డి, మాజీ కార్యదర్శి, ముద్ర సంపాదకుడు వై. నరేందర్ రెడ్డి మాట్లాడారు. సంపన్న కుటుంబంలో జన్మించి, సివిల్ సర్వీస్‌కు ఎంపికైనప్పటికీ దానిని త్యజించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహానుభావుడు నేతాజీ అని కొనియాడారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి, ప్రవాస భారతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి వివిధ దేశాల మద్దతు కూడగట్టేందుకు కృషి చేశారని తెలిపారు. దేశభక్తి, త్యాగానికి ప్రతీక అయిన నేతాజీ భారత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫక్రుద్దీన్, వెంకటేశ్వర్లు, కే. ప్రభాకర్, గంగాధరన్, దామోదర్, డాక్టర్ వరప్రసాద్, ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విద్య స్కూల్‌లో వైభవంగా వసంత పంచమి వేడుకలు

**ముద్ర, కాప్రా :**
వసంత పంచమి పర్వదినాన్ని డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్‌లోని శ్రీ విద్య స్కూల్‌లో అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శారదా రాజేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. ఉదయం ప్రత్యేక హోమంతో వేడుకలు ప్రారంభమై, అనంతరం సరస్వతి దేవికి పుష్పాలు, పండ్లు సమర్పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన పూజా కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని సరస్వతి వందనాలు పాడుతూ కార్యక్రమాలకు మరింత శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శారదా రాజేశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాల్లో జ్ఞానం, క్రమశిక్షణ, సంస్కారాలు అత్యంత ముఖ్యమని అన్నారు. వసంత పంచమి వంటి పర్వదినాలు విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించి చదువుపై ఆసక్తిని పెంచుతాయన్నారు. సరస్వతి దేవి ఆశీస్సులతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తిగీతాలు, శ్లోక పఠనం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆశీర్వచనాలు అందించి చదువులో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను తిలకించారు.



# మెతుకు ఆనంద్‌కు లీగల్ నోటీసు

- **రూ.10 కోట్ల నష్టపరిహారం, బహిరంగ క్షమాపణకు డిమాండ్**



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
తనపై నిరాధార ఆరోపణలు చేసి వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించారని ఆరోపిస్తూ.. మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తన న్యాయవాదుల ద్వారా లీగల్ నోటీసులు పంపించారు. పది కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించడంతో పాటు, వారం రోజుల్లో బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. జనవరి 14, 19 తేదీల్లో జరిగిన మీడియా సమావేశాల్లో మెతుకు ఆనంద్ తప్పుడు, అసత్య, అభూత కల్పనలతో కూడిన అవినీతి ఆరోపణలు చేసి తన గౌరవానికి, వ్యక్తిగత జీవితానికి భంగం కలిగించారని స్పీకర్ తెలిపారు. జనవరి 19న జరిగిన మీడియా సమావేశంలో శాసనసభ్యుల అనర్హత అంశంలో తాను వందల కోట్ల లంచాలు తీసుకున్నట్లు ఆరోపించడం రాజ్యాంగబద్ధమైన శాసన సభాపతి పదవిని అవమానించడమేనని స్పష్టం చేశారు. అలాగే వికారాబాద్ పురపాలక సంఘాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్నానని కట్టు కథలు అల్లారని, జనవరి 14న తనను "బుల్లెట్ రాజు" అంటూ అవహేళనగా వ్యాఖ్యానించి మానసికంగా క్షోభకు గురిచేశారని నోటీసులో పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్ల నుంచి లంచాలు వసూలు చేస్తున్నానని చేసిన వ్యాఖ్యలు కూడా తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ, నిరాధార ఆరోపణలు చేయడం వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడమే కాక రాజ్యాంగ పదవులను అవమానించడమని స్పీకర్ పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత2023లోని సెక్షన్ 499, 500ల ప్రకారం ఇటువంటి దురుద్దేశ ఆరోపణలు శిక్షార్హమని నోటీసులో స్పష్టం చేశారు. ఏడు రోజుల్లో వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని, లేకపోతే న్యాయస్థానాల ద్వారా తగు చర్యలు తీసుకుంటామని న్యాయవాదుల ద్వారా లీగల్ నోటీసులు అందించినట్లు వెల్లడించారు.

## నారాయణపేట మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ ఆశలు

- **హరి నారాయణ భట్టాడ్‌కు డీసీసీ శుభాకాంక్షలు**

**ముద్ర, నారాయణపేట ప్రతినిధి :**



నారాయణపేట మున్సిపల్ కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థిగా ప్రముఖ బంగారు వ్యాపారవేత్త హరి నారాయణ భట్టాడ్ సతీమణి సరిత పేరును కాంగ్రెస్ ప్రకటించడంతో, డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి హరి నారాయణ భట్టాడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా నారాయణపేట మున్సిపల్ పీఠాన్ని ఈసారి కాంగ్రెస్ సొంతం చేసుకోవాలన్న లక్ష్యంతో పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో కౌన్సిలర్ టికెట్ల కోసం ఆశావాహుల మధ్య పోటీ కొనసాగుతోంది. పార్టీలో రెబల్ అభ్యర్థుల పోటీ ఉండే అవకాశమూ కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆశావాహులను బుజ్జగించే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యేలోపు భీఫాం ఎవరి సొంతమవుతుందో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

# యువజన కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేద్దాం

- **రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి**
- **నారాయణపేటలో భారీ బైక్ ర్యాలీ**



**ముద్ర, నారాయణపేట ప్రతినిధి :**
నారాయణపేట జిల్లాలో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడానికి అందరూ సమైక్యంగా కృషి చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో నాయకులు ప్రసంగించారు. పంచాయతీ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పనితీరు అభినందనీయమని కొనియాడారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీలో స్థానం సంపాదించిన రవికుమార్ గౌడ్, శ్రీకాంత్, బండి ఆనందలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ విజయ్ కుమార్, డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, చిట్టెం అభిజయ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ శివంత్ రెడ్డి, కోట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## దావోస్ వేదికపై సీఎం రేవంత్‌కు తెలుగువారి ఘన స్వాగతం

**ముద్ర, పరకాల :**



ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సమావేశంలో పాల్గొనడానికి స్విట్జర్లాండ్ వెళ్లిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అక్కడ నివసిస్తున్న తెలుగువారు ఘన స్వాగతం పలికారు. దావోస్ వేదికగా జరుగుతున్న ఈ సమావేశాల సందర్భంగా జ్యూరిక్‌లో స్థిరపడిన తెలంగాణ వాసులు ముఖ్యమంత్రికి ఆత్మీయ ఆహ్వానం అందించారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన చిట్టిరెడ్డి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ స్వాగత కార్యక్రమం జరిగింది. జ్యూరిక్ తెలుగు సమాజానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అక్కడి తెలుగువారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ ప్రతిష్టను పెంచేందుకు సీఎం రేవంత్ తీసుకుంటున్న చొరవను జ్యూరిక్ తెలుగు సమాజం అభినందించిందన్నారు. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ ప్రాంతంలో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన అనేక మంది ప్రజలు నివసిస్తున్నారని ఆయన తెలిపారు.

# ప్రపంచం కోసం 'శాంతి మండలి'

- **19 దేశాల అగ్రనేతల సమక్షంలో దావోస్‌లో అధికారికంగా ప్రకటించిన ట్రంప్**
- **కొత్త కూటమితో ఉక్రెయిన్ యుద్ధం త్వరలో ముగిసిపోనుందన్న ట్రంప్**
- **ఐరాసతోనూ కలిసి పనిచేస్తానన్న అమెరికా అధ్యక్షుడు**
- **సభ్యదేశంగా చేరిన పాకిస్తాన్**




**ముద్ర, దావోస్ :**
మాటలతోనే పెనుకుంపట్లు రాజేసే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శాంతికాముకుడి అవతారమెత్తి ప్రపంచ యవనికపై కొత్త కూటమిని కొలువు తీర్చారు. ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలు జరుగుతున్న దావోస్ నగరంలో 19 దేశాల అగ్రనేతల సమక్షంలో బోర్డ్ ఆఫ్ పీస్(శాంతి మండలి)ని ట్రంప్ గురువారం అధికారికంగా ప్రకటించారు. అగ్రనేతల సమక్షంలో సంబంధిత పత్రంపై ట్రంప్ సంతకం చేసి కొత్త కూటమిని ఉనికిలోకి తీసుకొచ్చారు. ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయంగా తన కనుసన్నల్లో పనిచేసేలా గాజా పునర్నిర్మాణ, అభివృద్ధి మాటున శాంతి మండలిని ఏర్పాటు చేస్తున్నారన్న తీవ్ర ఆరోపణలను ట్రంప్ ఈ సందర్భంగా తోసిపుచ్చారు. " శాంతి మండలిలో భాగస్వాములుగా ఉండేందుకు ప్రతి దేశం అమితాసక్తి కనబరుస్తోంది. ఇవేగాక మరెన్నో దేశాలతో కలిసి పనిచేస్తాం. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితితో కలిసి పనిచేస్తా. ఇప్పుడిప్పుడే ఎన్నో మంచి విషయాలు జరుగుతున్నాయి. ఐరోపా, అమెరికా, పశ్చిమాసియాలో పరిస్థితులు సద్దుమణుగుతున్నాయి. ఏడాది క్రితం యుద్ధాలతో ప్రపంచం అగ్నిగోళంగా ఉండేది. ఇది చాలా మందికి తెలీదు. సమకాలీన పరిస్థితుల పర్యవసానంగా ఏర్పడిన ఈ 'శాంతి మండలి' అంతర్జాతీయ కూటముల్లో ఒకటిగా గొప్పదిగా ఉండబోతోంది. శాంతి మండలి అనేది ప్రపంచానికి చాలాచాలా ప్రత్యేకమైంది. ఐక్యరాజ్యసమితిలో ఎంతో సత్తా ఉంది. ఒక పశ్చిమాసియాలో ఇజ్రాయెల్-హమాస్ యుద్ధమేకాదు ప్రపంచవ్యాప్తంగా యుద్ధాల ముగింపు కోసం ఐరాసతో కలిసి పనిచేస్తా. ఐరాస, కొత్త శాంతి మండలి కలిసి పనిచేస్తే అది ప్రపంచంలోనే ప్రత్యేకంగా నిలిచిపోతుంది. ముఖ్యంగా పశ్చిమాసియాకు కొత్త రోజులొస్తాయి. గాజా యుద్ధం దాదాపు చివరి దశకు చేరుకుంది. అక్కడక్కడా చెదురుమదురు సంఘటనలు జరుగుతున్నా వాటిని మనం ఆపేయబోతున్నాం. వాగ్దానం చేసినట్లు హమాస్ వాళ్లు ఆయుధాలు విడనాడాలి. ఆయుధాలను త్యజించని రోజున అదే వాళ్లకు ఆఖరి రోజు అవుతుంది" అని ట్రంప్ హెచ్చరించారు. కొత్త కూటమితో ఉక్రెయిన్ యుద్ధం త్వరలో ముగిసిపోనుందని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**35 దేశాలతో మొదలు..**
35 దేశాలతో శాంతి మండలిని ఆరంభిస్తున్నామని ట్రంప్ తెలిపారు. వేదికపై ఆసీనులైన పలువురు అగ్రనేతలను ట్రంప్ పేరుపేరున పొగిడారు. తనతో కలిసి ముందడుగువేస్తున్నందుకు అభినందించారు. "మేమంతా ఎంతో కీలకమైన పనులు చేయబోతున్నాం. ఇంతటి ఘనకార్యాలు చేయడానికి ఇంతకు మించిన వేదిక మరోటి లేదు. వ్యవస్థాపక చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తా. గర్వంగానూ ఉంది" అని ట్రంప్ అన్నారు. శాంతి మండలి డాక్యుమెంట్‌పై ట్రంప్ సంతకంచేశాక అక్కడి 19 దేశాల అగ్రనేతలను సంతకాలుచేశారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సైతం కార్యక్రమంలో పాల్గొని కూటమిలో చేరుతున్నట్లు ప్రకటించారు. ముష్కరులను ముద్దుచేస్తూ ఉగ్రవాదాన్ని పెంచి అశాంతిని రాజేసే పాకిస్తాన్.. శాంతికాముక బోర్డులో చేరడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు దేశాలు శాంతి మండలిలో చేరేందుకు ఆసక్తి చూపించగా ఐరోపా సమాఖ్యలోని కొన్ని సభ్యదేశాలు నిరాకరించాయి. ఆహ్వానం అందుకున్నా ఇంకొన్ని దేశాలు తమ వైఖరిని బయటపెట్టలేదు. భారత్ సైతం ఈ కార్యక్రమం నుంచి దూరంగా ఉండిపోయింది.

**నేనింకా రియల్ ఎస్టేట్ మనిషినే..**
గాజా పునర్నిర్మాణలో భాగంగా గాజాను సముద్రతీర ప్రాంతాలకు, రవాణా, ఇంధన మౌలిక వసతులను అద్భుతంగా తీర్చిదిద్దుతామని ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ అన్నారు. ఇదే వేదికపై ఆయన నూతన గాజా ఇలా ఉండబోతోందంటూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలుచేశారు. " సముద్రతీర ప్రాంతం ఎంత బాగుందో చూడండి. బీచ్‌లతో అలరారుతున్న గాజా స్ట్రిప్‌లో ఆకాశహర్మ్యాలను నిర్మించబోతున్నాం. తీరప్రాంత పర్యాటకం ఊపందుకోబోతోంది. ఇన్నాళ్లూ ఇదే ప్రాంతంలో కడు పేదరికంలో మగ్గిపోయిన పాలస్తీనియన్లు మేం చేసే అభివృద్ధి తర్వాత అద్భుతజీవనం కొనసాగిస్తారు. భవిష్యత్‌లో సాక్షాత్కారం కాబోయే ఈ భవంతులను చూస్తుంటే నాలోని రియల్ ఎస్టేట్ వ్యాపారి మేల్కొంటున్నాడు. మనస్ఫూర్తిగా చెప్పాలంటే నేను రియల్ ఎస్టేట్ వ్యక్తినే" అని ట్రంప్ అన్నారు.

**మండలిలో చేరతామన్న దేశాలు**
ఖతార్, సౌదీ అరేబియా, అర్జెంటీనా, మంగోలియా, పాకిస్తాన్, తుర్కియే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఉజ్బెకిస్తాన్, వియత్నాం, ఇండోనేసియా, జోర్డాన్, అల్బేనియా, అర్మేని యా, అజర్‌బైజాన్, బహ్రెయిన్, బెలారస్, బల్గేరియా, ఈజిప్ట్, హంగేరీ, కజకిస్తాన్, కొసోవో, మొరాకో

**సమ్మతి తెలపని దేశాలు..**
ఫ్రాన్స్, నార్వే, స్లోవేనియా, స్వీడన్, బ్రిటన్

**-తటస్థ వైఖరితో ఉన్న దేశాలు..**
రష్యా, భారత్, సింగపూర్, థాయ్‌లాండ్, ఉక్రెయిన్, ఇటలీ, జర్మనీ, కాంబోడియా, చైనా, క్రొయేషియా, సైప్రస్, గ్రీస్, పరాగ్వే, యూరోపియన్ యూనియన్ కార్యనిర్వాహక విభాగం

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.01.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## సిల్లీ పాయింట్ :నిద్రలో వెతుకులాట

అర్ధరాత్రి మెలకువ వస్తే.. టైమ్ చూడటం కోసం ఫోన్ వెతుకుతాం, కానీ ఫోన్ వెలుగు కళ్ళల్లో పడగానే అబ్బా అని మళ్ళీ కళ్ళు మూసేసుకుంటాం.



# టీమిండియాపై సూర్య ప్రభావం

- పొట్టి ఫార్మాట్‌లో వరుస విజయాలు
- కెప్టెన్‌గా సూర్య కుమార్ పటిష్ట వ్యూహాలు
- వ్యక్తిగత ఫామ్ రెండో స్థానంలో

**ముద్ర, న్యూ ఢిల్లీ**

టీమిండియాకు సూర్య కుమార్ యాదవ్ సారథ్యంలో పొట్టి ఫార్మాట్‌లో విజయ పరంపర ఆగడం లేదు. 2024లో T20 వరల్డ్ కప్ విజయం తర్వాత జట్టు బాధ్యతలు చేపట్టిన సూర్య, అప్పటి నుంచి ఒక్క T20 సిరీస్ కూడా ప్రత్యర్థులకు అప్పగించలేదు. ఆస్ట్రేలియా నుంచి దక్షిణాఫ్రికా వరకూ ప్రతి జట్టుపై ఆధిపత్యం చాటుతూ ట్రోఫీలను కూడా సొంతం చేసుకుంది.

**టాస్‌పై సూర్య దృష్టి**

ఇటీవలి కాలంలో టీమిండియా కెప్టెన్లు టాస్ విషయంలో ఇబ్బంది పడుతున్నా, సూర్య మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నాడు. న్యూజిలాండ్‌తో తొలి T20లో టాస్ ఓడిపోయి మైదానం అంచనాలో కాస్త తడబడినా, ఆ తర్వాత భారత బ్యాటర్లు చూపిన ప్రతాపం మ్యాచ్ దిశనే మార్చింది. డ్యూ ప్రభావం లేకపోయినా బ్యాటింగ్‌కు అనుకూలమని భావించినట్టు సూర్య వెల్లడించాడు.

**రెండో మ్యాచ్‌లో ఖచ్చిత నిర్ణయం**

రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో T20లో సూర్య టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. మైదానం పరిస్థితిని ముందుగానే అంచనా వేసిన ఈ నిర్ణయం భారత బౌలర్లకు అనుకూలంగా మారే అవకాశముంది. డ్యూ ప్రభావం తక్కువగా ఉంటే ప్రత్యర్థులపై పైచేయి సాధించగలమన్న విశ్వాసం జట్టులో కనిపిస్తోంది.

**జట్టులో మార్పులు**

రెండో T20లో టీమిండియా కొన్ని మార్పులతో బరిలోకి దిగింది. తొలి మ్యాచ్‌లో గాయపడిన అక్షర్ పటేల్‌కు T20 వరల్డ్ కప్‌ను దృష్టిలో పెట్టుకొని విశ్రాంతి ఇచ్చారు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు కూడా విరామం కల్పించారు. అక్షర్ స్థానంలో కుల్దీప్ యాదవ్, బుమ్రా స్థానంలో హర్షిత్ రాణాకు అవకాశం ఇచ్చారు.

**కొనసాగుతున్న ఆధిపత్యం**

సూర్య కుమార్ యాదవ్ నాయకత్వంలో టీమిండియా పొట్టి ఫార్మాట్‌లో స్పష్టమైన ఆధిపత్యంతో ముందుకు సాగుతోంది. వ్యక్తిగత గణాంకాలకంటే జట్టు విజయాలే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రయాణం, ప్రత్యర్థులకు గట్టి సవాల్‌గా మారుతోంది.

**నాయకత్వమే ప్రధాన బలం**

వ్యక్తిగతంగా సూర్య కుమార్ యాదవ్ ప్రదర్శన పెద్దగా మెరిసిపోకపోయినా, కెప్టెన్‌గా మాత్రం స్పష్టమైన ముద్ర వేశాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో సమతుల్యతను కాపాడుతూ జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. స్వదేశం, విదేశాల్లోనూ మ్యాచ్‌లపై పూర్తి నియంత్రణ సాధించడం ఈ జట్టు ప్రత్యేకతగా మారింది.





# ఊచకోత.. ఇది సర్ఫరాజ్ విధ్వంసకాండ

**ముద్ర, న్యూ ఢిల్లీ**

భారత క్రికెట్‌లో సెలక్టర్ల నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రతిసారి తన బ్యాట్‌తో నే సమాధానం చెప్పడం సర్ఫరాజ్ ఖాన్‌కు అలవాటుగా మారింది. తాజాగా రంజీ ట్రోఫీలో ఈ ముంబై బ్యాటర్ మరోసారి ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియంలో జరుగుతున్న ఎలైట్ గ్రూప్‌డి మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్లను సర్ఫరాజ్ ఊచకోత కోశాడు. టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ నేతృత్వంలోని హైదరాబాద్ బౌలింగ్ విభాగంపై ఎదురుదాడికి దిగి, తన ఫస్ట్ క్లాస్ కెరీర్లో 5వ డబుల్ సెంచరీని బాదేశాడు.

హైదరాబాద్‌తో జరుగుతున్న ఈ కీలక మ్యాచులో ముంబై జట్టు పటిష్ట స్థితిలో నిలవడానికి సర్ఫరాజ్ న్ ఇన్నింగ్స్ ప్రధాన కారణం. మ్యాచ్ మొదటి రోజే సెంచరీ పూర్తి చేసుకున్న సర్ఫరాజ్, 142 పరుగులతో నాటౌట్‌గా రెండో రోజు ఆటను ప్రారంభించాడు. శుక్రవారం (జనవరి 23) ఉదయం సెషన్ నుంచే హైదరాబాద్ బౌలర్ల మీద విరుచుకుపడ్డాడు. కేవలం 206 బంతుల్లోనే తన డబుల్ సెంచరీ మార్కును అందుకున్నాడు. సర్ఫరాజ్ తన ఇన్నింగ్స్‌లో మొత్తం 219 బంతులు ఎదుర్కొని 227 పరుగులు చేశాడు. ఇందులో 19 ఫోర్లు, 9 భారీ సిక్సర్లు ఉండడం గమనార్హం. కేవలం 61 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలోనే 5 డబుల్ సెంచరీలు సాధించి తన అసాధారణ ఫామ్‌ను నిరూపించుకున్నాడు.

ఈ ఇన్నింగ్స్ సందర్భంగా సర్ఫరాజ్ హైదరాబాద్ కెప్టెన్, టీమిండియా స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌ను కూడా వదల్లేదు. సిరాజ్ వేగాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ పరుగుల వరద పారించాడు. క్రీజులో ఉన్నంతసేపు బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆధిపత్యం ప్రదర్శించాడు. ముంబై కెప్టెన్ సిద్ధేష్ లాడ్‌తో కలిసి సర్ఫరాజ్ 249 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. లాడ్ కూడా 104 పరుగులతో మెరిశాడు. చివరకు రక్షణ్ బౌలింగ్‌లో సర్ఫరాజ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. అప్పటికే ముంబై స్కోరు 488 పరుగులకు చేరుకుంది.

సర్ఫరాజ్ ఖాన్ గత కొంతకాలంగా దేశవాళీ క్రికెట్‌లో అజేయంగా దూసుకుపోతున్నాడు. గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో సెంచరీ, ఆపై విజయ్ హజారే ట్రోఫీలోనూ సెంచరీతో మెరిసిన ఈ యువ బ్యాటర్, ఇప్పుడు కొత్త ఏడాదిని డబుల్ సెంచరీతో ప్రారంభించాడు. టీమిండియా మేనేజ్‌మెంట్, సెలక్షన్ కమిటీ తనను పదే పదే విస్మరిస్తున్నప్పటికీ, మైదానంలో తన ప్రదర్శన ద్వారా వారి నిర్ణయాలను ప్రశ్నిస్తున్నాడు. ఇంతటి స్థిరమైన ఫామ్‌లో ఉన్న ఆటగాడిని జాతీయ జట్టులోకి తీసుకోకపోవడంపై సోషల్ మీడియాలో నెటిజన్లు సెలక్టర్లపై మండిపడుతున్నారు.

హైదరాబాద్ పిచ్‌పై సర్ఫరాజ్ ఆడిన తీరు చూస్తుంటే అతడి టెక్నిక్, పవర్ హిట్టింగ్ కెపాసిటీ స్పష్టమవుతోంది. ముఖ్యంగా స్పిన్నర్లను స్వీప్ షాట్లతో, పేసర్లను అప్పర్ కట్లతో బెంబేలెత్తించాడు. ఈ భారీ స్కోరుతో ముంబై జట్టు ఈ మ్యాచ్‌లో పట్టు సాధించింది. సర్ఫరాజ్ చేసిన ఈ 227 పరుగులు కేవలం స్కోరు బోర్డు మీద అంకెలు మాత్రమే కాదు, జాతీయ జట్టు తలుపులు తట్టే ఒక స్ట్రాంగ్ హెచ్చరిక అని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## వరల్డ్ కప్‌లో ప్రత్యర్థులకు అతడే ముప్పు..

**ముద్ర, న్యూ ఢిల్లీ**

మరో రెండు వారాల్లో 2026 టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నమెంట్‌కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా, హోస్ట్‌గా టీమిండియా మరోసారి ట్రోఫీని దక్కించుకునేందుకు బరిలోకి దిగుతుంది. స్టార్ ఆటగాళ్లతో కూడిన జట్టుతో భారత్ ఈసారి కూడా టైటిల్ కోసం గట్టిగా పోటీ ఇవ్వనుంది. ఈ నేపథ్యంలో మారియట్ బోన్‌వాయ్ ఐసీసీ భాగస్వామ్య కార్యక్రమం ప్రారంభ వేడుకలో పాల్గొన్న సందర్భంగా భారత మాజీ క్రికెటర్, మాజీ హెడ్ కోచ్ రవి శాస్త్రి మాట్లాడుతూ.. టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మపై ప్రశంసల జల్లు కురిపించారు. రాబోయే వరల్డ్ కప్‌లో అభిషేక్ ప్రదర్శనే భారత్ విజయంలో కీలకంగా మారుతుందని అన్నారు. ఇతర జట్లు అతడిని ప్రత్యేకంగా గమనిస్తాయని పేర్కొన్నారు. అయితే, అభిషేక్ శర్మ బ్యాటింగ్ పై ఎలాంటి సందేహం లేదు.. అతడే ప్రస్తుతం ప్రపంచంలో నంబర్ వన్ టీ20 బ్యాట్స్‌మన్ అని రవిశాస్త్రి తెలిపారు. అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు.. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌ను పూర్తిగా తమవైపుకు తిప్పేశాడు.. అతడి ఆత్మవిశ్వాసం అద్భుతంగా ఉంది.. హోమ్ గ్రౌండ్‌లో ప్రేక్షకుల మద్దతు కూడా అతడికి ఉంటుంది.. శర్మ రాణిస్తే, భారత్ కూడా వరల్డ్ కప్ లో దూసుకుపోతుందని వ్యాఖ్యానించారు. కాగా, అభిషేక్‌లో ఉన్న దూకుడు, నిర్భయ బ్యాటింగ్, మ్యాచ్‌ను ఒంటరిగా గెలిపించే సామర్థ్యం టీమిండియాకు పెద్ద బలమని శాస్త్రి తెలిపారు.

ఇక, అభిషేక్ శర్మ గతంలో ఇంగ్లాండ్‌పై వాంఖడే స్టేడియంలో ఆడిన చారిత్రక ఇన్నింగ్స్‌ను కూడా రవిశాస్త్రి గుర్తు చేసుకున్నారు. ఆ మ్యాచ్‌లో అభిషేక్ 54 బంతుల్లో 135 పరుగులు చేసి, 7 ఫోర్లు, 13 సిక్సులతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మొత్తం మీద 150 పరుగుల మైలురాయిని అందుకున్న ఆ ఇన్నింగ్స్‌ను అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో తాను చూసిన అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటిగా ఆయన అభివర్ణించారు. ఆ మ్యాచ్ తర్వాత శర్మని ఇంటర్వ్యూ చేసినప్పుడు, అతడి భుజంపై చేయి వేసి 'యువకా, ఇది నేను చూసిన అత్యుత్తమ టీ20 ఇన్నింగ్స్' అని చెప్పాను.. ఆ కుర్రాడు నిజంగా ఒక స్టార్ క్రికెటర్.. అతడు బ్యాటింగ్ చేస్తున్నాడంటే టీవీ ఆన్ చేయకుండా ఉండలేం అని రవి శాస్త్రి అన్నారు.

# టీమిండియా కుర్రాళ్లు.. అరే ఏంట్రా ఇదీ!

**ముద్ర, న్యూ ఢిల్లీ**

టీ20 వరల్డ్ కప్ 2026కు సమయం దగ్గర పడుతోంది. ఈ మెగా టోర్నీకి సన్నద్ధమయ్యే క్రమంలో టీమిండియా ప్రస్తుతం న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ ఆడుతోంది. నాగ్‌పూర్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో భారత్ ఘనవిజయం సాధించినప్పటికీ, జట్టులో ఒక ప్రధాన లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అదే ఫీల్డింగ్. బ్యాటింగ్‌లో పరుగుల వరద పారిస్తున్నా, బౌలింగ్‌లో వికెట్లు తీస్తున్నా.. ఫీల్డింగ్‌లో చేస్తున్న తప్పిదాలు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వరల్డ్ కప్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.



నాగ్‌పూర్ వేదికగా జరిగిన తొలి టీ20లో టీమిండియా 238 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం న్యూజిలాండ్‌ను 190 పరుగులకే కట్టడి చేసి 48 పరుగుల తేడాతో విజయం అందుకుంది. విజయం చూడటానికి ఘనంగానే ఉన్నా, ఫీల్డర్లు చేసిన తప్పిదాలు మ్యాచ్ గమనాన్ని మార్చేలా కనిపించాయి. ముఖ్యంగా కివీస్ విధ్వంసకర బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్ ఇచ్చిన అవకాశాలను భారత ఫీల్డర్లు చేజార్చారు. సంజూ శామ్సన్ ఒక సులువైన రన్‌అవుట్ ఛాన్స్‌ను వదిలేశాడు. అప్పటికి ఫిలిప్స్ 41 పరుగుల వద్ద ఉన్నాడు, కానీ ఆ లైఫ్ లైన్‌ను అతను 78 పరుగుల వరకు వెళ్లి భారత్‌ను భయపెట్టాడు.

కేవలం రన్ అవుట్లు మాత్రమే కాదు, క్యాచ్‌ల విషయంలోనూ భారత ఆటగాళ్లు దారుణంగా విఫలమయ్యారు. రింకూ సింగ్ వంటి నమ్మకమైన ఫీల్డర్ కూడా మార్క్ చాప్‌మ్యాన్ ఇచ్చిన ఈజీ క్యాచ్‌ను వదిలేశాడు. ఇక ఇన్నింగ్స్ ఆఖర్లో డారిల్ మిచెల్ ఇచ్చిన క్యాచ్‌లను అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ ఒకరి తర్వాత ఒకరు నేలపాలు చేశారు. ఒక్క మ్యాచ్‌లోనే మూడు క్యాచ్‌లు, రెండు రన్ అవుట్ మిస్సులు అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చిన్న జట్లతో ఆడేటప్పుడు ఇవి పెద్దగా అనిపించకపోవచ్చు కానీ, వరల్డ్ కప్ వంటి పెద్ద టోర్నీల్లో ఒక్క క్యాచ్ మ్యాచ్ ఫలితాన్నే మార్చేస్తుంది.

గతంలో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లోనూ భారత్ ఇలాంటి ఫీల్డింగ్ తప్పిదాల వల్లే సిరీస్ కోల్పోయింది. ఇప్పుడు టీ20ల్లోనూ అదే పునరావృతం కావడం ఆందోళనకరం. ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ పర్యవేక్షణలో జట్టు మెరుగుపడుతుందని ఆశించినా, మైదానంలో ఫలితాలు మాత్రం ఆశాజనకంగా లేవు. వరల్డ్ కప్ భారత్‌లోనే జరగనుంది కాబట్టి, మన ఫీల్డర్లు సొంత గడ్డపై మరింత చురుగ్గా ఉండాలి. రాయ్‌పూర్‌లో జరగబోయే రెండో మ్యాచ్ కైనా ఈ తప్పులను సరిదిద్దుకోకపోతే, సూర్యకుమార్ యాదవ్ సేనకు కష్టాలు తప్పవు.

బౌలర్లు కష్టపడి వికెట్ అవకాశాలు సృష్టిస్తున్నప్పుడు, ఫీల్డర్లు సహకరించకపోతే వారి ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. వరల్డ్ కప్ గెలవాలంటే క్యాచ్ విన్ మ్యాచ్ అనే సూత్రాన్ని టీమిండియా తూచా తప్పకుండా పాటించాలి. మరి రాయ్‌పూర్ పోరులోనైనా మన ఫీల్డర్లు మెరుగ్గా రాణిస్తారో లేదో చూడాలి.

# 500 వికెట్లు.. 7 వేల పరుగులు

- టీమిండియా దరిదాపుల్లోకీ రాని రంజీ రారాజు
- దేశవాళి క్రికెట్‌లో అద్భుతాలు..
- సెలెక్టర్ల చూపులు మాత్రం దూరం

**ముద్ర, న్యూ ఢిల్లీ**

భారత దేశవాళీ క్రికెట్‌లో స్థిరత్వానికి మరో పేరు జలజ్ సక్సేనా. 20 ఏళ్లకు పైగా రంజీ ట్రోఫీలో ఆడుతూ, ఆల్‌రౌండర్‌గా అసాధారణ గణాంకాలు నమోదు చేసినా టీమిండియా జెర్సీ మాత్రం ఈ మధ్యప్రదేశ్ ఆటగాడిని పలకరించలేదు. 39 ఏళ్ల వయసులోనూ తగ్గని ఆటతో జలజ్ మరో చారిత్రక మైలురాయిని అందుకున్నాడు.



**టీమిండియా కల నెరవేరని కథ**

రైట్ హ్యాండ్ ఆఫ్ స్పిన్‌తో పాటు నమ్మకమైన మిడిలార్డర్ బ్యాటింగ్ జలజ్ బలం. టెస్ట్ ఫార్మాట్‌కు పూర్తిగా సరిపడే ఆటగాడిగా నిపుణులు చెబుతున్నా, భారత సెలెక్టర్లు మాత్రం అతడిని ఎప్పుడూ ప్రధాన జట్టు కోసం పరిగణనలోకి తీసుకోలేదు. తక్కువ ప్రదర్శనలు చేసిన ఆటగాళ్లు టీమిండియా అవకాశాలు దక్కించుకోగా, జలజ్ మాత్రం దేశవాళీ క్రికెట్‌కే పరిమితమయ్యాడు.

**ఫస్ట్ క్లాస్‌లో అరుదైన ఘనత**

2005లో మధ్యప్రదేశ్ తరఫున ఫస్ట్ క్లాస్ అరంగేట్రం చేసిన జలజ్ ఇప్పటివరకు 150 మ్యాచ్‌లు ఆడాడు. ఈ ప్రయాణంలో 500 వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో 7 వేలకుపైగా పరుగులు సాధించాడు. 14 సెంచరీలు, 34 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. బౌలింగ్‌లో 35 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శనలు, 10 సార్లు పది వికెట్ల ఘనతలు సాధించాడు. ఈ గణాంకాలు అతడిని దేశవాళీ క్రికెట్‌లో అరుదైన జాబితాలో నిలబెట్టాయి.

**భారత-ఏ వరకే పరిమితం**

ఈ స్థాయి ప్రదర్శనలతో జలజ్ భారతఏ జట్టు వరకే చేరగలిగాడు. అక్కడ కూడా నిలకడగా రాణించినా, ప్రధాన జట్టుకు పిలుపు రాలేదు. 2013లో ఆస్ట్రేలియాఏ, న్యూజిలాండ్ఏ జట్లపై ఆల్‌రౌండ్ ప్రదర్శనలు చేసినా పరిస్థితి మారలేదు.

**రంజీలో మరో మైలురాయి**

ప్రస్తుత రంజీ సీజన్‌కు ముందు కేరళ నుంచి మహారాష్ట్రకు మారిన జలజ్, గోవాతో మ్యాచ్‌లో 6 వికెట్లు తీసి మరోసారి సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌తో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 500 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు.

**లిస్ట్-ఏ, టీ20ల్లోనూ ప్రభావం**

లిస్ట్-ఏ ఫార్మాట్‌లో 109 మ్యాచ్‌ల్లో 2 వేలకుపైగా పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో 3 సెంచరీలు, 7 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. బౌలింగ్‌లో 123 వికెట్లు తీశాడు. టీ20ల్లో 73 మ్యాచ్‌ల్లో 77 వికెట్లు పడగొట్టడంతో పాటు 688 పరుగులు చేశాడు. మూడు ఫార్మాట్లలోనూ నిలకడగా రాణించడం జలజ్ ప్రత్యేకత.

**రికార్డుల పుస్తకంలో జలజ్**

రంజీ ట్రోఫీ చరిత్రలో 6 వేల పరుగులు, 400 వికెట్లు సాధించిన తొలి ఆటగాడు ఒకే మ్యాచ్‌లో రెండు సెంచరీలు, 8 వికెట్లు తీసిన తొలి భారతీయుడు

**గోవాపై మహారాష్ట్ర ఆధిపత్యం**

జలజ్ (346796) ధాటికి గోవా తొలి ఇన్నింగ్స్‌లో 209 పరుగులకే ఆలౌటైంది. రామకృష్ణ ఘోష్, విక్కీ ఓస్వాల్ తలో రెండు వికెట్లతో సహకరించారు. గోవా ఇన్నింగ్స్‌లో స్నేహల్ కౌతాంకర్ 73 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. రుతరాజ్ గైక్వాడ్ 66 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. ప్రస్తుతం సౌరభ్ నవలే, జలజ్ క్రీజ్‌లో ఉన్నారు.



# దూబే కొత్త హెయిర్‌స్టైల్ చూసి ఆడుకుంటున్న నెటిజన్స్

**ముద్ర, న్యూ ఢిల్లీ**

శివమ్ దూబే సాధారణంగా తన ఫిట్‌నెస్, లాంగ్ సిక్సర్లతో ఎప్పుడూ వార్తల్లో ఉంటాడు. కానీ న్యూజిలాండ్‌తో జరిగిన మొదటి టీ20లో అతను ఒక కొత్త హెయిర్‌స్టైల్‌తో మైదానంలోకి దిగాడు. అది ఎలా ఉందంటే.. చిన్నప్పుడు అమ్మ మన తలకి నిండుగా నూనె రాసి, దువ్వెనతో నీట్‌గా పక్కకి దువ్వి స్కూల్‌కి పంపించే గుడ్ బాయ్ లుక్ లా ఉంది. ఈ లుక్ చూసిన వెంటనే నెటిజన్లు రకరకాల మీమ్స్‌తో సోషల్ మీడియాను నింపేశారు. ముఖ్యంగా 90వ దశకంలో పుట్టిన వారు.. "మా అమ్మ కూడా నన్ను ఇలాగే తయారు చేసేది" అంటూ ఎమోషనల్ కామెంట్స్ చేస్తున్నారు.

సోషల్ మీడియాలో ఈ హెయిర్‌స్టైల్‌పై వెల్లువెత్తిన రియాక్షన్లు చూస్తే నవ్వు ఆగదు. ఒక నెటిజన్ తన ఫోటోను తారక్ మెహతా కా ఉల్టా చష్మా షోలోని బాగా క్యారెక్టర్‌తో పోల్చగా, మరికొందరు సచిన్ టెండూల్కర్ చిన్నప్పటి లుక్ పోలి ఉందని కామెంట్ చేస్తున్నారు. ఇంకొకరు రెండు ఫోటోలను పోస్ట్ చేస్తూ.. "నేను రెడీ అయితే ఎలా ఉంటాను vs మా అమ్మ నన్ను రెడీ చేస్తే ఎలా ఉంటాను" అంటూ సెటైర్లు వేశారు. ఈ సరదా మీమ్స్ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.ఈ వైరల్ ట్రెండ్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు కూడా చేరింది. శివమ్ దూబే ప్రాక్టీస్ సెషన్‌లో ఉన్న ఒక వీడియోను షేర్ చేస్తూ.. "ప్రతి భారతీయ తల్లికి ఇష్టమైన హెయిర్‌స్టైల్" అని క్యాప్షన్ ఇచ్చింది. దీనికి టీమిండియా ఆటగాళ్లు అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్ కూడా దూబేను ఆటపట్టించారు. దీనిపై దూబే స్పందిస్తూ.. "దీనిని క్యూట్ హెయిర్‌స్టైల్ అంటారు" అంటూ నవ్వుతూ రిప్లై ఇచ్చారు. జట్టు సభ్యుల మధ్య ఉన్న ఈ సరదా వాతావరణం ఫ్యాన్స్‌ను అలరిస్తోంది.ఇక ఆట విషయానికి వస్తే.. మొదటి టీ20లో దూబే ప్రదర్శన సోసోగా ఉంది. బ్యాటింగ్‌లో కేవలం 9 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచినప్పటికీ, బౌలింగ్‌లో మాత్రం సత్తా చాటాడు. కీలకమైన 2 వికెట్లు తీసి కివీస్ స్కోరును కట్టడి చేయడంలో తన వంతు పాత్ర పోషించాడు. హెయిర్‌స్టైల్ ఎలా ఉన్నా, తర్వాతి మ్యాచ్‌లో దూబే తన బ్యాట్‌తో పరుగుల వర్షం కురిపించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
24.01.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**సిల్లీ పాయింట్ : పెన్నుల మాయం**

కొత్త పెన్ను కొన్నప్పుడు ఉన్న శ్రద్ధ, అది సగం అయిపోయేసరికి ఉండదు. అసలు ఆ పెన్ను ఎక్కడ పడేస్తామో కూడా మనకు తెలియదు.



# రజినీకాంత్ చిరంజీవి చేసి ఉంటే?

- **సౌత్ ఇండియా షేక్ అయ్యే మూవీ మిస్**



తెలుగు సినిమా ఇండస్ట్రీకి గత 50 సంవత్సరాలుగా ఎనలేని సేవలను అందిస్తూ ముందుకు దూసుకెళ్తున్న హీరోల్లో మెగాస్టార్ చిరంజీవి మొదటి స్థానంలో ఉంటాడు... రెండు తెలుగు రాష్ట్రాల్లో చిరంజీవిని అభిమానించని ప్రేక్షకులు ఉండరని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. కెరియర్ స్టార్టింగ్ లోనే వరుస సినిమాలను చేస్తూ ప్రేక్షకులందరిని మెప్పించిన చిరంజీవి ప్రస్తుతం 70 సంవత్సరాల వయసులో కూడా ఎక్కడ తగ్గకుండా యంగ్ హీరోలకు పోటీని ఇస్తూ ముందుకు సాగుతుండటం విశేషం... ఆయన నుంచి వచ్చిన సినిమాలకు మంచి రెస్పాన్స్ వస్తుంది. ప్రేక్షకులందరు అతన్ని స్క్రీన్ మీద చూసి ఎంజాయ్ చేయడానికి ఆసక్తి చూపిస్తుండటం విశేషం... తమిళ్ సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోగా మారిన రజనీకాంత్ వరుస సినిమాలను చేస్తూ సూపర్ సక్సెస్ లను సాధించాడు. ఇక ఆయన సినిమాలను తెలుగులో డబ్ చేస్తూ ప్రేక్షకుల నుంచి విశేషమైన ఆదరణను సంపాదించుకున్నాడు. మొత్తానికైతే రజనీకాంత్ తమిళ్ హీరో అయినప్పటికి అతని సినిమా రిలీజైతే మాత్రం ఆయన సినిమాలకు తెలుగులో భారీ ఓపెనింగ్స్ వస్తాయి. అందువల్లే రజనీకాంత్ కు తెలుగులో సైతం విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంటుందని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు... ఇక చిరంజీవి రజనీకాంత్ ఇద్దరు కలిసి కెరియర్ స్టార్టింగ్ లో ఒకటి రెండు సినిమాల్లో నటించినప్పటికి వీళ్ళు స్టార్ హీరోలు అయిన తర్వాత మాత్రం ఒక్క సినిమాలో కూడా కలిసి నటించారు... 1999వ సంవత్సరంలో వచ్చిన స్నేహం కోసం సినిమాలో వీళ్ళిద్దరు కలిసి నటించాలనే ప్రయత్నం చేశారు కానీ అది వర్కౌట్ కాలేదు. రజనీకాంత్ కి అత్యంత ఆప్తుడు అయిన కే ఎస్ రవికుమార్ డైరెక్షన్ లో చిరంజీవి 'స్నేహం కోసం ' సినిమా చేశాడు.కాబట్టి ఈ సినిమాలో విజయ్ కుమార్ పోషించిన పాత్రలో రజనీకాంత్ ఉంటే బాగుంటుందని కే ఎస్ రవికుమార్ భావించినప్పటికి అది కార్యరూపం దాల్చలేదు. ఇక ఏది ఏమైనా కూడా ఆ పాత్రను రజనీకాంత్ చేసి ఉంటే సినిమా నెక్స్ట్ లెవెల్లో ఉండేది. మొత్తానికైతే చిరంజీవి రజనీకాంత్ కాంబినేషన్లో రావాల్సిన ఒక మంచి సినిమా మిస్ అయిందనే చెప్పాలి. నిజానికి ఈ సినిమాలో వీళ్ళిద్దరు కలిసి నటిస్తే ఆ ఫ్రెండ్షిప్ మధ్య ఉన్న బాండింగ్ అనేది చాలా అద్భుతంగా ఉండేది. సినిమా స్క్రీన్ మీద కూడా అది భారీగా ఎలివేట్ అయ్యేది అంటూ పలువురు సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు...

# వారణాసి vs స్పిరిట్.. దేని దమ్ము ఎంత?





దర్శక ధీరుడి గా తనకంటూ ఒక ఐడెంటిటి క్రియేట్ చేసుకున్న డైరెక్టర్ రాజమౌళి... ఆయన చేసిన ప్రతి సినిమాలో ఏదో ఒక వైవిధ్యమైన కథాంశమైతే ఉంటుంది. ఇప్పటివరకు ఆయన చేసిన సినిమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించడమే కాకుండా యావత్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీ ప్రేక్షకులందరిని తన వైపు తిప్పుకునేలా చేశాడు. బాహుబలి సినిమాతో ఎక్కడలేని గుర్తింపును సంపాదించుకున్న ఆయన 'త్రిబుల్ ఆర్' సినిమాతో ఇంటర్నేషనల్ వైడ్ గా మంచి పాపులారిటిని సంపాదించుకున్నాడు. ఇక ప్రస్తుతం మహేష్ బాబు తో వారణాసి అనే సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా పాన్ వరల్డ్ నేపథ్యంలో తెరకెక్కుతుంది. ఈ సినిమాలో మహేష్ బాబు డిఫరెంట్ గా కనిపించబోతున్నాడు. రాజమౌళి సైతం ఇంతకుముందు చేసిన సినిమాలన్నింటిని పక్కనపెట్టి ఈ సినిమా కోసం కొత్త పంథాలో ముందుకు సాగుతున్నట్టుగా తెలుస్తుంది. ఇక రాజమౌళి సినిమాలో ఎలివేషన్స్ నెక్స్ట్ లెవెల్లో ఉంటాయి. ఈ సినిమాల్లో ఏ రేంజ్ ఎలివేషన్స్ ను చూపించబోతున్నాడు అనేది తెలియాలంటే మాత్రం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే...

అర్జున్ రెడ్డి సినిమాతో స్టార్ డైరెక్టర్ గా మారిపోయిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగ... బోల్డ్ కంటెంట్ తో తెరకెక్కించి సూపర్ సక్సెస్ ని సాధిస్తాడు. అలాంటి దర్శకుడు ప్రస్తుతం ప్రభాస్ తో స్పిరిట్ అనే సినిమా చేస్తున్నాడు. ప్రభాస్ ఇండియా వైడ్ గా భారీ పాపులారిటిని సంపాదించుకున్న విషయం మనకు తెలిసిందే. ఇక ఇతర దేశాల్లో కూడా ప్రభాస్ కి చాలా మంచి ఫాలోయింగ్ ఉంది... పాన్ వరల్డ్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా గొప్ప విజయాన్ని నమోదు చేయగలుగుతుందా? లేదా అనేది తెలియాల్సి ఉంది... ఇక ఇప్పటివరకు సందీప్ రెడ్డి వంగ తను చేసిన సినిమాలతో పాటు ప్రేక్షకుల్లో ఒక ఇంటెన్స్ డ్రామాను కూడా క్రియేట్ చేశాయి. మరి ఈ సినిమాలో ఏ రేంజ్ యాక్షన్ ఉండబోతుంది ప్రభాస్ స్టామినాను పూర్తిగా వాడుకోబోతున్నాడా లేదా అనేది తెలియాల్సి ఉంది...ఇక ప్రస్తుతం వారణాసి స్పిరిట్ రెండు సినిమాల మధ్య తీవ్రమైన పోటీ అయితే ఉంది. ఈ రెండు సినిమాలు 2027 వ సంవత్సరంలో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి.

# ప్రేమ కథను బయటపెట్టిన చిట్టీ

'జాతిరత్నాలు' సినిమాలో చిట్టి పాత్రలో అందం, అభినయంతో మెప్పించిన అమ్మాయి ఫరియా అబ్దుల్లా. థియేటర్ ఆర్టిస్ట్ అయిన ఈ హైదరాబాద్ అమ్మాయి.. 'జాతిరత్నాలు' లాంటి మరో మంచి బ్రేక్ కోసం గట్టిగానే ప్రయత్నిస్తోంది. కానీ కథానాయికగా నటించిన లవ్ షేర్ సబ్‌స్క్రైబ్, రావణాసుర, ఆ ఒక్కటీ అడక్కు తనకు తీవ్ర నిరాశనే మిగిల్చాయి. 'మత్తు వదలరా 2' హిట్టయినా ప్రేక్షకుల ఫోకస్ మొత్తం సత్య మీద నిలిచి, ఫరియాకు పెద్దగా క్రెడిట్ రాలేదు. ఇటీవలే 'గుర్రం పాపిరెడ్డి'తో పలకరించిన ఫరియాకు ఆ సినిమా ఆశించిన ఫలితాన్నివ్వలేదు. అయినా ఫరియాకు అవకాశాలకైతే లోటు లేనట్లే కనిపిస్తోంది. ఓవైపు కథానాయికగా నటిస్తూ.. చిన్న చిన్న పాత్రలూ చేస్తూ ముందుకు సాగోతోంది. ఫరియా వ్యక్తిగత జీవితం గురించి తాజాగా ఆసక్తికర విషయం వెల్లడైంది. ఆమె రిలేషన్‌షిప్‌లో ఉందట.

హీరోయిన్ల ప్రేమాయణం గురించి మీడియాలో ఊహాగానాలు రావడమే కానీ.. వాళ్లకు వాళ్లుగా దాని గురించి ఓపెన్ కావడం అరుదు. ఫరియా ఆ పనే చేసింది. కాకపోతే తన బాయ్ ఫ్రెండ్ పేరు చెప్పకుండా తనేం చేస్తాడో మాత్రం వెల్లడించింది. ఫరియా ప్రేమిస్తున్న వ్యక్తి ఇండస్ట్రీకి చెందిన వాడేనట. అతనొక కొరియోగ్రాఫరట. కొన్నేళ్లుగా ఫరియా అతడితో రిలేషన్‌షిప్‌లో ఉందట.

"కొంత కాలంగా నా డ్యాన్స్, ర్యాప్‌లో మార్పు రావడానికి నా బాయ్‌ఫ్రెండే కారణం. అతను సినీ రంగానికి చెందిన వ్యక్తే. కొరియోగ్రఫీలో తన ప్రతిభతో ముందుకు వెళ్తున్నాడు. మేమిద్దరం కలిసి పని చేస్తూ ఒక టీంగా ముందుకు వెళ్తున్నాం. మాది కేవలం ప్రేమ బంధం మాత్రమే కాదు. జీవితానికి సంబంధించి బలమైన అనుబంధం. ఇండస్ట్రీలో ఉంటూ పర్సనల్ లైఫ్, ప్రొఫెషనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకోవడం వెనుక నా బాయ్ ఫ్రెండ్ ప్రోత్సాహం ఎంతో ఉంది" అని ఫరియా తెలిపింది. తన ప్రియుడు కొరియోగ్రాఫర్ అని ఫరియా హింట్ ఇవ్వడంతో.. ఆ వ్యక్తి ఎవరా అని నెటిజన్లు తెగ చర్చించుకుంటున్నారు.

# నిధి వెడ్డింగ్ మార్చ్..

**నలుగురు పిల్లలు కావాలంటున్న ఇస్మార్ట్ బ్యూటీ**



నిధి అగర్వాల్‌కు ఇటీవల కాలంలో నటిగా ఆశించిన ఫలితాలు దక్కడం లేదు. స్టార్ హీరోల సరసన అవకాశాలు వచ్చినప్పటికీ, బాక్సాఫీస్ విజయాలు మాత్రం దూరంగా ఉన్నాయి. పవన్ కళ్యాణ్‌తో చేసిన 'హరి హర వీరమల్లు' ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోగా, సంక్రాంతి సందర్భంగా విడుదలైన ప్రభాస్ చిత్రం 'ది రాజాసాబ్' మిశ్రమ స్పందనకే పరిమితమైంది. అయినా నిరుత్సాహపడకుండా తన తదుపరి చిత్రాలపై నిధి దృష్టి పెట్టింది.

ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూలో ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెల్లడించింది. చిన్నప్పటి నుంచే పిల్లలంటే తనకు ప్రత్యేకమైన ఇష్టమని నిధి తెలిపింది. తనకు ఏడేళ్ల తర్వాత చెల్లి పుట్టిందని, ఆమెను కూతురిలా చూసుకున్నానని భావోద్వేగంగా చెప్పింది. పెళ్లి గురించి ఇప్పట్లో ఆలోచన లేదని, కానీ తన జీవితంలో నలుగురు పిల్లలు ఉండాలన్నది మాత్రం గట్టి కోరికగా పేర్కొంది. పిల్లల పెంపకం ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన నిధి, దత్తతపై కూడా స్పందించింది. సుస్మితా సేన్‌ను ఆదర్శంగా తీసుకుని, పెళ్లికి ముందే పిల్లలను దత్తత తీసుకోవాలనుకున్నానని తెలిపింది. ప్రస్తుతం వృత్తిపరమైన బిజీ షెడ్యూల్ కారణంగా అది సాధ్యం కావడం లేదని, భవిష్యత్తులో మాత్రం తప్పకుండా నలుగురు పిల్లలను దత్తత తీసుకుంటానని స్పష్టం చేసింది. నిధి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారగా, ఆమె ఆలోచనలకు నెటిజన్లు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.



# కర్లీ అనుపమ.. అందాలు చూడతరమా?

ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తన అద్భుతమైన నటనతో.. అందంతో.. అందరినీ ఆకర్షించే ఈ ముద్దుగుమ్మ.. తన కర్లీ జుట్టుతో కూడా అభిమానులను మెస్మరైజ్ చేస్తూ ఉంటుంది. ఇకపోతే తన కర్లీ హెయిర్ తో ఎప్పటికప్పుడు ఆకట్టుకునే ఈమె.. తాజాగా వీటిని ప్రధానంగా చేసుకొని ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు పంచుకుంది. అందమైన కర్లీ జుట్టును కలిగివున్న అనుపమ పరమేశ్వరన్ వైట్ డ్రెస్ ధరించి తన అందాలతో ఆకట్టుకుంది. కాటుక కళ్ళతో అభిమానులను మాయ చేస్తున్న ఈమె.. ఈ ఫోటోలను షేర్ చేస్తూ కర్లీ కళ్యాణి అంటూ క్యాప్షన్ జోడించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో కర్లీ కళ్యాణి అందానికి ఎవరైనా దాసోహం అవ్వాల్సిందే అంటూ కామెంట్లు చేస్తున్నారు నెటిజన్స్. ప్రస్తుతం అనుపమ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తన అద్భుతమైన నటనతో.. అందంతో.. అందరినీ ఆకర్షించే ఈ ముద్దుగుమ్మ.. తన కర్లీ జుట్టుతో కూడా అభిమానులను మెస్మరైజ్ చేస్తూ ఉంటుంది. ఇకపోతే తన కర్లీ హెయిర్ తో ఎప్పటికప్పుడు ఆకట్టుకునే ఈమె.. తాజాగా వీటిని ప్రధానంగా చేసుకొని ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు పంచుకుంది. అందమైన కర్లీ జుట్టును కలిగివున్న అనుపమ పరమేశ్వరన్ వైట్ డ్రెస్ ధరించి తన అందాలతో ఆకట్టుకుంది. కాటుక కళ్ళతో అభిమానులను మాయ చేస్తున్న ఈమె.. ఈ ఫోటోలను షేర్ చేస్తూ కర్లీ కళ్యాణి అంటూ క్యాప్షన్ జోడించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో కర్లీ కళ్యాణి అందానికి ఎవరైనా దాసోహం అవ్వాల్సిందే అంటూ కామెంట్లు చేస్తున్నారు నెటిజన్స్. ప్రస్తుతం అనుపమ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

తెలుగులోనే కాకుండా తమిళ్లో ధనుష్ హీరోగా నటించిన తమిళ సినిమా 'కోడి' లో నటించి తొలిసారి తమిళ సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. అలా వరుస చిత్రాలలో నటిస్తూ భారీ పాపులారిటీ అందుకున్న అనుపమ పరమేశ్వరన్ కి 2025 సంవత్సరం భారీగా కలిసి వచ్చింది అని చెప్పాలి. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటించిన 'కిష్కింధపురి' సినిమాలో దెయ్యం పాత్రలో అందరిని బెదరగొట్టేసింది. ఆ తర్వాత వచ్చిన ' పరదా' లేడీ ఓరియంటెడ్ మూవీ.. ఒక వర్గం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది అనే చెప్పాలి. ఇక ఆ తర్వాత 'బైసన్' అనే సినిమాలో నటించి, మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇందులో ప్రముఖ కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా నటించారు. ఇకపోతే ఈ సినిమా సమయంలో వీరిద్దరూ రిలేషన్ లో ఉన్నారు అంటూ వార్తలు రాగా.. అవన్నీ పుకార్లుగానే మిగిలిపోయాయి. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా ఇలా పలు రకాల ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది ఈ ముద్దుగుమ్మ.

# పెద్దిలో 'జిగేలు రాణి'

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' అనే పక్కా రూరల్ స్పోర్ట్స్ డ్రామా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా నుండి వచ్చిన 'చికిరి చికిరి' సాంగ్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. లేటెస్ట్ గా ఈ సినిమా గురించి ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ ఫిలిం నగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అదేంటంటే, ఈ చిత్రంలో ఒక అదిరిపోయే 'స్పెషల్ సాంగ్' ఉండబోతోందని సమాచారం.

ఈ స్పెషల్ సాంగ్ కోసం చిత్ర యూనిట్ ఇప్పటికే 'సీతారామం' బ్యూటీ మృణాల్ ఠాకూర్‌ను సంప్రదించినట్లు టాక్ వినిపిస్తోంది. సుకుమార్ శిష్యుడైన బుచ్చిబాబు, తన గురువు 'రంగస్థలం'లో 'జిగేలు రాణి'తో క్రియేట్ చేసిన వైబ్స్‌ను మళ్ళీ 'పెద్ది'లో రిపీట్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. ఈ సాంగ్ కోసం ఏఆర్ రెహమాన్ ఇప్పటికే ఒక హుషారైన మాస్ ట్యూన్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం.

మృణాల్ ఠాకూర్ ఇప్పటివరకు ఎక్కువగా క్లాస్ పాత్రల్లోనే కనిపించింది. కానీ ఈ స్పెషల్ సాంగ్ కోసం ఆమెను మేకర్స్ అడిగినట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇది నిజమైతే, చరణ్ మాస్ స్టెప్పులకు తోడు మృణాల్ గ్లామర్ తోడైతే థియేటర్లు దద్దరిల్లడం ఖాయం. రంగస్థలంలో పూజా హెగ్డే ఎలాగైతే సర్ప్రైజ్ ఇచ్చిందో, ఇప్పుడు పెద్దిలో మృణాల్ కూడా అదే రేంజ్‌లో సందడి చేయబోతున్నట్లు తెలుస్తోంది.

ఈ స్పెషల్ సాంగ్ కోసం మేకర్స్ భారీ ఎత్తున సెట్ వేయబోతున్నారని, మృణాల్‌కు కూడా భారీ రెమ్యూనరేషన్ ఆఫర్ చేసినట్లు టాక్. అయితే దీనిపై ఇంకా అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది. ఇప్పటివరకు శ్రీలీల, సమంత పేర్లు వినిపించినప్పటికీ, ప్రస్తుతానికి మృణాల్ పేరు గట్టిగా వినిపిస్తోంది. బుచ్చిబాబు తన సెకండ్ మూవీతోనే మాస్ ఆడియన్స్‌ను మెప్పించడానికి అన్నీ విధాలుగా సిద్ధం చేసుకుంటున్నారు. మార్చి 27న చరణ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమా థియేటర్లలోకి రాబోతోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com